ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



వెల


4 అణాలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY


సంపుటము 42 సంచిక 15

డిశంబరు 7 1949


★ వార్తా చిత్రాలు ★



వంబరు 30-వ తేదీన, శ్రీ జి. యస్. గుప్తాగారి అధ్యక్షతను ఢిల్లీలో జరిగిన భాషాప్రక్షణల సమావేశం. శ్రీయుతులు ఆర్. ఆర్. దివాకర్, డా॥ కె. రాజా, గోపాలచంద్ర సిన్హా, డాక్టర్ ఛటర్జీ, రాహుల్ సాంకృత్యాయన్, బాలకృష్ణ, వై. ఆర్. దతీ మొదలైన ప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లాబోర్డు అధ్యక్షుడుగ ఎన్నికైన శ్రీ మారిన నరసన్నగారికి గోకవరంఫిర్కా యర్రపాలెంలో మదునీటి నర్సరాజుగారు విందుచేసినప్పుడు తీసినఫోటో.



గుత్తిహైస్కూలులో 26-వ తేదీన గాంధీవిగ్రహ ఆవిష్కరణ జరిగినప్పుడు ఊరేగింపు



భరతవైమానికదళాధిపతి ఎయిర్ మార్షల్ ఎల్మ్హర్స్టు ఆవడిలో ఆర్. ఐ. ఏ. యస్. కేంద్రమున జరిగిన పెరేడుకు వెళ్లుచున్నారు

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము. 42

సంచిక 15

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర మార్గశిర బహుళ విదియ బుధవారము



"మూడుకొమ్మల కొబ్బరిచెట్టు"

(ఉప్పలగుప్తం, తూర్పుగోదావరిజిల్లాలో ఉన్నది.)

ఆంధ్రపత్రిక

1949-వ సం॥ డిశంబరునెల 7-వ తేది బుధవారము

ఢిల్లీ సమావేశ సూచనలు

"తుపానులు రానివ్వండి; భూకంపములు రానివ్వండి; మరి ఇతరఅవాంతరములు ఎన్ని అయినా రానివ్వండి, 1951 అనంతరము ఆహారధాన్యముల దిగుమతి ఉండరాదని మే మిదివరలో చేసుకొనిన నిర్ణయము ఎంతమాత్రము మారదు" అని భారత ప్రధానమంత్రి గతమాసము 28, 29 తేదీలందు జరిగిన వ్యవసాయశాఖఉద్యోగుల సమావేశమునందు చేసిన విస్పష్టప్రకటన రాష్ట్రప్రభుత్వములను, భారత ప్రజానీకమును కలవరపెట్టుటకుబదులు ఆ లక్ష్యసాధనకు దీక్ష వహించి కార్యోన్ముఖులను చేయవలసియున్నది. పండిట్ నెహ్రూ ప్రకటించినట్లు ప్రస్తుతము ప్రభుత్వములు, ప్రజలుకూడ తమ తాహతుకు మించిన ఖర్చులను చేయుచుండిరి. భారతఆర్థికవ్యవస్థ స్థిరపడవలెననిన ఈ శక్తిని మించిన ఖర్చును తగ్గించుకొనక తప్పదు.

ఆహారధాన్యముల దిగుమతిక్రింద ఏటా ప్రభుత్వము విశేషధనమును వ్యయపరచుచున్నది. ఈ ఖర్చును సాధ్యమైనంతత్వరలో పూర్తిగ తగ్గించుట యవసరమె ఈ ఖర్చును తగ్గించుకొనుటతోబాటు, పరిశ్రమాభివృద్ధికి అవసరమైన కీలకయంత్రములను దిగుమతి చేసుకొనుటకు డాలరులను కూడ సంపాదింపవలసియున్నది. ఇందుకు వాణిజ్యపంటలను ఎక్కువగ ప్రోత్సహింపవలసియున్నది. ఒకవర్గమువారు అధికాహారోత్పత్తికార్యక్రమము ఫలప్రదము కాకపోయినను, వాణిజ్యపంటలను అభివృద్ధిచేయుటద్వారా లభించు డాలర్లు, ఇతరవిదేశీద్రవ్యముతో భారతదేశము తన కవసరమైన ఆహారధాన్యమును దిగుమతి చేసుకొన వీలగునని సూచించిరి. భారత ప్రభుత్వ ఆహారశాఖాకమిషనర్ శ్రీ ఆర్. కె. పాటిల్‌గారు అధికాహారోత్పత్తి వలన వాణిజ్యపంటల అభివృద్ధికి అంతరాయములు కలుగవని, రెండును ఏకకాలమున జరుగుట సాధ్యమని ప్రకటించియుండెను.

ప్రస్తుతపరిస్థితులలో ఆహారధాన్యములను పండించుటకంటె వాణిజ్యపంటలను పండించుట ఎక్కువ లాభకరముగనున్నది. గనుక రైతులు వాణిజ్యపంటలను పండించుటలో ఎక్కువ ఉత్సాహమును చూపుచుండిరి. అట్లుగాక ఆహారధాన్యములను పండించు రైతులకు కూడ వ్యవసాయము గిట్టుబాటగునట్లు చేసి, ఇతర పంటల పండించువారు లాభంపొందుచున్నట్లె వీరును లాభము పొందునట్లు ప్రభుత్వమువారు తగిన చర్యలు తీసుకొనిన దేశ ఆహారసమస్యలెగాక, ప్రజల జీవనప్రమాణహెచ్చింపు సమస్యలు కూడ పరిష్కారము కాగలవు. కనుక ప్రభుత్వము అధికాహారోత్పత్తిసమస్యలను విచారించునపుడు ముఖ్యముగ ఈ విషయమును దృష్టియం దుంచుకొనవలసియున్నది.

ఇతరవస్తువుల ధరలను తగ్గింపక కేంద్రప్రభుత్వము ఇటీవల ధాన్యసేకరణధరను తగ్గించెను. ఇందువలన అధికాహారోత్పత్తి కార్యక్రమమునకు ఎట్టి విఘాతము కలుగునో క్రమేణాగాని ప్రభుత్వఅనుభవమునకు రాదు. అందువలననె గతమాసాంతమున జరిగిన వ్యవసాయశాఖాధికారుల సమావేశము సాగువిధానము, సాగుపద్ధతులను గురించియె ఎక్కువగ చర్చించెను. అధికోత్పత్తికి ప్రస్తుతము దేశమునందు హెచ్చుగ నున్న చిన్న, చిన్న కమతములు తీవ్రప్రతిబంధకములని ఢిల్లీసభవారు భావించిరి. సహకారపద్ధతులద్వారా గాని, చిన్న కమతముల ఏకీకరణద్వారా గాని, లేక ప్రభుత్వమే సాగుచేయించుటవలన గాని ఈ ప్రతిబంధకములను తొలగింపవలసియుండు నని వ్యవసాయశాఖాధికారులు అభిప్రాయపడిరి. ప్రధానమంత్రి పండిత నెహ్రూ భారతదేశ ఆర్థికవ్యవస్థనుగురించి అనేకపర్యాయములు చేసిన ప్రసంగములందుస్పష్టము చేసినట్లు మన భూమిఅమరకము విధానమును ముందుగ సంస్కరింపవలసియున్నది. ఇందుకు కాంగ్రెసు ఒక ప్రత్యేకకమిటీనికూడ నియమించియుండెను. ఢిల్లీసమావేశములో వ్యవసాయశాఖాధికారులు చేసిన సూచనలు 'కుమారప్ప కమిటీ'లోని 'అల్పసంఖ్యాకుల' అభిప్రాయములకు అనుగుణముగ నున్నవి. కాబట్టి రాష్ట్రప్రభుత్వములు సహకారపద్ధతులపై సాగుచేయువిధానమును అమలు జరుపుటకు వెంటనే పూనుకొనవచ్చును. అయితే గ్రామమునకు అంతటికి ఒకే సహకారసంఘమును స్థాపించి తద్వారా ఈ కార్యక్రమమును కొనసాగించుటకంటె ఒక గరిష్ఠప్రమాణమును నిర్ణయించుకొని, ఆ ప్రకారము ఎంతమంది భూస్వాములు చేరిన సహకారసాగుపద్ధతి లాయకీగా నుండునో అంతమందిని చేర్చి అనేకసంఘములను గ్రామసంఘమునకు అనుబంధసంస్థలుగ నెలకొల్పుట మంచిది. ఈ కార్యక్రమమును నిర్బంధము చేయుటకంటె, ప్రచారముద్వారా, ప్రత్యక్షనిరూపణద్వారా రైతాంగమును ఆకర్షించుట ప్రయోజనకరము.

సహకారసాగుపద్ధతిని గురించి వాదప్రతివాదముల విరమించి గ్రామములందు ఎక్కువ ప్రచారము చేయుట అవసరము. అట్లె బంజరు భూముల సాగువిషయమునను ప్రభుత్వము ఎక్కువ ప్రోత్సాహ మివ్వవలసియుండును. అథమము అయిదు సంవత్సరములవరకు అట్టి భూములను సాగుచేయువారినుండి ఎట్టి పన్నులు వసూలు చేయక, సెస్సులు, నీటితీరువ మున్నగువాటిని విధించక, మొదటి రెండు సంవత్సరములు ఎరువులను, విత్తనములను ఉచితముగ నిచ్చి సేద్యమును ప్రారంభించుటకు ఋణములను గాక, 'గ్రాంటు'ను ఇవ్వవలసియుండును. ఏ కార్యక్రమమైనను దీక్షతో, క్రమబద్ధముగ నిర్వహింపబడిన ఫలింపక పోదు. ప్రస్తుతము అవే లోపముగ నున్నవి. ఆ లోపమును తీర్చుటకె ప్రభుత్వము కృషిచేయవలసియుండును.

వెల్లోడి ప్రభుత్వ కర్తవ్యము

హైదరాబాద్‌సంస్థానమున, ఎట్టి ఆర్భాటము, ఎట్టి పటాటోపము లేక చరిత్రాత్మకమైన మార్పులు జరుగుచున్నవి. ఇటీవల జరిగిన ప్రధాన మార్పులలో సంస్థానమును భారతసమితిలో చేర్చుచు నిజాం జారీచేసిన ఫర్మానాఒకటి. అటుతరువాత అంత ప్రధానమైనది సంస్థానప్రధానమంత్రిగ శ్రీ వెల్లోడి నియామకము. హైదరాబాదు నవాబు శరణుజొచ్చినఅనంతరము పదమూడు మాసములు సంస్థానమును పరిపాలించిన మిలిటరీగవర్నరు మేజర్ జనరల్ చౌదరీ డిసెంబరు 1-వ తేదీన ఉద్యోగమును విరమించెను. ఈ పదమూడుమాసములలో మేజర్ జనరల్ చౌదరీ సాధించిన మహత్కార్యములు క్రమక్రమముగగాని అనుభవమునకు రావు. ఆయనహోదా మిలిటరీగవర్నరే అయినప్పటికిని, సంస్థానమున ఎన్నడు, ఏప్రాంతమున సైనికపరిపాలన అమలు జరిగియుండలేదు. సంస్థానమున సెప్టెంబరు 13, 1948కి పూర్వము ప్రబలముగనున్న రజాకర్, కమ్యూనిష్టు ముష్కరులు పూర్తిగ గాకపోయినను చాలవరకు నిర్మూలింపకలిగెను. సంస్థానకాంగ్రెస్ నాయకులు ఏకమై ప్రజాశ్రేయస్సు నాకాంక్షించి వ్యవహరించిన ఎన్నడో సంస్థానమున ప్రజాప్రభుత్వస్థాపన సాధ్యమైయుండెడిది. సర్దార్ పటేల్ మొదలు భారతప్రభుత్వసంస్థానశాఖాసిబ్బంది యావత్తు సంస్థాన కాంగ్రెస్‌విభేదములను పరిష్కరించి నాయకులలో ఐకమత్యమును సాధించుటకు చేసిన ప్రయత్నములన్నియు విఫలమయ్యెను.

ఇపుడు సంస్థానప్రధానమంత్రిగ శ్రీ యం. కె. వెల్లోడిగారు సాధింపవలసినవి అనేకము గలవు. సంస్థానమున ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగములందు జరుగవలసిన సంస్కరణలన్నింటికి చౌదరిప్రభుత్వము పునాదులు వేసెను. వాటిపై నవ్యహైదరాబాద్ నిర్మాణము జరుగవలసియున్నది. మార్చిలో హైదరాబాద్‌రాజ్యాంగపరిషత్తుకు ఎన్నికలు జరుగనున్నవి. ఆ ఎన్నికల ఫలితములు ఎట్లుండునో వేరుగ చెప్పనవసరము లేదు. కాంగ్రెస్ అభ్యర్థులే విజయమును సాధింతురు. సంస్థానకాంగ్రెస్ లోగడ హైదరాబాద్ భాషాప్రయుక్తముగ విభాగము కావలెనని, నవాబుగిరి రద్దు కావలెనని, తీర్మానించియుండెను. హైదరాబాదురాజ్యాంగపరిషత్తు ఆశిరుక్షణములో బాహ్యశక్తులు ప్రమేయము కల్గించుకొనకున్న, సంస్థానకాంగ్రెస్ చేసిఉన్న తీర్మానమునే పునరుద్ఘాటన చేయవచ్చును. కనుక శ్రీ వెల్లోడి మంత్రివర్గము పరిషత్తు చేయబోవు నిర్ణయమును అమలుజరుపుటకు వీలుగ సంస్థాన ఆర్థిక, రాజకీయ, సాంఘిక వ్యవహారములను సరిదిద్దవలసి యుండును.

భూమి అమరికపువిధానము ఎట్లు సంస్కరింపబడవలెనో మిలిటరీగవర్నరుప్రభుత్వం నియమించిన ఉపసంఘం సూచిస్తూ నివేదిక తయారు చేసింది. ఆ సంస్కరణలను సాధ్యమైనంతత్వరలో అమలుజరిపిన, అరాచకశక్తులకు, ప్రజావిప్లవాన్ని ప్రోత్సహించడానికి ఉన్న ఒక్క అవకాశము తొలగిపోగలదు. ఆంధ్రరాష్ట్రంలో కొన్ని ప్రాంతముల కమ్యూనిస్టు చర్యలు ప్రబలుటకు తెలంగాణాయందలి పరిస్థితులే కారణము. కేంద్రప్రభుత్వము ఆంధ్రరాష్ట్రసత్వరనిర్మాణమునకు శీఘ్రచర్యలు తీసుకొనకుండుటకు ఈ పరిస్థితులు ఎక్కువగ కారణమని భారతప్రభుత్వహోంశాఖా కార్యదర్శి శ్రీ హెచ్. వి. ఆర్.

మనరాష్ట్రం : మనదేశం :

★ రాజేంద్రప్రసాద్ 65 వ జన్మదినోత్సవం.

★ ఆంధ్రరాష్ట్ర నిర్మాణ ప్రక్రియ, కొత్త ఆటంకాలు



భారత రాజ్యాంగ పరిషదధ్యక్షులు డా॥ రాజేంద్రప్రసాద్ డిసెంబరు 3 వ తేదీతో 65 వ ఏట అడుగుపెట్టారు. అజాతశత్రువని పేరుపొందిన రాజేంద్రప్రసాద్ స్వరాష్ట్రమైన బీహార్‌లో ఆదర్శపురుషుడైనాడు. బీహార్‌లో రాజేంద్రప్రసాద్ యావత్ప్రజానీకానికి ఆరాధ్యుడైనాడు.

జాతీయోద్యమాన్ని బ్రిటిష్ రాజరికం అణిచివెయ్యడానికి పూనుకున్న కాలంలో బెంగాల్ వంటి రాష్ట్రాలలో యువజనులు ప్రతీకారంగా దౌర్జన్యకార్యాలకు పూనుకొనగా దౌర్జన్యం బీహార్‌లో ప్రవేశించకుండా ఉద్యమాన్ని శాంతిపథంలో నడపగలిగాడు. జాతీయోద్యమానికి శత్రువులైనవారికికూడా రాజేంద్రబాబు పట్ల అమితగౌరవాదరాలుండేవి. శాంతస్వభావుడు, పవిత్రచరిత్రుడు. గాంధీమహాత్ముడుద్బోధించిన సత్యధర్మఅహింసలు ఎవరిలోనైనా సంపూర్ణవికాసం పొందినాయంటే అది రాజేంద్రప్రసాద్ ఒక్కరేనని చెప్పాలి.

స్వాతంత్ర్యప్రాప్తిఅనంతరం కాంగ్రెస్‌వాదులను పెనగొన్న పదవీవ్యామోహం, కక్షలు మొదలైనవాటి కన్నిటికి రాజేంద్రప్రసాద్ దరి చేరనీయలేదు. గాంధీజీనిర్మాణకార్యక్రమంలో విశ్వాసం ఇంకా మిగిలిఉన్న బహుకొద్దిమందిలో ఒకరు.

రాజ్యాంగపరిషత్తుకు అధ్యక్షుడుగా ప్రదర్శించిన కార్యదక్షత, నిష్పక్షపాతం, నియమపాలన యావద్దేశప్రశంసలనూ మారగొన్నాయి. జనవరి 26 తో ప్రారంభంకానున్న భారత రిపబ్లిక్ అధ్యక్షతస్థానాన్ని అలంకరించదగినదక్షులలో రాజేంద్రప్రసాద్ ఒకరు.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణ ప్రక్రియ :

ఆంధ్రరాష్ట్రనిర్మాణసమస్య తిరిగి మొదటికొచ్చినట్లు కనిపిస్తుంది. రాష్ట్రాన్ని "వెంటనే" నిర్మించడానికి భారతప్రభుత్వం తీర్మానించింది. అయితే నిర్మాణప్రక్రియ కుపక్రమించిన విధానంమాత్రం విచిత్రంగా ఉంది.

'వాదగ్రస్త విషయాలన్నిటినీ ప్రస్తుతానికి విడిచిపెట్టి ఏ పేచీ లేని పదకొండు తెలుగుజిల్లాలతోనూ నిర్మాణాని కంగీకరించాలని పట్టాభి-పటేల్-నెహ్రూనివేదిక విధించిన షరతుకు ఆంధ్రదేశం విధంచెడి అంగీకరించింది. కాని ఫలితం దక్కకుండా చెయ్యాలని తమిళనాయకులు ప్రయత్నిస్తున్నారు. తమిళనాయకులకి తగినట్లే కేంద్రవర్గాలవారుకూడా ప్రవర్తిస్తున్నారు. వాదగ్రస్తవిషయాల కిప్పటికి నీళ్లొదిలితేనే రాష్ట్రనిర్మాణాని కంగీకరిస్తామన్నారు. తీరా నీళ్లొదిలాక ఈ నీళ్లొదలడం ఇప్పటికే కాదు ఎప్పటికీ వొదలాలని కాబోలు కేంద్రంలో కూర్చున్న అధినాయకుల అభిప్రాయం.

అయ్యంగార్ చెన్నరాష్ట్రప్రభుత్వమునకు వ్రాసిన లేఖవలన స్పష్టమగుచున్నది. సంస్థానమునందు సంపూర్ణమైన శాంతి ఏర్పడి అరాచకశక్తుల నిర్మూలనము పూర్తియైన సంశ్లిష్ట రాష్ట్రములు తమ శక్తిని, ధనమును శాంతిభద్రతల రక్షణకు గాక ప్రజాభ్యుదయపథకములు అమలు జరుపుటకు వినియోగింప వీలగును. సంస్థానమున అట్టి పరిస్థితులను కల్పింపవలసిన బాధ్యత వెల్లోడిమంత్రివర్గంపై గలదు.

సర్వవిషయాల్నీ ఇప్పుడే తెగతెంపులు చేస్తేగాని గవర్నర్‌జనరల్‌ఉత్తరువు ఊడిపడదని కేంద్రప్రభుత్వంలో అంతరంగికశాఖా కార్యదర్శిగా దాపురించిన హెచ్. వి. ఆర్. అయ్యంగార్ మద్రాసుమంత్రివర్గానికి లేఖ పంపాడు. "ప్రసుత రాజ్యాంగశాసనప్రకారం నిర్మితమైనా లేక కొత్తరాజ్యాంగశాసనం ప్రకారం నిర్మితమైనా ఈ విషయాలన్నీ తేలవలసిఉన్నవే కాబట్టి ఇవన్నీ తేలినతరవాతగాని రాష్ట్రనిర్మాణం జరగడానికి వీల్లేదు కాబట్టి, వాని నిప్పుడే తేల్చక తప్పదు"అని అయ్యంగార్ లేఖలో అన్నారు.

గవర్నర్ జనరల్-ఉత్తరువు :

రెండేళ్లక్రిందట పండిట్ నెహ్రూ ఆంధ్ర రాష్ట్రనిర్మాణానికి చిక్కులేవీ లేవనీ, భారత ప్రభుత్వం త్వరలోనే ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించగలదనీ పార్లమెంటులో అన్నారు. వారి ప్రకటననుసరించి నూతనరాజ్యాంగరచనాసంఘం కొత్తరాష్ట్రాలేర్పడాలంటే ఏ పద్ధతి అవలంబించాలో వివరించారు. కొత్తరాజ్యాంగం ప్రకారం చాలా తతంగం ఉంది. ఈతతంగంలో ఎక్కడ బెసికినా బెసికిపోవడానికి, లేక బెసగొట్టడానికీ చాలా వీళ్లున్నాయి. అప్పైన పదేళ్లవరకూ కొత్త రాష్ట్రాల మాటే తలపెట్టడానికే వీలుండేదు. అందువలన 1935 రాజ్యాంగశాసనప్రకారమే గవర్నర్‌జనరల్‌ఉత్తరువును జారీచేసి, ఆపైపై కార్యవిధానాన్ని పూర్తిచేసి కొత్తరాజ్యాంగం ఆమోదించబడేలోగా ఒప్పగిస్తేగాని ఇప్పట్లో కొత్త రాష్ట్రాలు నిర్మించడానికింక వీలుపడదన్నారు. అందువల్ల గవర్నర్ జనరల్ చేత ఉత్తరువు యిప్పించడానికి యజ్ఞం ప్రారంభమయింది. థార్‌కమిషన్ వచ్చింది. జె. వి. పి. నివేదిక వచ్చింది. రాష్ట్రవిభజనసందర్భంలో పంజాబ్ హత్యలవంటివి సంభవించకుండా కట్టుదిట్టం చెయ్యాలని చెప్తూ అగ్రనాయకులు హిరణ్యాక్షవరాలన్నీ కోరారు. చెన్నపట్నం, చెంగల్పట్టు, గంజాం, కోరాపుట్టి మొదలైనవాటినిగురించి ఇప్పుడేమీ ఎత్తకుండా ఇటు అరవలకి అటు ఓఢ్రులకి ఒప్పగించి ఊరుకోగలిగినట్లయితే మిగతాప్రాంతాల్ని ఆంధ్రరాష్ట్రంగా నిర్మించి ఇస్తామన్నారు. చెన్నపట్నంగురించి రాద్ధాంత సిద్ధాంతాలయినాయి. ఇప్పటికి చెన్నపట్నంతో ఆంధ్రరాష్ట్రాని కేలాటిసంబంధం ఉండకపోయినా, ఆ నగరాన్ని కేంద్రప్రభుత్వపాలిత ప్రాంతంగానో, లేక చెంగల్పట్టుతో చేర్చి ప్రత్యేకరాష్ట్రంగానో చెయ్యకూడదనే నిర్బంధమేమీ లేదని పట్టాభిగారన్నారు. విధంచెడినా ఫలం దక్కాలని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌వారు సరేనన్నారు. ఇంక శేషోమాపో గవర్నర్‌జనరల్‌ఉత్తరువు రావడం తరవాయి అనుకుంటోంది ఆంధ్రదేశం. తీరా ఇంతా జరిగాక ఇప్పుడు మళ్లీ "ఇంకా వివాదగ్రస్తవిషయాలున్నాయి. వాని నన్నిటినీ ఇప్పుడే తేల్చివేస్తేగాని గవర్నర్‌జనరల్‌ఉత్తరువు రాదు అంటున్నారు హెచ్. వి. ఆర్. అయ్యంగార్. తేల్చవలసిన విషయాలు మళ్లీ మొదటికొచ్చాయి.

తేల్చవలసిన విషయాలు :

సింధు, ఒరిస్సారాష్ట్రాల నిర్మాణసందర్భంలో గవర్నర్‌జనరల్‌ఉత్తరువుసంగతి మనకి తెలుసును. కొత్తరాష్ట్రపు సరిహద్దులు, రాజధానిపేరు, ప్రత్యేకగవర్నరు ఉండాలా లేక ఏ స్థాయిఉద్యోగి కొత్తరాష్ట్రానికి అధిపతిగా ఉండాలి, హైకోర్టు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రత్యేకమైనవి స్థాపించాలా లేక ఏ ఇతరరాష్ట్రంతోకాని జతచేయాలా, అదీ కాక ప్రస్తుతానికి సమీపరాష్ట్రంతో చేర్చి ఉత్తరోత్తరా ప్రత్యేకమైనవి స్థాపించాలా, ప్రభుత్వపు స్థిరచరాస్తుల పంపకానికే పద్ధతి అవలంబించాలి, ఎవరు నిర్ణయించాలి మొదలైన ప్రధానాంశాలన్నీ గవర్నర్‌జనరల్‌ఉత్తరువులో వివరించబడాలి. ఈ వివరాలన్నీ ఉత్తరువులో చేర్చడానికిగాను పై వివరాలన్నిటినీ ముందుగానే తేల్చాలి. ఇలా తేల్చడానికి విభాజకసంఘం సర్వపక్షాల సభ్యులనూ చేర్చి నిర్మించబడుతుంది. ఆ సంఘం తేల్చినన్ని విషయాలు తేలుస్తుంది. తగువులోపడి తేలని విషయాల్ని గవర్నర్ జనరల్ ఒక పరిష్కర్తసంఘాని కొప్పగిస్తారు. పరిష్కర్తసంఘం నిర్ణయాల్ని అన్ని పక్షాలూ విధిగా అంగీకరించవలసివస్తుంది. ఇలాగే సరిహద్దుతగువుల్ని పరిష్కరించడానికి సరిహద్దు నిర్ణాయకసంఘాన్ని గవర్నర్‌జనరల్ నియమిస్తారు. పరిష్కర్తసంఘనియామకం, సరిహద్దునిర్ణాయకసంఘనియామకం గవర్నర్‌జనరల్‌ఉత్తరువు జారీ అవడానికి ముందే జరుగుతాయి. ఆసంఘాల పరిష్కారం పూర్తిఅయినప్పుడు గవర్నర్‌జనరల్‌ఉత్తరువు వస్తుంది. లేదా నియామకానంతరం పరిష్కారం పూర్తి కాకముందే గవర్నర్ జనరల్ ఉత్తరువు రావచ్చును. అయితే ఈరెండోపక్షంలో గవర్నర్‌జనరల్ నిర్ణయించే తేదీలోగా పరిష్కారం పూర్తికావాలి. పరిష్కారానంతరం కొత్తరాష్ట్రం ఏ తేదీకి స్థాపించబడాలో గవర్నర్‌జనరల్‌ఉత్తరువులో నిర్దేశించబడుతుంది.

మనకే పట్టిన దుర్గతి :

తతంగమంతా పరిష్కారంకావలసిన తగవులుండే పరిస్థితిలో, ఎన్నడూ ఏ రాష్ట్రనిర్మాణం సందర్భంలోనూ తగవు లుండక తప్పదు. కాని మనరాష్ట్రనిర్మాణంపరిస్థితి వేరు. మనకీ సరిహద్దులు, మొదలైనవిషయాలలో తగవులున్నాయి. అదనంగా రాజధానిగురించిన తగవొకటి ఉంది. ఈ తగవుల్ని సామాన్యఆచారం ప్రకారం పరిష్కరించడానికి కేంద్రనాయకులు భయపడ్డారు. పరిష్కారమనగానే రెండుపక్షాలకీ తృప్తికలగడమనేది అసంభవం. ఈ అసంతృప్తివల్ల పంజాబ్‌లోమాదిరిగా రక్తపాతం సంభవిస్తుందని కాబోలు కేంద్రనాయకుల భయం. భాషారాష్ట్రవిభజనంటే పాకిస్తాన్‌స్థాపనమాదిరిగా దేశవిచ్ఛిత్తికి దారితీస్తుందని కూడా కేంద్రఅధికారవర్గాల భయం కావచ్చును.

వారి భయానికి తగినట్టు రాజగోపాలాచారి మున్నీ ప్రభృతులు అదుగో పులి అంటే యిదిగో తోక అంటున్నారు. అందువల్ల తగవులన్నీ విడిచిపెట్టి తగాదాల పరిష్కారాన్ని ఉత్తరోత్తరా పరిష్కారానికి విడిచిపెట్టి, ఇప్పటికి తగాదావిషయాలన్నిటినీ అరవలకి ధారపోసి మిగిలిందే ఇప్పటికి దక్కిందనుకొని తృప్తిపడాలన్నారు కేంద్రనాయకులు, ముఖ్యంగా చెన్నపట్నాన్ని విడిచిపెట్టాలన్నారు. విధంచెడినా ఫలితం దక్కుతుందనే ఆశతో ఆంధ్రదేశం సరేనంది. నికరంగా నిష్పేచీగా తెలుగువారివే ననే పదకొండు జిల్లాలతోనూ రాష్ట్రం ఇవ్వమని కోరారు. ఇటువంటి రాష్ట్రాన్ని నిర్మించడానికి ఇంకా సరిహద్దునిర్ణాయక సంఘమెందులకు? సరిహద్దుతగవులన్నీ తీర్చడానికి ఎప్పుడో ఎన్ని సంవత్సరాలకో సరిహద్దునిర్ణాయకసంఘాన్ని నిర్మిస్తామని జె వి పి నివేదిక చెప్పినమాటకు ఆంధ్రదేశం అంగీకరించింది ఇప్పుడు సరిహద్దు నిర్ణాయకసంఘప్రసక్తిని అయ్యంగార్ తమ లేఖలో తెచ్చి సరిహద్దులు తేలాలంటున్నారు. దీనికి అర్థమేమిటి ?

అయ్యంగార్ లేఖలో తేలవలసిన విషయాలని పేర్కొన్నవి ఇంకా ఈ క్రిందివి ఉన్నాయి: — ఆస్తి అప్పుల పంపకం, ఆర్థికపరిస్థితి, బళ్లారిజిల్లాలోని కన్నడతాలూకాలు, హైకోర్టు, 1950 ఫిబ్రవరి బడ్జెట్టు, ప్రభుత్వోద్యోగుల పంపకం, శాసనసభలు, నియోజకవర్గాలు, అరవదేశానికి పంపగా మిగిలిపోయే అరవఉద్యోగులు, ఆంధ్రరాష్ట్ర రాజధాని, కమ్యూనిస్టుల ముప్పు మొదలైనవి.

ఇదంతా చూస్తే ఇప్పుడు తగవు పెట్టమని ఆంధ్రులు వదులుకున్న తగవుల్ని తిరగతోడటం, లేని తగవుల్ని కొత్తగా తెచ్చిపెట్టడం కనిపిస్తోంది. ఈవిషయాలన్నిటిపైనా ఉభయపక్షాలకీ అంగీకారయోగ్యమైన నిర్ణయాలు రావాలని అయ్యంగార్ అంటున్నారు.

నిజానికి సమస్య లేవీ పరిష్కారానికి అసాధ్యమైనవికావు. కాని పరిష్కారాన్ని భవిష్యత్తుకి విడిచిపెట్టేసి మిగిలినదానితోనే తృప్తిపడ్డానికి సిద్ధపడిన ఆంధ్రులికి తిరిగి ఉన్నట్టుండి ఏదో నిర్ణయం చేసుకోవాలని చెప్పడంలో అర్థమేమిటి? శాశ్వతంగా నీళ్లు వొదులుకోవాలని చెప్పడమా ?

అయ్యంగార్ రాజధానిగురించి వెంటనే నిర్ణయించాలని చెప్తూ "చెన్నపట్నంలో ఆంధ్రరాష్ట్రరాజధాని తాత్కాలికంగానైనా సరే ఉండరాదని తమిళనాయకు లంటున్నారు కాబట్టి, చెన్నపట్నంలో ఉండలేకపోతే ఆంధ్రరాష్ట్రరాజధాని నెక్కడ నిర్ణయించడానికి ఆలోచించుకున్నారు?" అని ప్రశ్నించారు. తమిళనాయకు లంటున్న మాటలే కేంద్రప్రభుత్వఅంతరంగికశాఖకు వినిపించాయికాని ఆంధ్రనాయకుల మాటలు వినపడలేదన్నమాట. తాత్కాలికంగానైనా ఆంధ్రరాష్ట్రరాజధాని చెన్నపట్నంలో ఉంటే, చెన్నపట్నం తమకే కేవలం భుక్తం కాకుండాపోయే ప్రమాదం ఉందని తెలిసి తమిళనాయకు లీ రీతిగా ప్రవర్తిస్తున్నారు. చెన్నపట్నంపైన ఆంధ్రులు హక్కు విడిచిపెడితే చాలు రాష్ట్రవిభజన తమకు ఆమోదమేనని చెప్పిన తమిళనాయకు లిప్పు డీరీతిగా చెప్పడంలో ఆంతర్యం ఎవరికైనా బోధపడుతుంది. కాని కేంద్రంలో అధికారంలో ఉండి "తగవులాడుకోవద్దు తగవులాడుకోవద్దు" అని జపంచేస్తూ చెవులూ మూసుకుని కూచున్నవారికే బోధపడుతుందా? కేంద్రవర్గంలో ఇటువంటి జవాలు చేస్తున్నవారుండబట్టే దేశంలో కొన్నివర్గాలకు అన్యాయం జరుగుతున్నా వారికి కానరావడంలేదు. కానవచ్చినా అన్యాయాన్ని అరికట్టలేని దుర్బలస్థితిలోకి వచ్చారు.

(20 పేజీ-చూడుడు)

ముఖచిత్రం

రోడ్డు కూలీ

టి. రంగనాథన్, త్రిప్లికేన్.

నవల



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౭

"చతురాననసన్నిభునకు-సతతస్వాహాస్వధాదిశబ్దద్వయసం
సకృతహవ్యకవ్యసంత-ర్పితముఖశిఖిముఖనిలింపపితృవర్గునకున్"

దశకుమార చరిత్రము

వెంటనే ఇనుమడించిన యాదరముతో అన్నయదేవుడు సోమయాజి కెదురేగెను.

"క్షంతవ్యుడను! సొగసైన మీ మీసకట్టు పోవుటచేతను శ్రవణకుండలములచే మీ ముఖమునకు తోడుకూడిన నూతన వర్చస్సుచేతను వెంటనే గుర్తింపలేకపోయినాను."

ఇట్లనుచు చిరునవ్వుతో వికసించిన ముఖముతో అన్నయమంత్రి తిక్కనసోమయాజిని వెంటవచ్చిన శిష్యులను సుఖాసీనుల జేసి బంధుసపర్యలు చేయబంచెను. తనవెంటవచ్చిన శిష్యులలో పెద్దవానిని గురునాథుడుగను బ్రహ్మచారిని మారన యనియు సోమయాజి అన్నయ కెరుకచేసెను. ఎన్నడో వదలివేసిన సోమయాజిమీసకట్టును అన్నయ జ్ఞప్తికి తెచ్చినను దానిపై గల వ్యామోహ మాయనకు స్మృతిలోనికి రాలేదు. అందుచే నాయన ఆవిషయమున నెట్టి యుత్తరమును నీయలేదు. అన్నయమాత్రము కొంత వేడుకతోడను విశేషగౌరవముతోడను తాను చిన్నతనములో దర్శించిన మహామాత్యస్వరూపము సోమయాజిమూర్తిగా ఎట్లు పరిణామ మందెనో పరీక్షించుచుండెను.

సోమయాజి ప్రకృతిసిద్ధముగా మితభాషి. సుఖదుఃఖములు లాభాలాభములు జయాపజయములు సమానముగా గ్రహించి తొణకకుండు స్వభావము కలవాడు. స్వప్నములో హరిహరనాథమూర్తిని దర్శించినదాదిగా ఆ ప్రకృతి దృఢపడినది. పునర్జన్మము లేకుండజేయు మని యా దేవదేవుని దానరించినక్షణము నుండి యందు కధికారము సంపాదించుకొన దీవ్రప్రయత్న మతిశయించినది. మహాభారతాంధ్రీకరణము సాగుచున్నకొలదియు సోమయాజి కా సాధన ప్రబలము కాసాగినది

అట్లయినను ఆమహానుభావుని స్వభావము సమగ్రముగా నెరిగినవారు నేడాయనను జూచినచో చింతాశల్య మేదో ఆయనహృదయమును బాధించుచున్నదని ఊహించలేకపోరు.

అన్నయదేవుడు పదునాగేండ్ల యువకుడై యుండగా నొకమారు తన తండ్రిని చూడవచ్చిన తిక్కనామాత్యుని నీ యేకశిలానగరముననే చూచియుండెను. అప్పుడు తిక్కనతీరు దర్పము జనాకర్షణ అన్నయ నెంతయు ముగ్ధుని జేసియుండెను. ఈ మేధావి చక్రవర్తియొద్ద మహామాత్యపదివిలో నుండదగినవాడు సామంతప్రాయు డగు మనుమసిద్ధియొద్ద నున్నాడేమి? అన్నయదేవుని తండ్రి యది తిక్కనకు సూచించియుండెను. కాని తిక్కనకు మనుమసిద్ధిపై వాత్సల్యముచేతను నాతని వదలుటకుగాని బంధుమిత్రాదులు పాదుకొనియున్న నెల్లూరుపరిసరములనుగాని పెన్నానదీతీరమునుగాని వదలి వచ్చుటకుగాని సమ్మతము కాదాయెను.

ఆనాడు అన్నయదేవునికి గలిగిన సందేహము, ఈనాడు తిక్కనసోమయాజరూపమును జూడగా జూడగా తీరిపోయినది. ఈ లోకమందు ఉన్నతపదవులపై వ్యామోహము గలవారికి తృప్తి ఎన్నటికిని చేకూరదు. తృప్తి లేనివానికి సుఖ మెక్కడిది? తిక్కనామాత్యుడు నెల్లూర మంత్రిపదవి వదలి కాకతీయచక్రవర్తికొలువులో మహామంత్రి యగుట కప్పు డిచ్చగింపలేదు. తరువాత నేమి చేసినాడు? నెల్లూర నామంత్రిపదవికూడ విసర్జించి ఈతడీ సోమయాజిపదవి నధిష్ఠించినాడు నేడు! హనుమసిద్ధి యాస్థానకవిపదము వదలి నేడీతడు హరిహరనాథునాస్థానమున మహాకవియైనాడు! ఈ పదవులపై నభిమానము కలవానికి మహామంత్రిపదవులపై నభిలాషయె ట్లుండును?

అన్నమంత్రికిని తిక్కనసోమయాజులకును దూరపుబంధుత్వ మున్నది. కాని వారి కెక్కువ పరిచయము లేదు. అందుచే అన్నమంత్రి తిక్కనసోమయాజిహృదయములో శల్య మున్నట్లే తెలిసికొనలేకపోయెను. అదియుగాక నేడాతని నావేశించిన చింతలో ఇతరుల చింతలు తెలిసికొను స్థితిలో నున్నాడా? పూజ్యుడైన అతిథి తన గృహమును పావనముచేసినందున గలిగిన ఉత్సుకతతో తాత్కాలికముగా గౌరవాదులు చూపుచున్నాడుగాని యన్నమంత్రి తన యప్పటి చిక్కు మరువగలడా?

ఇక నైదురోజులలో తన లెక్కలును మండలపరిపాలనానివేదికయు సిద్ధముచేయించి యాతడు చక్రవర్తి కప్పగింపవలెను. అవి పంపుటలో ము న్నెన్నడు నన్నదేవుడు ఆలసించి యెరుగడు. అతనికి భ్రమప్రమాదములు నలసతయు నేమాత్రము నిష్టము లేదు. మరి ఒక్క కరణమును ఇంకను రాకున్న నేమి కావలెను? ఇప్పుడేమి చేయవలెను?

తిక్కనసోమయాజులతో మాట్లాడుచునె కరణములు వచ్చిరేమో చూచుటకు రెండుమూడుమారు లాతడు తలయెత్తి ద్వారమువంక చూచెను.

వెంటనే తిక్కనసోమయాజి యా యమాత్యశేఖరు డేదో చిరాకులో నుండి మనస్సులో తొందరపడుచుండెనని గ్రహించెను.

"మహామాత్యా, మీరు పనితొందరలో నున్న సమయమున వచ్చినట్లున్నాను. మరొకప్పుడు దర్శనమునకు వత్తునా?"

పూజ్యుడును వృద్ధబంధువును అగు సోమయాజి చిన్నవాడగు తన్నంత గౌరవముతో సంబోధించుట యన్నమంత్రికి రుచింపలేదు.

"అయ్యో! ఎంత మాట! మీబోటి పెద్దలు వచ్చినప్పుడు పనితొందర యేమిటి? నన్ను మీ ఆజ్ఞానువర్తినిగా భావింపవలెను!"

సోమయాజి కన్నులార్పుచు ప్రశ్నించెను.

"మీ రెవరికొరకో నిరీక్షించుచున్నట్లున్నారే?"

"నేటితో నైదవనాటికి లెక్కలు నివేదికలు చక్రవర్తికి అందీయవలెను. మా కరణములందరు నీనాడు ఒక్కసారిగా పని చాలించుకొన్నట్లున్నారు! దానికి కారణమును గన్పడుటలేదు. మానము దక్కుట ఎట్లా యని ఆలోచించుచున్నాను. అంతే!"

తిక్కన: మహామాత్యా!—"

అన్నమంత్రి: మీరు నన్ను 'మహామాత్యా' యని సంబోధించుట వింత కలవరము రేపుచున్నది నా అంతరములలో!

తిక్కన: "మహామాత్యులను మ రేమందును?"

అన్నమంత్రి: "మీ రన్నందుకు కాదు. ఎందరట్లు నన్ను సంబోధించుట లేదు? అట్లు పిలువబడినప్పు డెన్ని మారులు నాకు సంతుష్టి కలిగియుండలేదు?— కాని మీ రీనాడు నన్నట్లు పిలుచుటచే హృదయములో అశాంతి కలుగుచున్నది."

తిక్కన: "మహాయోగీశ్వరులు మీరు కారణజన్ములై యీ పుట్టువులో మహామంత్రులైనారు!"

అన్నమంత్రి: "మా అమ్మగారు నాపై ప్రేమాతిశయముచే చెప్పు కథ మీ చెవులగూడ బడినదా, స్వామీ? ఈ జన్మములోనే మోక్షము నొందబోవువాడు సర్వసంగపరిత్యాగము చేయక నావలెనే ఈ మహామాత్యపదవీభారము పైన వేసికొనునా?"

తిక్కన: "మహామాత్యా! నాకు చూడగా మహామాత్యపదవి నిర్వహించుటకును మోక్షమున కధికారి యగుటకును విరోధము కనపడదు. కేవలము స్వయంముక్తుడుకూడ సచివాగ్రణిగా నుండవచ్చును"

అన్నమంత్రి: "పెద్దలు చెప్పునది కాదనుటకు నాకు సాహసము లేకున్నది కాని నా బుద్ధి కది ఎక్కుటలేదు."

తిక్కన: మహామాత్యా!—శ్రీకృష్ణభగవానుని హృదయములో ఒక్కసారి స్మరించుకొనుడు! ఆ భగవానుడు ధర్మరాజునకు సచివోత్తముడా కాదా?"

అన్నమంత్రి యొక్క క్షణకాలము ఆలోచనాపరుడై మౌనము వహించెను. ఆ క్షణములో నేదో అతని హృదయమున విద్యుత్తువలె మెరసి మాయమైనట్లుండెను. మరుక్షణములో చిరునవ్వుతో వికసించిన ముఖముతో సోమయాజిని ప్రశ్నించెను.

"అయితే, శ్రీకృష్ణభగవానులుకూడ నావలెనే—ఎన్నడైనను కార్యభారమున్నపుడు—కరణములు వేళకు రాలేదని కస్సుబుస్సులాడెనా?—"

ఆ మాటలనుచునే అన్నమంత్రి పెద్దలతో నట్లనియుండగూడదేమో యని విచారించుచుండెను. ఆమాటలు తిక్కనసోమయాజులకు నొప్పి కలిగించునేమో యని సందేహమును కలిగెను. కాని యందుకు మారుగా తిక్కనసోమయాజుల ముఖము చిరునవ్వుతో వికసించుటే కాదు. అప్రయత్నముగా ఆయన నవ్వనే నవ్వెను. ఆ నవ్వులో ఆయనస్వచ్ఛమైన దంతపంక్తి మెరపుతీగవలె మెరసెను. ఆ నవ్వు దూరముననుండి వినబడిన మేఘఘోషవలె గంభీరముగా శబ్దించెను.

"మహామాత్యా! శ్రీ కృష్ణభగవానులు ఇంతకంటెను చిరాకుపడెను. మహాభారతసమరము ఉపక్రమించినవేళనుండి అది యుపసంహార మగువేళవరకును అనుక్షణము ఆయన పడిన చిరాకు ఉభయపక్షములలో నెవరును పడలేదు! రణము ప్రారంభింపబోవుచున్నది. పాండవజ్యేష్ఠుడు రథము దిగి పాదచారియై ఎదిరిపైకి నకు బయలుదేరెను గదా! అప్పుడు శ్రీకృష్ణు డెట్టి చిరాకు చెందియుండును? భీష్మబాణములు ఆతని వక్షస్థలము చీల్చివేయగా ఎంత బాధకలుగనిది సుదర్శనము చేబూని భీష్మునిపై కుప్పించెను? కర్ణుని శక్తి అర్జునునిపై ప్రయోగింపకుండ చేయుటకు ఎంత అలజడిపడెను? సంశప్తకు లొకమారు ఒక్కపెట్టున అర్జునుని రథముపై బడగా అర్జునుడు కనిపించకపోగా శ్రీకృష్ణభగవానుడే ఎంత పరితపించెను? వ్యాసభగవానులు భగవానుని లీలల నట్లు ప్రదర్శించుట, మరి ఎందుకు?—"

అన్నమంత్రి: మహామంత్రుల నుద్బోధించుటకే!"

తిక్కన: మహామంత్రులనే కాదు, మీబోటి కారణజన్ములను, మాబోటి వైదికకర్మనిష్ఠులను—సమస్తమానవకోటిని!—సరేగాని మహాభారతప్రసంగముతో తన్మయత నొంది ముందు చెప్పదలచినది చెప్పలేదు!—"

అన్నమంత్రి: "అదేదో, వెంటనే సెలవిండు!"

తిక్కన: "ఏమియు లేదు. కరణములురాలేదనియే మీ విచారమైనచో మీరంత చింతింప బనిలేదు. నావెంట వచ్చిన శిష్యులు ఎట్టి కష్టపు లెక్కలైననుసిద్ధము చేయగలరు. వారికి ప్రస్తుతము పనిలేదు. వారిని మీ రుపయోగించుకొనవచ్చును."

(18-వ పేజీ చూడుడు)

బ్రిటన్‌లో సర్వజనులకూ ఉచిత వైద్యసౌకర్యం ఏర్పాటుచేయగలిగిన

ఎనైరిన్ బెవాన్

"గృహవసతి, ఆరోగ్యసంరక్షణ, విద్యాభ్యాసం, జీవనోపాధిసదుపాయం" ఇవే మీరు ప్రభుత్వంవలన పొందదగిన కనీసపు హక్కులు" అని పౌరుల కొత్త జన్మహక్కులను నిర్వచించినవాడు బ్రిటిష్ కార్మికపక్షప్రభుత్వ ప్రజారోగ్యశాఖామంత్రి ఎనైరిన్ బెవాన్. పూర్వమెప్పుడో 260 ఏళ్ళ క్రిందట ప్రజాస్వామ్యసూత్రాలకు ప్రాతిపదికను ప్రచారం చేసిన జాన్‌లాకే ప్రతిమనుష్యునికీ "ప్రాణసంరక్షణ, స్వేచ్ఛాజీవనం, ఆస్తిసంరక్షణ" జన్మహక్కులని చెప్పాడు. కాని ఆ నిర్వచనకూ, ఈ నిర్వచనకూ ఎక్కడా పోలికైనా లేదు. ఒకటి ప్రజాస్వామ్యం రెండవది సోషలిజం.

ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం దాదాపు ప్రపంచమంతటా ప్రభుత్వపరిపాలనలో నూతన విధానాలు ప్రయోగించబడుతున్నాయి. సర్వజనసంరక్షణ ప్రధానాశయంగా (వెల్ఫేర్ స్టేట్) కొన్నిప్రభుత్వాలు పరిపాలనావిధిని నిర్వర్తించడానికి యత్నిస్తున్నాయి. బ్రిటన్ సోషలిస్టువాదాన్ని అమలు జరపడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టింది. వాని ప్రయోజనం ఫలితం అనేక అంశాలపై ఆధారపడిఉంటుంది. టోరీల ప్రతిఘటనకు నిలబడాలి. ప్రజలు నూత్నవ్యవస్థకు అలవడాలి. ప్రభుత్వోద్యోగుల మధ్యను వివిధ శాఖలమధ్యను సంపూర్ణసహకారం సిద్ధించాలి. పరిస్థితులన్నీ సానుకూలంగా లేక అనేక కార్యక్రమాలు తలక్రిందులౌతాయి. ఎక్కడ పొరపాటు జరిగినా అది సోషలిస్టువిధానంలోనే లోపమని ప్రజలు భావించవచ్చును. అందువల్లనే బ్రిటన్‌లో కార్మికపక్షప్రభుత్వంపట్ల కార్మికులకే స్థిరవిశ్వాసం లేదు. కాని బ్రిటిష్‌ప్రజలకు సోషలిస్టువిధానంపట్ల విశ్వాసం నశించలేదు.

బ్రిటన్‌లో ఒకటితప్ప మిగతా సోషలిస్టు కార్యక్రమాలన్నీ కొద్దోగొప్పో కుంటుపడినాయని చెప్పకతప్పదు. ప్రజలకు సంపూర్ణ సంతృప్తి కలిగించినది ఒక్కటే కార్యక్రమం ఉంది. అది ప్రజారోగ్యశాఖ, వైద్యశాఖల సంయుక్తకార్యక్రమం. ఈశాఖలను నిర్వహించినవాడు ఎనైరిన్‌బెవాన్. ఈనాడు బెవాన్‌కు బ్రిటిష్‌ప్రజానీకంలో గల పలుకుబడి మరే కార్మికపక్షనాయకునికీ లేదు.

1945 బ్రిటిష్‌ఎన్నికల్లో కార్మికపక్షానికి విజయం లభించగానే లాంకషైర్ ప్రత్తిమిల్లు కార్మికుల సభలో బెవాన్ సర్వపౌరులకూ గృహవసతి, విద్య, ఆరోగ్యసంరక్షణ, జీవనోపాధి సదుపాయం జన్మహక్కులని నిర్వచించాడు. ఒక టోరీనాయకుడు "నే నెప్పుడే సభలో ఉపన్యసించినా ప్రజలకు శ్రద్ధ కలగడంలేదు. ఎప్పుడూ తమ జీవనోపాధిసదుపాయాలను గురించే చర్చిస్తారు." అని వాపోయాడు. ప్రజలు నిత్యం జీవనోపాధినిగురించీ, తమ సంరక్షణ గురించే ఎందుకు చర్చిస్తారో బెవాన్‌కు తెలుసును. ప్రభుత్వం ప్రజలను సర్వవిధాలా సంరక్షించాలని చెప్పడం మార్క్సిస్టు ప్రచారమూ కాదు. వితండవాదమూ కాదు. వేల్స్ గనుల్లో కార్మికుడుగా పనిచేసిన బెవాన్‌కు అది ప్రత్యక్షజీవితాదర్శం. ప్రయాసపూర్వకమైన అనుభవానికి ఫలితం.

బెవాన్ దక్షిణవేల్స్‌లో ట్రెడిగార్‌లో బాల్యాన్ని గడిపినప్పుడు, గనుల్లో పనిచేసే వారికి అనారోగ్యం, దారిద్ర్యం, దుర్మరణం మొదలైనవి నిత్యానుభవమైన విషయాలు. అతని తండ్రి కార్మికులకు వైద్యసహాయంకోసం పాటుపడే ఒక ధార్మికసంస్థస్థాపకులలో ఒకడు. ప్రతికార్మికుడూ ఆర్జించిన ప్రతిపౌనులోనూ మూడు పెన్నీల చొ॥ ఈ సంస్థకు చందా ఇచ్చేవాడు. (అంటే నూరు రూపాయలు ఆర్జిస్తే అందులో రూపాయపావలా చొ॥ ఇచ్చేవారన్న మాట) అనారోగ్యంవల్ల బాధపడే కార్మికులకూ వారి కుటుంబాలవారికీ ఈ సంస్థ వైద్యసహాయం ఏర్పాటుచేసేది.

ఈ సంస్థలో బెవాన్ చురుగ్గా పనిచేసేవాడు. ప్రతివారం సంస్థకార్యవర్గసభ్యులు దాదాపు 30 మంది కార్మికులు సమావేశమయ్యేవారు. కొందరు బొగ్గుమసిపూతలతో అప్పుడే పనిలోనుంచి తిరిగివచ్చేవారు. ఈ సభల్లో బెవాన్ మంచి పరపతి ఆర్జించాడు. కొంచెం నత్తి ఉండేది. షేక్స్పియర్ నాటకాల్ని బిగ్గరగా చదవడం నేర్చి నత్తి పోగొట్టుకున్నాడు.

బ్రిటిష్‌వైద్యసలహాసంఘం గనుల కార్మికుల సంస్థలకు వైద్యసహాయం ఇవ్వడానికి నిరాకరించింది. బెవాన్ వైద్యసంఘంపై. కత్తిగట్టి పోరాడి జయించాడు.

బెవాన్ 51 సంవత్సరాలక్రిందట వేల్స్‌లో కొండచరియలవద్ద ఒక గ్రామంలో జన్మించాడు. చిన్నగృహంలో బంధువర్గంఅంతా క్రిక్కిరిసి నివసించేవారు.

చిన్నతనంనుంచీ అతనికి గ్రంథపఠనంపైన అమితాసక్తి ఉండేది. పదమూడోఏట గనుల్లో పని ప్రారంభించాడు. గనుల్లో పని చేసివచ్చే వారి మురికి మిగతా ప్రయాణీకులకు అంటకుండా ఉండడానికిగాను అధికారులు ప్రత్యేకమైన బళ్ళు, కార్లు ఏర్పాటుచేసేవారు. కూలీలపట్ల నిరసన మిగతా కార్మికులవలెనే చిన్నతనం నుంచీ బెవాన్‌కు కూడా అనుభవమే.

గనుల్లో పనిజేసేవారు ప్రత్యేకనివాసాల్లో ఉండేవారు. వారికీ మిగతాలోకానికీ చాలా ఎడం ఉండేది.

పెట్టుబడిదారీవ్యవస్థలో అవకాశాలు "అదృష్టం" వల్ల లభించడం అనేమాటకు బెవాన్ ఉడికిపోయేవాడు. అతన్ని సమర్థించడానికి అధికారులకి గండమయ్యేది, ముట్టే జీతానికి ఎంత పని న్యాయమో అంతే చేసేవాడుకాని పైన వీసమైనా పని చేసేవాడుకాదు. కాలం మిగిలిపోతే ప్రక్కనెక్కడైనా విశ్రాంతి తీసుకుంటాడుకాని పనిచెయ్యడాని కంగీకరించేవాడు కాడు. విధేయతతో పని చేసేవారిని బెవాన్ పాడుచేసేవాడని అధికారులనేవారు. "పెట్టుబడిదారుల బొజ్జలు నింపడానికి మేమెందుకు వెన్నులు విరుచుకోవాలి?" అని అధికారుల సమక్షంలో అరిచేవాడు.

ఒకసారి ఒక అధికారి అతన్ని చొక్కా తీసివేసిమరీ పని చెయ్యమని సలహా ఇచ్చాడు. శాసనంలో అలాటి నిర్బంధం లేదుకాబట్టి చొక్కా తియ్యనని నిరాకరించాడు.

బెవాన్ వేల్స్‌లోయల్లో సంచారం చేసి కార్మికసంఘాలతరఫున విరివిగా ప్రచారం చేసేవాడు. ఒక్కొక్కప్పుడు 20 వేలమంది కార్మికులు అతని సభలకు హాజరై అత్యంతాసక్తితో అతన్ని వినేవారు. "నైరిన్ కార్మికులకు సార్వభౌముడు" అని కార్మికులనేవారు. అతని సాహసానికీ, తెగువకూ మితిలేదని పేరు వచ్చింది.

బెవాన్‌మిత్రులు పైసపైస చొ॥ చందాలు చేర్చి అతన్ని లండన్ కేంద్రకార్మికకళాశాలకు పంపారు. వేల్స్‌కొండలలోయలనుంచి మొట్టమొదటిసారిగా బయటపడి కొత్త ప్రపంచాన్ని చూసినట్లు బెవాన్ బహు ఆసక్తితో సర్వవిషయాలనూ పరిశీలించేవాడు. లండన్‌లో విద్యావంతులైన యువకుల సభలో ఉపన్యాసాలిచ్చాడు. ఆవేశపూరితమైన అతని ఉపన్యాసాలను యువకులు తన్మయత్వంతో వినేవారు. రెండేళ్లు లండన్ కళాశాలలో చదివి తిరిగి స్వస్థానం చేరాడు.

1926 లో జరిగిన సర్వకార్మికుల సమ్మెలో అతని రాజకీయపరిజ్ఞానం విదితమయింది. ట్రెడ్‌గార్‌లో ఆనాటి సమ్మెను ఇప్పటికీ "బెవాన్‌ముట్టడి" అంటారు. పట్టణమంతా



ఆనాడు అతని చెప్పుచేతల్లో ఉంది. కార్మికులు నగరాన్ని ఏమి చేసినా తిరుగు లేకపోయేదే. కాని బెవాన్ కార్మికులందర్నీ హెచ్చరించాడు. "దౌర్జన్యం వీల్లేదు. కార్మికులందరూ స్థిరశాంతిభావంతోనే సమ్మెను నిర్వహించి అధికారుల్ని నిరోధించాలి. మన స్థైర్యం అజేయమైనదిగా ఉండాలి. అంతేకాని దౌర్జన్యం పనికిరాదు. దౌర్జన్యమే సంభవిస్తే, పోలీసుల జోక్యానికి అవకాశం కలుగుతుంది. మన మేమీ చెయ్యకపోయినా పోలీసులు జోక్యంచేసుకుంటే తెలివి ఉపయోగించి పోలీసుల్ని ఓడించాలే కాని చెయ్యిచేసుకోకూడదు. మన ఈ పోరాటంలో తెలివే విజయం లభింపచేస్తుంది" అన్నాడు. కాని సమ్మె నెగ్గలేదు. టోరీ ప్రభుత్వం సమ్మెను భగ్నపరిచింది. దీనివల్ల బెవాన్‌హృదయంలో చిచ్చురేగింది.

ముప్పైఒకటవఏట బెవాన్ పార్లమెంటుకు ఎన్నికైనాడు. పార్లమెంటులో లిబరల్ ప్రధాని అయిన లాయిడ్‌జార్జిని బెవాన్ తీవ్రంగా విమర్శించాడు. బెవాన్ ఉపన్యాసాన్ని ఒక బ్రిటిష్‌పత్రిక ఈవిధంగా వర్ణించింది. "బెవాన్‌కు ఆవేశం తలమునకలయింది. ముఖం వికారంగా పెట్టి తల ఎగరవేస్తూ, గాలిలో చేతులు అన్నిదిక్కులకీ విసురుతూ బడబడలాడాడు." బెవాన్ మాట్లాడుతుంటే లాయడ్‌జార్జికి తన చిన్ననాటి ఉద్ధృతం జ్ఞాపకం వచ్చేదిట.

పార్లమెంటులో బెవాన్ పేరు తెచ్చుకున్నాడు. కాని అతనిలో వర్గవిరోధం ప్రజ్వలిస్తూనే ఉండేది. 1934 లో స్కాట్లండుగనుల ప్రాంతానికిచెందిన జెన్నీలీ అనేఆమెను వివాహంచేసుకున్నాడు. ఆమె తన 24 వ ఏట పార్లమెంటుకు ఎన్నికై న్యాయవాదకళాశాలలో అధ్యసిస్తుండేది. వివాహానికిముందు బెవాన్‌కు ఒక్కటే అభ్యంతరం కనిపించిందట. ఆమెతండ్రి స్కాట్లండ్ గనుల్లో ఫోర్మన్ ఉద్యోగంలో ఉండేవాడు. వేల్స్‌లో ఫోర్మన్ అంటే అధికారులతరఫు వ్యక్తి. కూతురొక కూలీని పెళ్లిచేసుకుంటానంటే జమీందారైన తండ్రికేనా అంత కోపం రాదు. బెవాన్‌కు తన ప్రియురాలి తండ్రి ఫోర్మన్ అని తెలిసేసరికి అంత కోపం వచ్చింది. ప్రియురాలు పరిపరి విధాల అతనికి బోధించవలసివచ్చింది. స్కాట్లండులో ఫోర్మన్లు కార్మికులతోటివారే అని చెప్పి ఒప్పించడానికి పెద్దలు దిగివచ్చారు. చివరికి ఒప్పించింది. పెళ్లికి చివరికి ఉంగరమేనా లేదు. ఒక రిజస్టరీఆఫీసులో పెళ్లి జరిగిపోయింది.

బ్రిటిష్‌ప్రజల ఏకైకనాయకుడుగా దేశాన్ని చర్చిల్ ఏలుతున్నప్పుడే బెవాన్ చర్చిల్‌పై దాడి ప్రారంభించాడు. చర్చిల్‌యుద్ధకాల నాయకత్వాన్ని బెవాన్ నిర్భయంగా అతి కఠోరంగా విమర్శించాడు. అతని విమర్శన తీవ్రత చూసి కార్మికపక్షంలోని అతని మిత్రులే విభ్రాంతులైనారు. ఇద్దరూ పరస్పరం నిందారోపణలు దూషణలు గుప్పారు. ప్రధానమంత్రి ఇంకా ఆపదవిలో ఉండడమే జాతికి ముప్పు" అని గర్జించాడు బెవాన్. "జాతిహితాన్ని పణానికమ్ముకునే ద్రోహివి" అని చర్చిల్ దూషించాడు. "జాతినంతనీ దుర్దశకు అమ్ముతున్న టోరుపత్రకుడవు నువ్వు" అని బెవాన్ దూషించాడు. "యుద్ధకాలంలో అందరికీ చికాకు కలిగించిన బెవాన్ శాంతిసమయంలో జాతికి ముప్పుతెచ్చిపెట్టగలడు" అని చర్చిల్ హెచ్చరించాడు. "ఎంత సముదాయించడానికి యత్నించినా, వారి మంచితనాన్ని ఎన్నివిధాల నిరూపించడానికి యత్నించినా, ఎంత నీతి నటించినా సరే నా హృదయంలో టోరీలపట్ల కరుడుగట్టిన ద్వేషం ఎన్నటికీ కరగదు" అని బెవాన్ మాంఛెస్టర్‌లో అన్నాడు. ఇటువంటి, సమయాల్లో బెవాన్‌ముఖంలో ద్వేషం స్పష్టంగా కనబడుతుంది. విషం కక్కుతున్నట్లు కనిపిస్తాడు. మోటుగా కనిపిస్తాడు. కాని ఈమోటుతనంవెనుక సభ్యత లేకపోలేదు. యూరప్ ఖండమంతటా సంచారం చేశాడు. యుద్ధకాలంలో యూరోపియన్‌సోషలిస్టునాయకులతో కలిసి శరణార్థులకు సహాయం చేశాడు. అనేకసంవత్సరాలు లండన్‌లో సోషలిస్టు వారపత్రిక ట్రిబ్యూన్‌కు సంపాదకుడుగా పని చేశాడు. అతడు ప్రభుత్వంలో చేరగానే అతని భార్య సంపాదకురాలయింది.

మంత్రిపదవి లభించినతరవాత అతనిలో కొంత మార్పు వచ్చిందంటారు. యుద్ధకాలంలో జర్మనీ బాంబులకు గురైన బ్రిటిష్‌నగరాల పునర్నిర్మాణబాధ్యత, వైద్య, ప్రజారోగ్యశాఖల బాధ్యత అతనిపైన పడింది.

ప్రజలందరికీ ఉచితంగా వైద్యసౌకర్యమివ్వాలని బెవాన్ ప్రతిపాదించినప్పుడు బ్రిటన్‌లోని వైద్యులందరూ ప్రతిఘటించారు. మొదట నిబంధనల్ని కొద్దిగా సడలించడానికి బెవాన్

(16-వ పేజీ చూడుడు)

మా ఢిల్లీలేఖ:

భారతప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు

శ్రీకృష్ణ

గత వారం భారతయూనియన్ పార్లమెంటులో, ఫైనాన్సుమంత్రి జాన్‌మత్తయ్ అతిముఖ్యమైన విషయాలు వెల్లడించారు. స్టెర్లింగ్ నిల్వల పరిస్థితులను వివరిస్తూ 1948 జూన్‌నుంచి 1949 జూన్‌నాటికి మన స్టెర్లింగ్ నిల్వలు 1537 కోట్ల రూపాయలనుంచి, 820 కోట్ల రూపాయలకు, - అంటే 717 కోట్ల రూపాయలు తగ్గిపోయాయి. ఈ అంకెకు, స్టెర్లింగ్‌కు బదులుగా తీసుకొన్న డాలర్ మొత్తాలను, 19 కోట్ల రూపాయలను కూడా కలుపుకొంటే, 1949 జూన్‌నాటికి 736 కోట్ల రూపాయలకిమ్మతు స్టెర్లింగ్ నిల్వలు తగ్గిపోయాయి. జూన్ 30 నాటికున్న మన స్టెర్లింగ్ నిల్వ 801 కోట్ల రూపాయలు. జూన్ 1950తో అంతమొందే సంవత్సరార్థంలో, 5 కోట్ల పౌనులు, "ఓపెన్ జనరల్ లైసెన్సు" క్రింద అయే అదనపుదిగుమతిఖర్చులకు, మరో 5 కోట్ల పౌనులు సామాన్యవార్షికపు విడుదలవంతుకూ మొత్తం పదికోట్ల పౌనులు స్టెర్లింగ్ నిల్వలను విడుదలచేసేందుకు బ్రిటన్ ఒప్పుకొంది. అంటే మరో 133 కోట్ల రూపాయల నిల్వ ఈలోపుగా తగ్గిపోతుంది. జూన్ 1950 నాటికి ఈప్రకారం చూస్తే 668 కోట్ల రూపాయల నిల్వమాత్రమే మిగుల్తుంది. ఇంకా డిస్ట్రాయర్లు మొదలైన యుద్ధరక్షణసామగ్రీ ఆయుధాలూ అవీ బ్రిటన్‌నుంచి కొనుక్కొనేవాట్ల ఖర్చు ఇందులో తగ్గించుకొని మిగులు చూసుకోవలసి ఉంటుంది.

ఫైనాన్సుమంత్రి వివరించిన ముఖ్యవిషయాలలో, రెండవ విషయం, భారతప్రభుత్వ ఖర్చుల కాతాలో కొరదలగురించి. గతసంవత్సరపు కొరదల 250 కోట్ల రూపాయలుగా మంత్రిగారు అంచనావేశారు. ఇందులో 126 కోట్ల రూపాయల, ఆహారధాన్యాల దిగుమతి వ్యయం కూడా కలిసేఉంది. ఈ 126 కోట్లలో 42 కోట్ల రూపాయల కిమ్మతు డాలరు ప్రాంతాలనుంచే. 84 కోట్లరూపాయల కిమ్మతు తదితరప్రాంతాలనుంచీ దిగుమతులకు చెందినమొత్తాలు. జరుగుతున్న సంవత్సరంలో, డివాల్యూయేషన్‌కు పూర్వం, ఈ కొరదల 100 కోటరూపాయల కిమ్మతు ఆహారధాన్యాల కొరతతో కలుపుకొని మొత్తం 130 కోట్ల రూపాయలకొరదలగా అంచనావేశారు. భారతదేశం తన ఎగుమతులను హెచ్చించుకోకపోతే,—అధమం, డివాల్యూయేషన్‌వల్ల వచ్చిన మారకపు కొరదలను పూర్తిచేసుకోగలంతమాత్రం హెచ్చించుకోకపోతే - అమాత్రంగా దిగుమతులనైనా తగ్గించుకోవలసివస్తుందని ఫైనాన్సుమంత్రి హెచ్చరించారు. ఈ తగుదల 5 కోట్ల పౌనులు, లేక 66½ కోట్లరూపాయల స్టెర్లింగు పంపకానికి సమానం ఔతుంది.

మత్తయిగారు చెప్పిన మూడవ ముఖ్యవిషయం ప్రభుత్వం చేసిన ఋణాలనుగురించి. ఆయన చెప్పిన మాట లివి.

(1) "ఈనాటిదాకా, అంతర్జాతీయద్రవ్యనిధినుంచి, పదికోట్లడాలర్లు భారతదేశం అప్పుగా తీసికొంది."

(2) "ఆగస్టు 18 న, వరల్డుబాంక్‌నుంచి, రైల్వే పునరుద్ధారణకోసమని 4% వడ్డీ చొప్పున, మూడువందలనలభైలక్షల డాలర్లు, భారతదేశం, అప్పుగా తీసికొంది."

(3) "సెప్టెంబరు 29 న, వ్యావసాయికపనిముట్లు కొనటంకోసం, వరల్డుబాంక్‌నుంచి, భారతదేశం, మళ్లీ, కోటిడాలర్లు, 3½% వడ్డీ చొప్పున రెండోమారు అప్పుతీసుకొంది."

(4) "దామోదర్‌వాలీ ప్రాజెక్టులో, 'బొకారో థెర్మల్‌యూనిట్' స్థాపించటంకోసం, మరొక 220 లక్షల డాలర్లు, 4½% వడ్డీ చొప్పున, వరల్డుబాంక్‌నుంచి మూడోసారి అప్పుతీసికోటంకోసం, భారతప్రభుత్వం సంప్రదింపులు జరుపుతూంది."

(5) "ఈమూడు ఋణాలు మొత్తం, ఆరువందల అరవైలక్షల డాలర్ల మొత్తాల ఋణం సేకరించటంలో అయే ఖర్చుకరామతుల మొత్తంకూడా దాదాపు ఊహించవచ్చును. 1950-51 లో 44 లక్షల డాలర్లనుంచీ, 1955-56 లో 70 లక్షల డాలర్లవరకూ ఈ అదనపుఖర్చు పెరుగుతుంది. అంతర్జాతీయద్రవ్యనిధిలో తీసికొన్న పదికోట డాలర్ల ఋణానికి చెల్లించుకోవలసిన వడ్డీమొత్తాలు, 1950 లో 7 లక్షల డాలర్లు, 1951 లో 10.6 లక్షల డాలర్లు, 1952 లో 14.2 లక్షల డాలర్లు, 1953 లో 17.5 లక్షల డాలర్లూ,- ఈ వృద్ధిక్రమంలో ఉంటాయి. ఒకవేళ ఏడాదికి అధమం కోటి డాలర్లచొప్పున ఋణం చెల్లుపెట్టుకొంటూవద్దామని ఆశించినా వరల్డుబ్యాంకునుంచీ, ద్రవ్యనిధినుంచీ మనం తీసికొన్న అప్పు తీసికొన్నందుకుగాను, మనం కట్టుకోవలసివచ్చే అదనపుఖర్చు, 1950 లో కనీసం 150 లక్షల డాలర్లనుంచి, 1956 నాటికి మొత్తం 190 లక్షల డాలర్లకు పెరుగుతుంది."

(6) "అంతర్జాతీయబ్యాంకు, ఇంకా ఉక్కుకర్మాగారాలు, తదితరనూతనపునరుద్ధారణ ప్రణాళికలవిషయంకూడా పరిశీలిస్తూంది. 1950 ప్రారంభంలో, వారి తరఫున ఒకసంఘము భారతదేశం వచ్చి నూతనప్రణాళికల విషయంలో సంప్రదించబోతోందని, అనుకొంటున్నాము." అని చెప్పారు.

దీనివల్ల మూడు ముఖ్యఅంశాలు స్ఫురిస్తున్నాయి. ఒకటి భారతప్రభుత్వ దిగుమతివిధానాన్నిగూర్చి - ముఖ్యంగా భారీయంత్రాది వస్తువుల దిగుమతి - రెండు భారతప్రభుత్వం అవలంబిస్తున్న ఉదారద్రవ్యవిధానము. మూడు ప్రభుత్వ అభివృద్ధిప్రణాళికల దృక్పథం.

దిగుమతి విధానం

ప్రభుత్వం ఈమధ్య నిశ్చయించుకొన్న ప్రకారం విదేశవాణిజ్యాలలో దిగుమతులలో, ఆహారపదార్థాలకు ప్రథమస్థానమూ, తర్వాత రక్షణఆయుధపరికరాలు, దానితర్వాత భారీయంత్రాల, ముడిపదార్థాల దిగుమతులూ, వరుసగా వస్తాయి. తయారీవస్తువుల దిగుమతి, పూర్తిగా తగ్గించేశారు. యంత్రాల దిగుమతి పరిశ్రమస్థాపకయంత్రాల దిగుమతులూ, హార్డుకరెన్సీ ప్రదేశాలనుంచి 10.81 కోట్ల రూపాయలు, సాఫ్టుకరెన్సీ ప్రదేశాలనుంచి 29.05 కోట్ల రూపాయలు, కిమ్మతు చేసేవి, 1949 ఏప్రెల్ నుంచి 1949 ఆగస్టువరకూ దిగుమతిఅయినాయని విలువకట్టారు. తక్కిన అన్ని దిగుమతిపదార్థాలతోనూ చూసుకొంటే యంత్రపరికరాల దిగుమతి, హార్డుకరెన్సీప్రదేశాలనుంచి, మొత్తం దిగుమతులలో నూటికి 17.7 పాళ్లూ, సాఫ్టుకరెన్సీప్రదేశాలనుంచి, మొత్తం దిగుమతులలో నూటికి 18.5 పాళ్లూ మాత్రమే ఉంటాయి. ఇదే సమయంలో, భారతదేశం విదేశాలనుంచి 554 లక్షల రూపాయల కిమ్మతు చేసే మోటారుకార్లను కొంది. ఇందులో 69 లక్షలరూపాయల సరుకు హార్డుకరెన్సీ ప్రదేశాలనుంచి కొన్నది. ముడిపొగాకు, హార్డుకరెన్సీ ప్రదేశాలనుంచి 81 లక్షల రూపాయలదీ, సాఫ్టుకరెన్సీప్రదేశాలనుంచి 11 లక్షలరూపాయల కిమ్మతుదీ కొన్నది. సాఫ్టుకరెన్సీప్రదేశాలలో, మద్యం, వస్త్రాలు, అలంకారాలు, ఆటవస్తువులకోసం, 190 లక్షలరూపాయలుఖర్చుపెట్టింది. గతసంవత్సరం మద్రాసులో మాట్లాడుతూ భారతదేశం ప్రత్యక్షంగా ఏయుద్ధమూ చేస్తూండకపోయినా, దేశంలో యుద్ధకాలపరిస్థితులే అలుముకొని ఉన్నాయని, పండిట్ నెహ్రూ అన్నాడు. దేశ, మూలఆదాయాన్ని రెండు విషయాలు పట్టుకొని పీడించిపిప్పిచేస్తున్నాయి.

ఒకటి కాశ్మీర్. రెండు ఆహార సమస్య. 1951 నుంచి ఆహారదిగుమతులను ఆపివేస్తామని ప్రభుత్వం కంకణం కట్టుకొంది. ఇక పోతే, మద్రాసులో భారతప్రధానమంత్రిఉపన్యాసానంతరమైనా ప్రభుత్వం యుద్ధకాలఆర్థికవిధానం అవలంబిస్తోందా అనేది ప్రశ్న. అవలంబించటంలేదని, అవలంబించటానికి తీవ్రప్రయత్నమైనా లేదని, అందరికీ సువిదితమే. రెండవ ప్రశ్న భారీయంత్రసామగ్రిదిగుమతులనుగురించి. 1952 లో ఆహారవిషయకంగా దేశం స్వయంసమృద్ధమయ్యేదాకానైనా ఈ దిగుమతులను ఆపుకోనేందుకు వీలు లేదా? ఇప్పటికే గత మూడేళ్లలో భారతదేశం, శతకోట్లు రూపాయల కిమ్మతులో భారీయంత్రసామగ్రి దిగుమతి చేసుకొంది. ఈ సంవత్సరం ఐదునెలల్లో నలభై కోట్లరూపాయిల మొత్తంవరకు భారీయంత్రాలు దిగుమతి చేసుకొందన్న విషయమే మనకు హెచ్చరిక ఇయ్యాల్సిఉంది. ఈ దృష్ట్యా ఈ విషయాన్ని పరిశీలించి, పైఏడునుంచి మొదలయ్యే ఋణాల విషయాలలో జాగ్రత్తగా వ్యవహరించటం అత్యవసరం. రైల్వేఅభివృద్ధి ప్రణాళికలో అప్పు తీర్చటానికి కేటాయించవలసిన మూలధనాలపట్టిక 1950-51 లకుఇల్లా ఉంది.

ఆగస్టు	15, 1950	876,000 డాలర్లు.
ఫిబ్రవరి	15, 1951	894,000 ,,
ఆగస్టు	15, 1951	912,000 ,,
	మొత్తం	2,682,000 డాలర్లు.

చౌకవడ్డీకి పెట్టుబడిధనం

ధనసంచారంవిషయంలో పూర్ణ పరిస్థితినే అంగీకరించి ప్రభుత్వం చౌకవడ్డీకి ధనం లభింపచేసే విధానాన్నే అవలంబిస్తున్నారు. యుద్ధం లేనికాలంలో నిరుద్యోగరహితస్థితి ఉండే పక్షంలో ఈ చౌకవడ్డీపద్ధతి ఎలా పని చేస్తుందో ఇంకా పరీక్షింపబడలేదు. యుద్ధాత్పూర్వం గిరాకీహీనంగా ఉన్న రోజుల్లో నిరుద్యోగం అధికంగా ఉన్నప్పుడు పెట్టుబడి వృద్ధికీ, ధనసంచారసౌలభ్యానికీ చౌకవడ్డీపద్ధతి మంచిదని ప్రభుత్వం పరిగణించేది. సౌష్ఠవం లేని ఆర్థికస్థితిని చక్కబరచడానికి వడ్డీరేట్లను సాధనంగా ఉపయోగించరాదనుకునే పక్షంలో, వ్యాపారంపైన కఠినమైన నిర్బంధాలు శాసనాలు విధించి, ప్రభుత్వఖర్చులు తరిగించక తప్పదనే సత్యాన్ని ఇంతవరకూ భారత ప్రభుత్వం గ్రహించినట్లు కానరాదు. కఠిననిర్బంధాలు విధించటం ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధమనుకుని నిరాకరిస్తున్నారు. ఇంక, రాజకీయహేతువులవల్లనూ, పార్టీబలం కోసమనీ పెద్దపెట్టున ప్రభుత్వోద్యోగుల సంఖ్యను తగ్గించటానికి వెనుదీస్తున్నారు.


ఇప్పుడు అంతర్జాతీయబాంకువద్ద ఋణాలు తీసుకున్నందువల్ల ఈ సమస్యమరింత క్లిష్టమై కూచుంది. పైన చూపినట్లు వడ్డీరేట్లు 3½% మొదలు 4½% వరకూ ఉన్నాయి. రూపాయిమారకపు విలువతగ్గింపువల్ల ఈ రేట్లు 25% పెరిగాయి. ఇప్పుడు దేశీయులైన పెట్టుబడిదారులవద్ద తీసుకునే ఋణాల కొక వడ్డీరేటూ విదేశీయులైన పెట్టుబడిదారులవద్ద తీసుకునే ఋణాలకు మరొక రేటూ నిర్ణయించడం ప్రభుత్వానికి న్యాయమేనా? చౌకవడ్డీరేటుపద్ధతిని మానుకొన్నట్లయితే నిరర్థకంగా పడిఉండి మూలుగుతున్న ధనాన్ని ప్రయోజనకరమైన పెట్టుబడికి మళ్లించడానికి వీలౌతుందో లేదో ప్రభుత్వం పరిశీలించిందా? ఇంతటి ప్రధానమైన సమస్యను గతమంగళవారం పార్లమెంటులో సభ్యులు చర్చకు తీసుకురాక పోవడం శోచనీయం.

భారతదేశ అభివృద్ధి ప్రణాళికలు

యుద్ధానంతరం, డిప్రెషన్ వస్తుందని అంచనావేసి బ్రిటిష్‌పాలకులు, యుద్ధానంతర పునరుద్ధారణకార్యక్రమాలను తలపెట్టారు. కాని వారి అంచనా తప్పుగా పరిణమించిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి ఇప్పటి రాబడులకు అనుకూలంగా ఈ ప్రణాళికలను పునః ఆలోచించవలసిఉంటుంది. అంతర్జాతీయబ్యాంకులో చేసే ఋణాలు, తీర్చటానికున్న సావకాశాలు ఏవో ఆలోచించుకొని ఋణాలు చెయ్యవలసి ఉంటుంది. ఇండియా అప్పుపుచ్చుకొన్న ప్రతి డాలరుకు మునుపటికన్న నూటికి ఇరవైఐదు రూపాయలు ఎక్కువ చెల్లించుకోవలసి ఉంది. మరొకరీతిగా ఎగుమతులను పెంచుకొని ఋణాలు తీర్చుకొనే విధానముకూడా ఉంది. కాని మామూలు దిగుమతులకూ, ఋణాలకూ కూడా సరిపోయినంతపెట్టున తన ఎగుమతులను భారతదేశం పెంచుకోగలదా అనేది ప్రశ్న.

ఇంకొక విషయం, వ్యవసాయికప్రణాళికలకు ప్రాజెక్టులకు పెట్టిన ఖర్చును, రాష్ట్రాలనుంచి రాబట్టుకోగలంత సామర్థ్యం కేంద్రానికున్నదా? గతవారం రూర్కీలో ప్రసంగిస్తూ, భారతప్రధానమంత్రి, "కొన్ని రాష్ట్రాలు, తమకు తామూ సంపూర్ణంగా సర్వస్వతంత్రమైన ప్రభుత్వదేశాలలాగా వ్యవహరిస్తున్నాయి" అంటూ వాపోయాడు.

ప్రభుత్వాన్ని ఎదిరిస్తూన్న సమస్యలలో ఈ పైచెప్పినవిముఖ్యమైన సమస్యలలో చేర్తాయి. తమ స్వప్రయోజనం అభిలషించి అయినా భారతదేశ, కాంగ్రెస్ ప్రభువులు, తమ అభివృద్ధి ప్రణాళికలను పునఃపరిశీలన చేసుకోవాల్సిఉంది. విద్యా, సంస్కృతి, మొదలైనవన్నీ అభివృద్ధిపరచుకోటం శ్రేయోదాయకమే అయితే డబ్బు ఉండాలి. నదీప్రాజెక్టు స్కీములు మొదలైనవన్నీ అపేక్షణీయాంశాలే తగాదా డబ్బుతోటి. ప్రస్తుత అస్తవ్యస్తపరిస్థితులలో, రాష్ట్రప్రభుత్వాల సహకారం అంతంతమాత్రంగా ఉన్న కాలంలో, ఎక్కువ వడ్డీకి డబ్బు అప్పుతేవటం, చాలా ప్రమాదంతో కూడుకొన్న పని. భారతదేశస్వాతంత్ర్యభవిష్యత్తును గురించి గత వారం రాజ్యాంగపరిషత్తులో ప్రసంగిస్తూ, డాక్టర్ అంబేద్కర్, "అంతశ్శత్రువులను"గూర్చి మాట్లాడారు. దేశానికి ఆర్థికస్థైర్యము చిక్కకపోతే, ఈ అంతశ్శత్రువులకు మందుగుండు కూర్చిపెట్టినట్టవుతుంది. కమ్యూనిజంను పోషించే మూలకారణాలను నిర్మూలిస్తేతప్ప కమ్యూనిజంను నిర్మూలించలేవు. ఆర్థికసౌష్ఠవం లేకపోవటం, ధనవ్యవహారవ్యత్యస్తాలు, ఈ మూలకారణాలలో చేరుతవి. భారతదేశాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేయటానికి, చాలా శ్రమించవలసిఉందనిమాత్రం హెచ్చరిస్తున్నాను.



యూరప్‌ఖండం అంతటిలోనూ బ్రహ్మాండమైనదని చెప్పుకోదగిన (నూలెను పరిశుభ్రంచేసే) యంత్రాగారాన్ని సేలాంకాలో నిర్మిస్తున్నారు. దీనిలో పనిచేసే కార్మికులకు నివాసాలు ఏర్పరుస్తున్న దృశ్యం.

నేటిప్రపంచం:

★ ఐక్యరాజ్యసమితిలో సామ్రాజ్య ప్రభుత్వాల పరాజయం

ఐక్యరాజ్యసమితిలో ఆసియాదేశాల సహకార ఫలితంగా యూరోపియన్ సామ్రాజ్య రాజ్యాలకు నైతికపరాజయం సంభవించింది. నైరుతిఆఫ్రికా, యూరోపియన్‌వలసల సందర్భంలో ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణాధికారం స్థిరపరుచుకుంది. దక్షిణాఫ్రికాప్రభుత్వం యూరోపియన్ రాజ్యాలు సమితిని ధిక్కరించి సమితినిర్ణయాన్ని పాటించకపోవచ్చును. కాని పరరాజ్యదాస్యంలో మ్రగ్గుతున్న దేశాలలో ప్రజల సమస్యలపట్ల ప్రపంచం మేలుకుంటోందని మాత్రం ఈ నిర్ణయాలవల్ల స్పష్టమౌతోంది. సామ్రాజ్యవాదుల చర్యలపట్ల సందేహం ప్రబలుతోంది. అగ్రరాజ్యాల అసంతృప్తికీ, క్రోధానికీ వెరువకుండా, తమతమ అభిప్రాయాలప్రకారమే వ్యవహరించడం క్రమంగా ఐక్యరాజ్యసమితిలో అలవడుతోంది. ఇట్టి స్వతంత్రభారత ప్రకటనకు భారతదేశంనాయకత్వం దోహదమిచ్చిందని చెప్పాలి. ప్రధానప్రపంచసమస్యల పట్ల ఇంకా చిన్నరాజ్యాలు వ్యక్తిత్వాన్ని ప్రదర్శించలేకపోతున్నాయి. అగ్రరాజ్యాల వైఖరి మారనంతవరకూ, అనగా ఐక్యరాజ్యసమితి తమ రాజకీయచదరంగంలో ఆటవస్తువనే భావం రష్యా, అమెరికా, బ్రిటను తొలగించుకోనంతవరకూ "చిన్న" దేశాలకు వానిపట్ల సందేహం నశించదు. రష్యాతో శత్రుత్వమెంతో అమెరికాతో మైత్రికూడా అంతే ననేభావం చిన్నరాజ్యాలలో క్రమంగా రూపొందుతోంది. అందువల్లనే కేవలం అగ్రరాజ్యాల మైత్రి విరోధాలలో వారి అడుగుజాడల్లో నడవక తప్పదనే భావం క్రమక్రమంగా సన్నగిల్లుతోంది. ఆరంభంనుంచీ భారతదేశం వ్యక్తిత్వాన్ని స్థాపించుకొని అగ్రరాజ్యాల మైత్రివైషమ్యాలతో నిమిత్తం లేకుండా వ్యవహరిస్తోంది. ఈ పద్ధతి చిన్నరాజ్యాలను ఆకర్షించింది. ఇప్పుడిప్పుడే అగ్రరాజ్యాల నెదిర్చి స్వతంత్రించి వ్యవహరించడం అభ్యసిస్తున్నాయి. అయితే ఇది ఇంకా అన్ని సమస్యల సందర్భంలోనూ కానరావడంలేదు. చిన్నరాజ్యాలు ఎప్పుడు కలిసి వ్యవహరించినా అమెరికా, రష్యాలు చాటుగా మంతనాలు జరిపి వానిమధ్య ఐకమత్యాన్ని భగ్నపరుస్తున్నాయి. అగ్రరాజ్యాల గుప్పిట నుంచి చిన్నరాజ్యాలింకా తప్పించుకోలేని పరిస్థితిలోనే ఉన్నాయి. అందువల్ల అప్పుడప్పుడు కానవచ్చే ఈ ఐకమత్యం ఎప్పటికప్పుడు అంతరిస్తోంది. ప్రధానసమస్యల్లో అగ్రరాజ్యాల మాటే చెల్లుతోంది.

ప్రస్తుతసమావేశంలో యూరోపియన్ రాజ్యాలకుచెందిన వలసలకూ, నైరుతిఆఫ్రికా సమస్యకూ సంబంధించిన చర్చలలో బ్రిటన్ మొదలైన రాజ్యాలకు పరాజయంసంభవించింది. ఈ పరాజయానికి ముఖ్యహేతువు దక్షిణాఫ్రికాప్రభుత్వం సమితిపట్లనూ, కనీసమానవ ధర్మాలపట్లనూ చూపిన నిరాదరణ. సమితి నిర్ణయాలనూ, ఆజ్ఞనూ మలాన్ ప్రభుత్వం మొదటినుంచీ ధిక్కరిస్తూవచ్చింది. అయినప్పటికీ బ్రిటన్, అమెరికా మొదలైన దేశాలు దక్షిణాఫ్రికాపట్ల అసంతృప్తినైనా ప్రకటించలేదు. ఐక్యరాజ్యసమితిలో చర్చలలో ప్లీడర్ల మాదిరిగా ఏవో వంకలుపెట్టి దక్షిణాఫ్రికాప్రభుత్వానికి అనుకూలంగా ప్రవర్తిస్తున్నాయి. ఈ విధానం పట్ల చిన్నరాజ్యాలకు అసంతృప్తి కలిగింది. మలాన్‌దురహంకారంవల్ల అసంతృప్తి బలపడింది. దీనివల్లనే చిన్నరాజ్యాలన్నీ ఏకమై నైరుతి ఆఫ్రికాసమస్యలోనే కాక యూరోపియన్లవలసల సమస్యల్లోకూడా బ్రిటన్ మొదలైన దేశాలనెదిర్చి ఆంగ్లో - అమెరికన్ రాజ్యాలను పరాభవం చేశాయి.

నైరుతి ఆఫ్రికా:

నైరుతి ఆఫ్రికాపరిపాలనగురించి ఐక్యరాజ్యసమితియొక్క ధర్మకర్తృత్వసంఘం తీవ్రచర్చల అనంతరం భారతదేశతీర్మానాల నంగీకరించింది. నైరుతి ఆఫ్రికాను పరిపాలనా వివరాలను ధర్మకర్తృత్వసంఘాని కొప్పగించాలని ఇదివరలో సమితిచేసిన తీర్మానాలను దక్షిణాఫ్రికా పాటించనందుకూ, అట్టి వివరాలు అందచేయగలరని పూర్వంచేసిన వాగ్దానాలను పాటించనందుకూ ధర్మకర్తృత్వసంఘం విచారం ప్రకటించి, వెంటనే నైరుతిఆఫ్రికాను ఐక్యరాజ్యసమితి ధర్మకర్తృత్వాని కొప్పగించాలని కోరుతూ తీర్మానం చెయ్యబడింది. నైరుతి ఆఫ్రికావ్యవస్థను నిర్వచించి దక్షిణాఫ్రికా ప్రభుత్వానికా ప్రాంతంపై ఎట్టి అధికారాలున్నాయో పూర్వపత్రాలన్నీ తిరగవేసి నిర్ణయించి తెలపవలసిందని భారతదేశం ప్రతిపాదించిన రెండో తీర్మానంకూడా ఆమోదించబడింది. ఈతీర్మానాన్ని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, బెల్జియం, కెనడా, ఫ్రాన్స్, గ్రీస్, హాలండ్, నార్వే, స్వీడన్, టర్కీలు ప్రతిఘటించాయి. కాని ఈ 11 దేశాలనూ ఎదిర్చి ఆసియా, దక్షిణ అమెరికాదేశాలు (31) గెలిచాయి. ఈచర్యలో నైరుతి ఆఫ్రికావాసులపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం జరిపిన దురంతాలు ప్రపంచానికి వెల్లడైనాయి. నైరుతిఆఫ్రికాలోని పరిస్థితులను వివరించడానికి గాని పరిశీలింప నివ్వడానికి గాని మలాన్ ఎందుకు నిరాకరించాడో లోకానికి విదితమయింది.

రెవరెండ్ మైకేల్ స్కాట్:

మలాన్ నిరాకరణఫలితంగా ధర్మకర్తృత్వ సంఘం, నైరుతిఆఫ్రికావాసుల స్థితిగతులను గురించి ఒక క్రైస్తవఫాదరీవల్ల తెలుసుకుంది. ప్రభుత్వాల ప్రతినిధులుగాక అన్యవ్యక్తులు ఐక్యరాజ్యసమితిలో సాక్ష్యమివ్వడానికి ఇదే ప్రథమం. బ్రిటన్, దక్షిణాఫ్రికా లెంత ప్రతిఘటించినా రెవరెండ్ మైకేల్ స్కాట్ సాక్ష్యాన్ని వినడానికే ధర్మకర్తృత్వసంఘం నిర్ణయించింది. ముందుగా నైరుతిఆఫ్రికాలోని ప్రజల ప్రతినిధుల సాక్ష్యం వినడానికి అంగీకరించింది. ఏడుగురు ప్రతినిధులుగల ఉపసంఘం ఒకటి స్కాట్ ప్రాతినిధ్యపు హక్కును పరిశీలించి ఆమోదించింది.

నైరుతిఆఫ్రికాలోని స్థానికజాతులవారి యాతనల్నిగురించీ, దక్షిణాఫ్రికాప్రభుత్వం జరిపిన దురంతాలను గురించీ రెవరెండ్ మైకేల్ స్కాట్ వివరించాడు. జర్మనీవలసగా ఉన్న నైరుతిఆఫ్రికాను ప్రథమప్రపంచసంగ్రామానంతరం జర్మనీ ఓటమితో, నానారాజ్య సమితి దక్షిణాఫ్రికా సంరక్షణకు ఒప్పగించింది. ఆనాటినుంచీ దక్షిణాఫ్రికాప్రభుత్వం నైరుతి ఆఫ్రికాను కబళించడానికి పన్నాగం వేసింది. దక్షిణాఫ్రికాలోవలెనే నైరుతిఆఫ్రికాలో కూడా శ్వేతవర్ణేతర జాతుల్ని బానిసలుగా చేసి శ్వేతవర్ణసామ్రాజ్యం స్థాపించాలని దక్షిణాఫ్రికాలోని యూరోపియన్లు సంకల్పించారు. ఈనాడు దక్షిణాఫ్రికాపార్లమెంటులో యూరోపియన్లను తప్ప తదితరులకు తావులేదు. ఆదేశంలో తెల్లవారికంటె నీగ్రోలసంఖ్య అనేకరెట్లు ఎక్కువ. స్వదేశంలో అన్నం కరువై పరాయిదేశం వలసవెళ్లిన తెల్లవారందరూ ఆ పరాయిదేశాలకు చెందినవారిని అణగద్రొక్కి తామే సంపద లనుభవించాలని యత్నించారు. ఆసియాలో ద్వితీయప్రపంచ సంగ్రామంతో యూరోపియన్ల ఆశ పూర్తిగా భగ్నమైపోయింది. ఆఫ్రికాలో నివాసం ఏర్పరుచుకున్న "ఆఫ్రికాన్స్"కు మాత్రమే ఈ కార్యం ఇప్పుడు మిగిలింది. ఆఫ్రికావాసులని పేరుపెట్టుకొని జర్మన్, ఇంగ్లీషుభాషలు సంకరమైన ఒక కొత్తభాషను సృష్టించి "ఆఫ్రికాన్స్" అని పేరు పెట్టుకున్నారు. "ఈఆఫ్రికాన్స్" జాతీయ దురహంకారం జర్మన్ నాజీలను తలదన్నింది. తెల్లవారికే దేశసంపదలన్నీ చెందాలని వారి కోరిక. ఈవాంఛతో ఆ దేశానికి చెందిన నీగ్రోజాతులవారిని తమ బానిసలుగా చేసుకోడానికీ, అవసరమైతే కొన్ని జాతుల్ని నిర్మూలం చెయ్యడానికీ దక్షిణాఫ్రికాజాతీయవాదులు సంకల్పించారు.



డా. మలాన్

దక్షిణాఫ్రికాలో వర్తకంనిమిత్తంచేరిన అనేక లక్షలమంది భారతీయుల్ని వెళ్లగొట్టాలని యత్నిస్తున్నారు. ఐక్యరాజ్యసమితిని ధిక్కరించి కనీసమానవధర్మాలను మట్టుబెట్టి "ఆఫ్రికాన్స్" అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. వారి జాతీయదురహంకారం వారి నెత్తురుపంచుకున్న బ్రిటిష్‌జాతివారికే ఘాత తలపెట్టింది. అల్పసంఖ్యాకులైన బ్రిటిష్‌వారిపట్ల స్నేహసామరస్యాలతో వర్తించాలని ప్రయత్నించిన బ్రిటిష్‌జాతీయుడు స్మట్స్ పదచ్యుతుడైనాడు. మలాన్ హిట్లర్‌ను తలదన్ని క్రూరహింసాకాండ ప్రారంభించాడు.

నీగ్రోజాతులవారిని బానిసలుగా చెయ్యడానికి దక్షిణాఫ్రికాప్రభుత్వం ఏరీతిగా ప్రయత్నించిందో మైకేల్ స్కాట్ ధర్మకర్తృత్వ సంఘంలో వివరించాడు. నానారాజ్య సమితివలన నైరుతిఆఫ్రికాపై సంరక్షణాధికారం పొందిన దక్షిణాఫ్రికాప్రభుత్వం నీగ్రోలను వారి చిరకాలస్థావరాలనుండి వెళ్లగొట్టడానికి వారి గ్రామాలపై బాంబులు వేసింది. నిరాయుధులైన నీగ్రోలను వేటాడి తుపాకులతో కాల్చి వారి నివాసాల నాక్రమించుకుంది. వారి భూముల్ని లాక్కొని తెల్లవారి కొప్పగించింది. విమానాలు పంపి కొండచరియలలోని నీగ్రోల గ్రామాలను బాంబుచేసి ధ్వంసం చేసింది. వారి గృహాలకు నిప్పంటించింది. వారి పశువుల్ని స్వాధీనపరుచుకుంది. "నౌకర్లు, యజమానుల శాసనం"ద్వారా నీగ్రోలను బానిసలుగా చేసింది.

బ్రిటన్‌సంరక్షణలో ఉన్న బెచువానాలాండ్ పరిపాలనలో పక్షపాతం ఎంత ఉన్నప్పటికీ నీగ్రోలను బ్రిటిష్‌ప్రభుత్వం బానిసలుగా చెయ్యలేదు. వారి భూములను వారికే దక్కనిచ్చింది. జర్మనీపరిపాలనాధికారంలో ఉన్నప్పుడు జర్మన్ అధికారులు హెరీరోజాతిని నిర్మూలం చెయ్యడానికి యత్నించారు. ప్రథమ సంగ్రామం ఆ జాతిని నిర్మూలం కాకుండా రక్షించింది. కాని ఇప్పుడా కార్యక్రమాన్ని దక్షిణాఫ్రికాప్రభుత్వం ప్రారంభించింది.

పాశ్చాత్యనాగరికతను నేర్పడానికివచ్చిన పాశ్చాత్యులు తుపాకుల బలంతో నిరాయుధులైన నీగ్రోలను బానిసలు చేస్తున్నారు. బ్రిటిష్ పౌరుడైన రెవరెండ్ మైకేల్ స్కాట్ నైరుతి ఆఫ్రికాలో క్రైస్తవమతాచార్యుడుగా ఉన్నాడు. క్రైస్తవమతం ఇప్పించి అనాగరకులను నాగరకులుగా చెయ్యాలనే విషతో పరిపాలకులు చేస్తున్న దురంతాలను క్రైస్తవమత ప్రచారకుడు సహించలేకపోయినాడు. నీగ్రోల గోడు వినడానికి వీలులేకుండా మలాన్ ప్రభుత్వం శతవిధాల యత్నించింది. నీగ్రో జాతులు తమ తరఫున స్కాట్‌ను పంపినాయి. దక్షిణాఫ్రికాప్రభుత్వం క్రింద తమ కెంత మాత్రం క్షేమం లేదనీ నైరుతి ఆఫ్రికాను ఐక్యరాజ్యసమితి తన ధర్మకర్తృత్వంక్రిందకు తీసుకోవాలనీ నీగ్రోలు కోరుతూ, తమ కోరికను స్కాట్‌ద్వారా తెలిపారు.

ఆఫ్రికాలో బ్రిటిష్‌వారు తమ పరిపాలనలో గల వలసల్లో నీగ్రోలను నిర్మూలం చెయ్యడం లేదన్నమాట నిజమే కాని బానిసలుగా చెయ్యడానికి అక్కడ కూడా యత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

పూర్వ జర్మనీ వలసగా ఉండి ఇప్పుడు తమ సంరక్షకత్వంలో ఉన్న టాంగన్యీకాను తమ సమీప వలసల్లో కలుపుకోడానికి బ్రిటన్ కూడా యత్నిస్తోంది. అన్యదేశాలలో ప్రచారానికీ, మోసానికీ పనికివచ్చిన ప్రజాస్వామ్యసిద్ధాంత సూత్రాలు ఆఫ్రికాలో మాటకైనా కొరగాకుండా పోయినాయి. అందువల్ల తమ బండారం కూడా బయటపడుతుందనీ, తమ కింద బానిసలుగా ఉన్న నీగ్రోలు మేల్కొంటారనీ భయపడుతున్న బ్రిటన్ మలాన్ ప్రభుత్వంపట్ల ఏ ప్రేమాదరాలు లేకపోయినప్పటికీ ఐక్యరాజ్యసమితిలో దక్షిణాఫ్రికాప్రభుత్వానికే మద్దతు నిచ్చింది. స్కాట్ సాక్ష్యాన్ని నిరాకరించాలని ధర్మకర్తృత్వసంఘంలో పోరాడింది. కాని బ్రిటన్ యత్నం విఫలమయింది.

స్కాట్ సాక్ష్యాన్ని ధర్మకర్తృత్వసంఘం విన్నందువల్ల దక్షిణాఫ్రికాప్రధాని మలాన్ ఇకనుంచి నైరుతిఆఫ్రికాలో పరిపాలనావిధానం ప్రజల స్థితిగతులు మొదలైన వివరాలను పంపబోవడం లేదని ప్రకటించాడు. నైరుతిఆఫ్రికాను దక్షిణాఫ్రికాలో అంతర్భాగంగా చేర్చివెయ్యదలిచినట్లు ప్రకటించాడు. దక్షిణాఫ్రికానుంచి ఎట్టి వార్తలు పైకి పొక్కకుండా కట్టుదిట్టం చేశాడు. నీగ్రోలపట్ల తమ పరిపాలనను విమర్శించేవారిని అణగద్రొక్కివెయ్యడానికి సంకల్పించాడు. హిట్లర్ నియంతృత్వంకంటె మించిన నియంతృత్వాన్ని ఆఫ్రికాఖండం దక్షిణప్రాంతంలో స్థాపించడానికి మలాన్ యత్నిస్తున్నాడు.

దీనివల్ల విసుగుచెందిన చిన్నరాజ్యాలన్నీ బ్రిటన్ మొదలైన దేశాల వాదాల్ని పెడచెవినిపెట్టి దక్షిణాఫ్రికాప్రభుత్వాన్ని నిరసిస్తూ తీర్మానంచేశాయి. నైరుతిఆఫ్రికా వ్యవస్థను గురించీ, దక్షిణాఫ్రికాకు నైరుతి ఆఫ్రికాపై ఎట్టి అధికారాలున్నాయో, ఐక్యరాజ్యసమితికి ఎంతవరకూ జోక్యంచేసుకోడానికి అధికారం ఉందో తెలపవలసిందని అంతర్జాతీయ న్యాయనిర్ణయసంస్థను కోరుతూ భారత దేశప్రతినిధి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా ధర్మకర్తృత్వసంఘం ఆమోదించింది.

యూరోపియన్ల వలసలు:

ఇదే బిగిలో చిన్నరాజ్యాలు యూరోపియన్ల వలసలనుగురించి చర్చించినప్పుడుకూడా బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం మొదలైన దేశాల ఆక్షేపణలను పెడచెవినిపెట్టి ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశంలో ధర్మకర్తృత్వసంఘం సమర్పించిన నివేదికను సూచనలను ఆమోదించాయి.

స్వపరిపాలనాధికారం లేని దేశాలలో పరిపాలనాగతినిగురించి ప్రజల రాజకీయవ్యవస్థను గురించీ పాలకప్రభుత్వాలు సర్వ వివరాలనూ

(21 వ పేజీ చూడుడు)

★ మహాకవి గురజాడ అప్పారావు ★

స్మృతి



ఒకవైపునుండి జాతీయవాదం స్వాతంత్ర్య సముపార్జనాప్రయత్నంలో దేశంనలుమూలలా వ్యాపించి విజృంభిస్తోంది. మహానాయకుని అడుగుజాడలలో, జాతీయసంస్థ ఆధ్వర్యంలో, త్రివర్ణపతాకచ్ఛాయలక్రింద నిర్ణీత కార్యక్రమంలో ముందడుగు వేస్తోంది. జాతీయత వన్నె, చిన్నెలతో తీర్చి దిద్దబడుతోంది. స్వీయపరిపాలనావాంఛ ప్రబలం కాసాగింది.

మరోప్రక్కనుంచి హరిజన దేవాలయప్రవేశం, వితంతువివాహం, బాల్యవివాహనిషేధం మొదలైనవాటితో సాంఘికసంస్కారం జరుగుతోంది. నూతనసామాజికవ్యవస్థకు శిలాన్యాసం చేయబడింది. ప్రగతిపథానికి ప్రతిబంధకాలైన 'సాంప్రదాయిక' శృంఖలాలు విడగొట్టబడుతున్నై. ఆచారాలపేరుతో 'జనత'ను అధఃపతనానికి గొనిపోతూన్న పెద్దల పలుకుబడి క్షీణదశకు రాసాగింది. నాలుగు గోడల మధ్యలో

ఉషశ్రీ


నలిగిపోయి వెలుగుబాట తెరుగని నారీజగత్తు గృహపరిధులలోనుండి బైటికి రాసాగింది.

జాతీయవాదం - సంఘసంస్కారం సమ్యక్ సమ్మిళితములై అడుగడుగునా అడ్డుతగిలే చాతుర్వర్ణవ్యవస్థపై సమ్మెటపెట్టు పెట్టినై. కుల, మత, వర్ణ, వర్గాదివిభేదాలు అఖాతాలలో సమాధి కట్టుకుంటున్నై—

ఆ యీ సాంఘిక, జాతీయసంస్కారభావాల పరిణామప్రకాశాల పర్యవసానంగా నూతన సామాజికవ్యవస్థ నెలకొనసాగింది. ఈ సామాజికుల దృక్పథం ప్రగతిపథంవైపూ, విజ్ఞానంవైపూ మరలసాగింది. సామాన్యశ్రామికజగతికి విజ్ఞానవాంఛ కలిగింది. జ్ఞానసముపార్జనాప్రయత్నం మొలకలెత్తింది.

సామాన్య 'జనత'కు కలిగిన వైజ్ఞానికతృష్ణ తీరాలంటే విద్యనేర్వాలి. అక్షరాస్యులు కావాలి. అయితే విద్యావిజ్ఞానాలు ఆనాటివరకూ స్వల్పసంఖ్యాకులైన ఒకేఒక ప్రత్యేక వర్ణానికి చెందినవారి సేలభోషాణాలు కావటంవల్ల అది సర్వసామాన్యులకు ప్రయోజనకారియైన రీతులలో లేవు. ఈనాడు కలిగిన విజ్ఞానతృష్ణ అగ్రగణ్యుల ఆస్తిపై సర్వసమానత్వ శాసనంతో దాడిచేసి విద్యావిజ్ఞానాలు కాయకష్టంపడే శ్రామికుడువరకూ అందుబాటులో ఉండాలంది. కాని ఈ తృష్ణను చల్లార్చటానికి ఆ సాహిత్యంకాని, ఆ వాఙ్మయంకాని ఉపయోగం కాలేదు. ఒక కొత్త భాష, కొత్త సాహిత్యం సృష్టిచేయవలసి వచ్చింది.

పాతపుంతలలో పొర్లుతూ మార్పుకి భయపడే సనాతనులు కొందరు ఈ నూతనవాదంమీద భీకరదండయాత్ర ప్రారంభించారు. ఆ మహా విమలసమరఫలితంగా "వ్యావహారికభాష" గ్రంథాలలోకి రావలసివచ్చింది. నాటివరకూ సాహిత్యం పాండిత్యప్రకర్షా ప్రదర్శనలలో చర్వితచర్వణమై 'జనత'కు ఉపకరించే విధానంలో లేకపోవటంమాత్రమే కాకుండా అర్థం కాకుండాపోయింది. జనతకు సులభగ్రాహ్యమై, సుబోధక మయే వ్యావహారికభాషా సాహిత్యపథనిర్మాణం చేయవలసివచ్చింది. పథనిర్మాతకోసం 'జనత' ఎదురుతెన్నులు చూస్తోంది—



గుంటూరులో నవంబరు 22 వతారీఖున జరిగిన శ్రీ రామమోహన ఆయుర్వేద కళాశాల రజతోత్సవ సందర్భమున తీసిన ఛాయాచిత్రము.

జాతీయ సాంఘిక పరిణామవికాసాలను చూస్తూన్న యువకలోకం భవిష్యత్తునుగూర్చి సుందరస్వప్నానుభూతుల్ని పొందుతోంది. సర్వతోముఖంగా పురోగమించే సమాజానికి సాహిత్యం నిరాశను కలిగిస్తోంది. పాతపై రోత ప్రకోపించింది. కొత్త యింకా యేర్పడలేదు. వైదేశిక సాహిత్యరంగాలలోని ప్రగతీపథాలు యువకులలో చైతన్యం కలిగించినై. ఆ ప్రగతీపథనిర్మాతకోసం తపస్సు చేస్తున్నారు.

ఛందోశృంఖలాబద్ధులై, సమాసపదపటాటోపాలతో ప్రదర్శనాలిస్తూన్న పండితకవులపై కఠోరకుఠారాఘాతం పెడుతున్నాడు గిడుగు పిడుగు. తెగిపోయిన తీగలతో తెలుగుసాహితీమ తల్లి ముంజేతి నున్న సువరమాణిక్యవీణకు నూతన తంత్రులు మేళవించాడు—

నిర్మలవినీలాకాశాన అలముకొన్న కారు మేఘాలు చెల్లాచెదరైనై. విహాయసాన ప్రాగ్భాగాన రంగురంగుల రంగవల్లు లలంకరించుకొని ప్రత్యాహ్వానం చేస్తూ నిలబడింది ఉషారాణి. క్షణక్షణపరివర్తితో వస్సంధ్యారోచిస్సుల మధ్యనుండి అమృతకలశం చేతబట్టి ఆవిర్భవించిన అమరమూర్తి శ్రీగురజాడ ఆశలు ఫలించినై - సుస్వాగతం గురజాడా!

నవ్యకవిత్వరూపకానికి తెరయెత్తారు. గిడుగు సూత్రధారియై నాందీప్రస్తావనలు చేశాడు. నాయకపాత్రధారియై రంగస్థలావతరణం చేసి ఉత్తమనాయకుడై "కన్యాశుల్కం" సమర్పించిపోయిన స్వర్ణశిల్పి శ్రీగురజాడ.

సాహితీమతల్లి మాణిక్యవీణపై మృదుమధుర మంజుమంజులకంఠ మెత్తి "కొత్తపాతల మేలు కలయిక" పాడిన పాటకుడు, వైణికుడు శ్రీగురజాడ.

అతడు గొంతెత్తి పాడిన పాటలు తెలుగు తల్లికంఠసీమ నలంకరించినై "ముత్యాల సరాలు"గా—

'వేమన్న'నుగూర్చి కరుణశ్రీ :

> కాగుడింతాలలో డిప్పకాయగూడ
> అప్పగించును నీ "ఉప్పు కప్పురంబు"

అని చెప్పినట్లు గురజాడకుకూడా :

> "కాగుడింతాలలో డిప్పకాయగూడ
> వల్లెవేయును నీ "దేశభక్తి" పాట—

అని అన్వయించుకోవొచ్చు.

ఈనాడు ధారాళంగా సాగిపోతూన్న నవకవిత్వవాహినికి మార్గదర్శి గురజాడ- మహాకవి - యుగపురుషుడు సంస్కర్త—

ముచ్చటగా మూడుముక్కలలో తెలుగుదేశ చరిత్ర చెప్పవలసివస్తే ఒకచోట వచ్చితీరతాడు శ్రీగురజాడ—

జోహార్ ! అమరకవీ !!

కథానిక:

దీవన

శ్రీ వారణాసి వేంకటరమణ శర్మ

"రాజూ, నిన్ను దేము డెప్పుడూ రక్షిస్తాడులే!" అని కాము అంటుంటే, రాజుకళ్లవెంట నీళ్లు రాలేయి.

రాజు, కాము, యిద్దరు ప్రాణస్నేహితులు. ఇద్దరూ వయస్సులో చిన్నవాళ్లే, యించుమించు యిద్దరిదీ వొక్కయీడే అని చెప్పవచ్చు. అప్పటికి వాళ్లకి యెనిమిదోయేడు నడుస్తున్నాది.

తెల్లవారేసరికి యిద్దరూ కలసి బోరుస్కూలుకి పోతారు. పదిగంటలకి యింటికివచ్చి భోజనము చేసేవారు. అప్పుడు కాము, రాజు యింటికి వెళ్తాడు. యిద్దరూ కలసి గరివెళ్లవారి మామిడితోటకి వెళ్లి ఆడుకుంటారు. మామిడిచెట్లెక్కి పాటలుపాడుతూ కూర్చుంటారు. తోడిపిల్లలందరూ కలసి కోతి పిన్నెలకర్ర ఆటో, లేక దొంగాటో ఆడుతూ వుండడము వారికి పరిపాటయిపోయింది. సాయంకాలము యిద్దరూ కలసి చెరువుగట్టుకి పోతారు. అక్కడ పాపడు చేపలుపడుతూ వుంటాడు. "ఓరే! పాపా! నువ్వేమిటి చేపలు పడతావు. నే నెలా పడతానో చూడు." అని రాజు అనేసరికి, పాపడు చేపలు పట్టే దోనె రాజుకి అందిస్తాడు. ఆరాయిమీద కూర్చొని రాజు అతి నేర్పుతో చేపలు పడుతూవుంటే, కాము పెద్ద కళ్లుపెట్టి చూస్తూ కూర్చుంటాడు. నిజానికి రాజు చేపలు పట్టడంలో అతి నేర్పరి. పాపడు దోనె వేసినపుడల్లా చేప ముల్లుకి తగులుకుంటుందన్న ఆశ లేదు. కాని రాజు కర్ర విసరి వేసినపుడల్లా ముల్లుకి చేప వ్రేలాడుతూ వుండవలసిందే. అందుచేతనే రాజు అడిగినప్పుడల్లా పాపడు రాజుకి దోనె అందిస్తాడు.

అలా కొంతసేపు చేపలుపట్టినతర్వాత, రాజు విసుగెత్తిపోతాడు. "పదరా, కామూ, చెరువులో దిగి యీతకొడ్దాము." అంటాడు. కాము, మంత్రింపబడిన పాములా, రాజు యే పనిచెప్తే ఆపని చేస్తాడు. యిద్దరూ బట్టలు విప్పి, ఒడ్డునపెట్టి, నీటిలోకి దూకుతారు. రాజు యీతకొడ్తూ చెరువుమధ్యనివున్న కొండరాళ్లమీదకి పోతాడు. కాము ఒడ్డునే యీతకొడ్తూ కాలయాపన చేస్తాడు. అలా విసుగెత్తినవరకూ యీదుతూ, చీకటిపడేసరికి ఒడ్డుకి చేరుకుంటారు. అప్పుడు బట్టలు కట్టుకొని "పాపా యిక యింటికి పోతాము" అని పాపడితో చెప్పి బయలుదేలుతారు.

త్రోవలోనే కోవల. కోవెలలోకి పోయి, దేముడికి నమస్కరిస్తూ, వారికి తెలిసిన పద్యాలు చదువుతారు. గున్నయ్య పూజారివారికి యిచ్చిన ప్రసాదమును తింటూ యింటికి బయలుదేరుతారు. అలా, రాత్రి యింటికి చేరేసరికి, ఏడుగంటలవుతుంది.

వీళ్లిద్దరూ, రోజులో చాలామట్టుకు, యేతోటలోనో, చెరువుదగ్గరో కాలక్షేపము చేస్తారు. యింటిదగ్గర వాళ్లున్నది చాలా తక్కువ. దీనికి కారణము లేకపోలేదు.

కాము చిన్నప్పుడే వాని తల్లిదండ్రులు పోయేరు. అందుచేత పినతల్లియిల్లు చేరవలసి వచ్చింది. పినతల్లికి పిల్లలు లేకపోలేదు. ఆమెకు నల్గురు మగపిల్లలు, యిద్దరు ఆడపిల్లలు. కాము యేడోవాడయ్యేడు. పినతల్లియింట్లో కాముకి నిజానికి తావేలేదు. అయినా, తల్లిదండ్రులు లేనిబిడ్డ. దగ్గరకు చేరదీయకపోతే లోకు లేమనుకుంటారో అని తన యింటికి తెచ్చింది. ఆమెయొక్క భర్త జోగారావు, అట్టే స్థితిపరుడు కాడు. భూములవల్ల కొంచము ధాన్యము వస్తాయి. ఆవూరులోనే బోర్డుస్కూలు మేష్టరుగా పనిచేస్తున్నాడు. కాని యింటిలో బలమైన సంతానము వుండటముచేత, తన సంపాదన చాలకుండావుంది. కరువులో అధికమాసములాగ, యీబరువుకితోడు, కాము వొకడు తయారయ్యేడు. వాని బాధ్యతంతా అతనిమీదే పడింది.

అయినా, యీమాత్రము దానికి జోగారావు విసుగుకోవలసిన మనిషి కాడు. తన అన్నకొడుకంటే అతని కమితమైన ప్రేమ. తన తల్లిదండ్రులు పోయినప్పుడు, తన అన్నే, అతనిని దగ్గరవుంచుకొని, కొద్దో గొప్పో చదువు చెప్పించి పెద్దవాడిని చేశాడు. యీనాడు, తను కొద్దో గొప్పో తెచ్చుకుంటున్నాడు. అలాంటప్పుడు తన అన్నకొడుకుని, యింటిలో పెట్టుకోపోతే లోకు లేమనుకుంటారు.

అసలు, లోకు లేమనుకుంటారన్న విషయముతో అతనికి సంబంధము లేదు. తన అన్నంటే అతని కదోవిధమైన ప్రేమ. అన్న చనిపోయినతర్వాత కాముని, తన అన్న బదులు ప్రేమిస్తున్నాడు. దీని కంతటికి కారణము, కాము అతని అన్నకొడు కవడమేనా? దీనికి సరియైన కారణము చెప్పలేము.

ఏది యెలాగైతేనేమి, కాము, పినతండ్రి గారింట్లో బస యేర్పాటుచేసుకున్నాడు. పినతండ్రి యెప్పుడూ కాముని కోపపడియెరుగడు. కాని పినతల్లి మాత్రము, అలా ఓర్పు వహించగల మనిషి కాదు. యేలాగోలాగు కాముని కోపపడుతూనే వుంటుంది. కాము అల్లరచేసినట్టయితే, దెబ్బలు తినవలసిందే. కాము అసలు అల్లరిపిల్లవాడు కాడు. కాని యింటిల్లు చాకిరీచేసి అలసివున్న పినతల్లికి, కాము యేచిన్న తప్పుపని చేసినా, పెద్దతప్పుగా కనబడుతుంది. అందుచేతనే కాముపై కలియబడుతుంది. పినతల్లి కోపపడుతూవుంటే, కాము యేడుస్తూ వొకమూల కూర్చుంటాడు.

యింటివద్దవుంటే, పినతల్లిచేత చీవాట్లు తినాలికదాఅని, కాము రాజుగారింటికి పోతాడు. రాజు, కాము కలసి వూరుబయటికి పోయి ఆడుకుంటారు. ఇది వారి నిత్యజీవితము.

కాని, యిలా అట్టే రోజులు గడవలేదు. రాజు తండ్రిలేని బిడ్డ. తల్లి తను మాత్రమే వుండేవారు. మేనమామకు విశాఖపట్నములో ఉద్యోగము. ఒకనాడు హఠాత్తుగా తల్లికి జబ్బుచేసింది. చెల్లెలికి వొంట్లో బాగులేదుకదాఅని, రాజుయొక్క మేనమామ, వీళ్లున్న గ్రామము వచ్చేడు. కొన్నాళ్లు బాధపడి, రాజుతల్లి స్వర్గస్థురాలయింది. రాజు తల్లిదండ్రులు లేని బిడ్డయిపోయాడు?

అందుచేత, మేనమామతో రాజు వెళ్లిపోతున్నాడు. బండి రాజుయింటిముందు ఆగింది. సామాన్లు అన్నీ బండిలో పెట్టారు. తల్లి చనిపోయిందనే చింతతో, రాజు, అరుగుమీద ఒకమూల కూర్చున్నాడు. సామాన్లు అన్నీ బండిలోపెట్టినతర్వాత, మేనమామ రాజుని యెత్తుకొని బండిలో కూర్చోపెట్టేడు. బండి కదిలింది. కాని, యింతలో ఒక యింటిముందునుండి బండి పోతూంటే, "కామూ" అని కేకవేస్తూ రాజు బండి దిగేడు. అదే జోగారావుగారిల్లు. అరుగుమీద కాము నించొని, రాజుని పెద్దకళ్లతో చూస్తున్నాడు.

"కామూ, నేను వెళ్తున్నాను." అని రాజు చెప్పగల్గేడు. అంతలో రాజుకళ్లలో నీళ్లు తిరిగాయి. అరుగుమీద నించొనివున్న కాము, పరుగున బండిదగ్గరకు వచ్చేడు.

"నువ్వు కూడా వెళ్ళిపోతున్నావా, రాజూ!" అని జాలిగా అన్నాడు. అలా అంటూనే, కాము రాజు చెయ్యిపట్టుకొని యేడ్చేడు. కాని యింతలో బండిలోవున్న మేనమామ "వేగరముగా, రా రాజూ" అని కేకవేశాడు.

రాజు, అతి జాలిగా కాముప్రక్క చూసేడు. అప్పుడే కాము అలా అన్నాడు. "రాజూ, నిన్ను దేము డెప్పుడూ రక్షిస్తాడులే" దేముడెలా రాజుని రక్షిస్తాడో కాము కేమి తెలుసు. అయినా అలా దీవించేడు. యీ మాటలతో యిద్దరు బాలస్నేహితులు విడిపోయారు.

* * *

రాజు వెళ్ళిపోయినదగ్గరనుంచి కాముకి తోచడములేదు. ఊరిచెరువులో యీతకొట్టడానికి, కాముకి తోడుదొరకలేదు. యిక యింట్లోనే వుండవలసింది.

ఆరోజున పండుగ. యింట్లో పిండివంటలు చేస్తారు. కాముకి కొత్తబట్టలు కుట్టించేరు. అవి కట్టుకొని భోగిమంటదగ్గర కూర్చున్నాడు. యింతలో పినతల్లి పిలవడముమూలాన యింటికి వెళ్లేడు.

"కామూ, కరివేపాకుచెట్టెక్కి ఆకు కొంచము కోసిపెట్టు." అని చెప్పింది: పెరట్లోనే కరివేపాకు చెట్టు. చెట్టెక్కేడు. కరివేపాకురెమ్మలు కోస్తున్నాడు. యింతలో కాముగుండెలు ఝల్లుమని కొట్టుకోడము, కళ్లు మూతలుపడటము, కాము క్రిందబడటము, అన్నీ ఒక్కమారే జరిగాయి. గొల్లుమని కేకవేశాడు. పినతల్లి కంగారుపడుతూ పెరట్లోకి వచ్చేసరికి, కాలువిరిగిన కాము, బురదలో పడివుండటము చూసింది.

కాముకి తెలివివచ్చేసరికి, కాళ్లకు కట్టుకట్టి పరుపుమీద పడివున్నాడు. ఆదినమే కాముని పట్నము తీసుకొని వెళ్లేరు. ఆసుపత్రి చేరేసరికి సాయంత్రమయింది. డాక్టరు, కాముని చూసి, విశాఖపట్నము తీసుకొని వెళ్ళమని చెప్పాడు. జోగారావుగుండెలు దడదడా కొట్టుకున్నాయి.

కాముని విశాఖపట్నము ఆస్పత్రికి తీసుకుపోయేరు. అక్కడ కుడికాలు తీసేశారు.

కాము, ఆస్పత్రిలో పడుకున్నాడు. కాని నిద్రపట్టదు. యింతకుముందు అందమైన కాము, యిప్పుడు అంగవిహీనుడైపోయేడు. యిక జీవితమల్లా, యిల్లానే గడపాలా, అని ఆలోచిస్తూ ఆ ఆస్పత్రిలో ఒకమూల పడుకొనివున్నాడు.

యింతలో రాజు జ్ఞాపకము వచ్చేడు. యీ విశాఖపట్నములోనే రాజు వున్నాడు. కాని అతనికీ సంగతి తెలీయడమెట్లా? జోగారావుగారిని, రాజుగురించి అడిగేడు.

"వాడెక్కడున్నాడో, నాకేమి తెలుసురా" అని విసుగుకుంటూ అన్నాడు; కాము ఆదినము మొదలు రాజునిగురించి అడగడము మానివేశాడు. కాని, రాజుని తలవని జాము లేదు. సంవత్సరము క్రిందనే వాళ్లిద్దరూ ఆడుకునేవారు. యీనాడు విడిపోయేరు. ఒకడు అంగవిహీనుడై ఆస్పత్రిలో పడ్డాడు. ఇక రెండోవాడో?

* * *

రాజు, మేనమామతో విశాఖపట్నము చేరుకున్నాడు. మేనమామ అక్కడ పెద్ద ఉద్యోగస్థుడు. అందుమూలాన వీరింటికి పెద్దమనుషులు వస్తూవుండటము ఆశ్చర్యమైన విషయము కాదు.

ఆదివారంఉదయము ఏడు గంటలయింది. రాజు, అరుగుమీద నించొని పరధ్యానముగా చూస్తున్నాడు. "అబ్బాయీ!" అని భుజముమీద తట్టిన చప్పుడు విని త్రుళ్లిపడ్డాడు. వెనుదిరిగి చూసేసరికి మూర్తిగారు కన్పడ్డారు. మూర్తిగారు విశాఖపట్నము కాపురస్థుడే. మంచి స్థితిపరుడు. రాజుని చూచిన దగ్గరనుండి, అతనిని తనుపెంచి పెద్దవాడినిచేద్దామనే ఉద్దేశము కలిగింది. తనకు పుత్రసంతానము లేకపోవడమే దీనికి బలమైన కారణము. ఈ విషయమై రాజు మేనమామతో మాట్లాడాడు.

రాజు అదృష్టవంతుడే! ఆదివారమునాడే, మూర్తిగారింటికి, రాజు, కారులో ప్రయాణము సాగించాడు.

* * * *

ఆస్పత్రిని, నిశరాత్రిలో చూడలేము. ఆ వాతావరణములో నిశీధసమయమున, తెలివితో, మానవమాత్రుడు నిలబడ్డాడంటే వాని కనేకవిధములైన ఆలోచనలు తట్టుతాయి. యిది సహజము. ఆస్పత్రిలో నుండేది రోగిసమాజము. అందరూ కృశించిపోయినవారే. ఎక్కడ చూచినా అంగవిహీనులే. ఆ సమాజముమధ్య నిలబడ్డకవి ప్రేమగీతాలు వ్రాయలేడు. ఏదో స్త్రీ మూర్తిని మనస్సులో పెట్టుకొని, దానికి ప్రేమారాధన చేయలేడు. యీ సమాజమునిండా బాధపడినవాళ్లే. వీళ్లకి చికిత్సచేయాలి. వీళ్లతో అక్కడున్నవాళ్లు కూడా బాధపడాలి. "ప్రేమమయమే యీ జగము" అని పెర్రిపాటలు పాడుతూ సముద్రపుటొడ్డుకి వాహ్యాళికి పోకూడదు.

ఈ విషయముగురించి జోగారావుగారికి బాగా తెలుసు. కాము రోగిష్టి. ఎప్పుడు మంచముపై పరుంటాడు. వానికి నిద్రపట్టదు. వుండివుండి, "అబ్బా! నొప్పి!" అని గొల్లుమని యేడుస్తాడు. అప్పుడు జోగారావుగారు "ఫరవాలేదు నాయనా" అని ఓదారుస్తాడు. రాత్రి 12 గంటలయినా జోగారావుగారికి నిద్రపట్టదు. కాము యిప్పుడు అంగవిహీనుడు. వీనికెంత చదువుచెప్పించినా తనకాళ్లపై నిలబడలేడు. వీని గతి యేమి కావలసిఉన్నది. యీ విషయమై తలుచుకుంటే జోగారావుగారి గుండెలు కొట్టుకుంటాయి. కాముని చూచినప్పుడల్లా గుండె కరిగిపోతుంది. కళ్లవెంట రెపరెప నీళ్లుకారుతాయి. "ఏమికావలసివుందో, అది అవుతుందని" వూరుకోవలసిన మనిషి కాడు. అందుచేతనే విచారముతో సగము క్షీణించిపోయారు, జోగారావుగారు.

* * *

కాముకాలు తీసేశారు. గాయము నయమయింది. ఆస్పత్రి విడిచి జోగారావుగారిల్లు చేరుకున్నాడు.

శనివారమునాడు జోగారావుగారింట్లో భజన. ఆడవాళ్లందరు అక్కడికి హాజరయారు. కాము బుద్ధిగా ఒకమూల కూర్చున్నాడు.

షావుగువారి వెంకమ్మ యిలా మొదలెట్టింది. "మనకాము, యిక యిలా, యీవూరిలో పడివుండవలసిందేనా"

"మరేమి చేస్తాడమ్మా, సొట్టవాడు, యెక్కడ కెళ్ళితేమాత్రము చెల్లుతాడు." అంది పినతల్లి.

"జోగారావుగారి కొచ్చింది యీకష్టమల్లా!"

యిలా, ఆడవాళ్లందరూ మాట్లాడుకొంటూ వుంటే కాము విన్నాడు. "నిజంగా యీకష్టమంతా జోగారావుగారికే వచ్చింది." అనికాము చిట్టిహృదయము చెప్పింది." యెన్నాళ్ళని యిక్కడ వుంటాను. యెంతపెద్దవాడినైనా నేనేమి చేయగలను. జోగారావుగారింట్లో వుండి, అతనికి కష్టము కల్గించడము దేనికి? మరేమిచేయాలి? రాజుదగ్గరకు పోతేనో? రాజు యెక్కడున్నాడు. అతనెన్నికష్టాలు పడుతున్నాడో, అక్కడికి నేను దేనికి? అయితే మరియింకెక్కడికి? యింకెక్కడా వుండొద్దు. నాతల్లిదండ్రులదగ్గరకే పోతాను!" అని అనుకొని భజనలోంచి లేచిపోయేడు. కుంటుకుంటూ అరుగుమీదికి వెళ్లిపోయేడు.

ఆనాడురాత్రి 12 గంట లవుతుంది. కాము కుంటుకుంటూ జోగారావుగారి మంచమువద్దకు వెళ్లేడు. అతనికి తుది నమస్కారము చేసేడు. పినతల్లివద్దకు వెళ్ళి ముఖములోకి చూసేడు. "యిక మీకు బాధ కల్గించనులెండి." అని మనస్సులో అనుకొన్నాడు. కుంటుకుంటూ ఆరాత్రి యెక్కడికో బయలుదేరేడు.

తెల్లవారేసరికి, వూరిచెరువులో తేలుతున్నాది కాముశవము.

ఆనాడే తపాలామనిషి జోగారావుగారికి వుత్తరము తెచ్చేడు. అది విప్పి చదువుతుండగనే జోగారావుగారి కళ్లలో నీళ్లు తిరిగాయి.

"చూశావే, మనకాముకి, రాజు యెలా ఉత్తరము వ్రాశేడో."

"ఏమనండీ!"


"యేమనా! అయ్యో! నాకామూ! నా బంగారు తండ్రీ, ఎంత దురదృష్టవంతుడివిరా నీకెక్కడిచావు యోగము వచ్చిందిరా.

అని జోగారావుగారు భోరున ఏడుస్తూ వుంటే, పినతల్లికూడా కళ్లతడి పెట్టుకుంది.

"అయితే యేమని వ్రాశేడండీ, రాజు?"

"రాజుని మూర్తి అనే అతను పెంచుకున్నాడట. యిప్పుడు రాజు, మంచి ఆస్తికి అధికారట. అందుచేత కాముని అక్కడికి రమ్మన్నాడు. యిద్దరూ ఒక యింట్లోనే వుండి చదువుకోవచ్చుట. యిద్దరూ హాయిగా...... యేదో యిలా వ్రాశాడు. కాని... కాని... మరి కాము యేడీ! రాజూ! నీ కేమని జవాబు వ్రాయాలి. వాడి చావువార్త వింటే నీవేమి బెంగపెట్టుకుంటావో. అయ్యో! అమ్మ!..." అని జోగారావుగారు కుర్చీలో కూలబడ్డారు.

విశాఖపట్నములో, రాజు, రోజూ తపాలావాడిగురించి చూస్తున్నాడు. "కాము యెప్పటికి జవాబు వ్రాయడేమి చెప్మా!"



'ఇదిగో భద్రాద్రీ - గౌతమి అదిగో చూడండి'

భద్రాద్రి క్షేత్రం - భక్త రామదాసు


రామదాసు సాక్షాత్తూ రామదాసేగాని-ఇది గోపన్నకు లాంఛనమూ కాదు. పెద్దలు సమ్మానించి ఇచ్చిన బిరుదూ కాదు. కేవలంపారవశ్యమూ, రామసాక్షాత్కారంవల్ల కలిగిన తన్మయత్వమూ భద్రాచలంతహసీల్దారుని గోపన్నను రామదాసుణ్ణిగా చేసింది. రామదాసు కవి కాడు. కావ్యం రచించాలనీ, కవితా మార్గాన తన పేరునూ, కీర్తినీ చిరస్థాయిగా చేసుకోవాలనీ ఉబలాటపడినవాడుకాడు. ఆతడి దాశరథీశతకం, మనస్సు పొంగి వెలువడిన వర్ణమాల. అతని కీర్తనలూ అంతే.

రామదాసు ఆడంబరంకోసం భజనచేసినవాడు కాడు. దైవాన్ని తనవాణ్ణిగా చేసుకున్నాడు. దైవం తనవాడే అనుకున్నాడు. అంత స్వతంత్రమూ తీసుకున్నాడు. బుజ్జగించి, ప్రతిమాలి చెప్పేవాడు. చిరాకుపడి కసిరికొట్టేవాడు. తిట్టేవన్నీ తిట్టి, చిన్నతమ్ముణ్ణి బుజ్జగించినట్టు బుజ్జగించేవాడు. ఒక్క రాముడిమీదనే గాదు ఆతడికా స్వాతంత్ర్యం, సీతమ్మతల్లి అయినా అంతే. కాకపోతే ఏమాత్రమూ ఎబ్బెరికమైనా ఉన్నట్లయితే అలా అనేవాడా ? 'ఏమమ్మా-నువ్వూ మీఆయనా ఏకాంతంగా ఉన్నపుడు నా సంగతి కాస్త చెవిని వేయరాదటమ్మా' అని. బెంగాల్‌లో కాళీమాయిని ఇంటి ఆడపడుచులాగ ఎలా చూసుకుంటారో, తాళ్లపాక సంకీర్తన భక్తులందరూ కొండల కోనేటివాడి విషయంలో ఎంత చనువుగా ఉన్నారో రామదాసుకూ, రామభద్రుడికీ ఉన్న సంబంధమూ అల్లాంటిదే. దైవం అనే భక్తితాత్పర్యాలకు పరిణతిస్థితి రామదాసువిషయంలో రాముడు తనవాడే, తాను ఏమన్నా పడేవాడే అనే భావన. ఇది యోగసిద్ధికి చరమాంశ.


శ్రీ పుల్లాభొట్ల వేంకటరామశర్మ

రామదాసుచరిత్ర సింగరిదాసు సంకలనం చేసిందే జనసామాన్యంలో ప్రచారంలో ఉన్నది కాని చరిత్రాత్మకమైనటువంటి సంఘటన విశేషప్రచారంలోకి రాలేదు. బహుశః దానికి కారణం జనాదరణ పొందిన ఈ కథలో ఉన్న వన్నెచిన్నెలు, అభూతకల్పనలు లేకపోవడమే కారణమై ఉంటుంది. తానీషాకూతురు రామదాసుభార్యస్నేహితురాండ్రయినందున తానీషా కూతురు ఉద్యోగం సంపాదించిపెట్టినదనీ, తుదకు చెరపడిన పుడుగూడా ఆమెయే డబ్బు చెల్లించి రామదాసుకు కారాగార విమోచనం కల్గించిందనీ ఇతిహాసంగా ఒకటిచెబుతారు.

ఈ కథకీ, సింగరిదాసు అల్లిన కథకీ వ్యత్యాసం ఎంత ఉన్నప్పటికిన్నీ అంతర్యం ఒక్కటే. రామలక్ష్మణులు తాము స్వయంగా వచ్చి, అన్ని లక్షల వరహాలు మూటలుగట్టి మోసుకవచ్చి గోపన్నబాకీ చెల్లించారన్నా, తానీషాకూతురు, తన నెచ్చెలిభర్తను ఆపదలోంచి తొలగించడానికి తానే పూనుకొని చెర తప్పించడానికి యత్నించినదన్నా రెండింటికీ



సీతారామలక్ష్మణుల జవహరీ



రామదాసు బంధింపబడిన గోల్కొండకోట

పర్యవసానం గోపన్న వాడుకున్న సొమ్ము జమ పడిందనటమే కాని దుర్వినియోగం చేసినందుకు శిక్ష అనుభవించితీరాల్సిందే కదా! రామదాసు సర్కారుసొమ్ము దుర్వినియోగంచేసి శిక్షపడ్డ తహసీల్దారని మనకెవరికైనా జ్ఞాపకమున్నదా? అది రాముడి దయ కాదూ? ప్రభువు అప్పుడు ధర్మనిర్వహణకోసమని తహసీల్దారును శిక్షించక తప్పదు. ఉత్తరభక్తుడు చేసిన కైంకర్యాన్ని మన్నించకను తప్పదు. ఈ రెండూ సక్రమంగానే జరిగాయి. రామదాసుతోపాటు అతడికి ఉద్యోగం ఇచ్చిన ప్రభువుపేరు తెనుగునాట శాశ్వతంగా నిలచిపోయింది. గోపన్న రామదాసు కావడానికీ, కైంకర్యము చేయడానికీ తానీషా ద్రవ్యమేగదా అవలంబనమైనది. రాముడు రామదాసుకు తనవాడు. రామదాసు మనకందరికీ మనవాడు. మనము ఎన్ని చదువులు చదివినా విజ్ఞానంలోకి ఎంత ముందుకు పోకినా ఈముక్క మరచిపోలేము. రామదాసు పలుకులు వినకుండా ఉండలేము. అవి మనకు తారకమంత్రం. భద్రాద్రికీ రామదాసుకూ అవి నాభావసంబంధము.

భద్రాద్రిమహిమ

భద్రాద్రిరాముని భక్తవత్సలత్వ, భద్రాచల మాహాత్మ్యము భక్తిసాగరమున తేలియాడు ప్రపన్నులకేగాక సామాన్యమానవులకుగూడా నేటివరకూ చాలా స్వానుభవవేద్యమే. నాడెన్నడో ఆర్తితో మొరలిడిన ఆరామదాసునే గాక నిన్నగాక మొన్న భద్రాద్రిదరిగౌతమీ నదిలో గ్రుంకులిడిన ఒక అంధునికి చూపునిచ్చినది ప్రత్యక్షదర్శనము. నాడెన్నడో తమ్మల దమ్మక్కనేగాక, నిన్న మొన్న మరొకభక్తామతల్లికి దర్శనమిచ్చి తన సన్నిధానమున చేర్చుకొనుమనీ, తానే శ్రీనివాసుడననీ, శ్రీనివాసుడే తాననీ ప్రబోధించి, అందుకు తార్కాణముగా ఆమెచేతిపై అర్ధరాత్రమున చక్రాంకిత ముద్రవేసి అభయమిచ్చినదీ కనిపించుచునే ఉన్నది. లీలామానుషవిగ్రహుడైన భగవంతుని అవతారము లన్నిటిలో రామావతారసౌశీల్యము, అనన్య సామాన్యమైనది.

రామాలయములేని ఊరుగాని, 'రామ' అని రెండక్షరములు పల్కని నాల్కనుగాని మనదేశమున చూడము. కోలాటములు చిరుతలభజనలు నిత్యకాలక్షేపములైన పల్లెటూళ్లు నిత్యకల్యాణముగా నిత్యానందదాయకముగా గడపుటకు అలవాటుపడినవి. స్మరణే సుఖముగా, నామోచ్చారణతో ఇంతింత దూరమని వెరవక, రామభక్తులు శ్రీరామనవమికి, భద్రాద్రిరాముని దర్శనాపేక్షతో లక్షలాది తరలివస్తూవుంటారు. బళ్లు కట్టుకొనేవాళ్లు బళ్లమీద, రైళ్లమీద వచ్చేవాళ్లు రైళ్లమీద, లాంచీలమీద వచ్చేవాళ్లు లాంచీలమీద, బస్సులమీద వచ్చేవాళ్లు బస్సులమీద రామసందర్శనార్థులై భక్తిసామ్రాజ్య కేంగముల నోలలాడుచూ రామపాదముల చెంత వాలుతూ ఉంటారు. సంక్రాంతికి కాలికి గవ్వలు కట్టుకొని, చిరుతలు చేబూని, పట్టు బట్టములు కట్టి, నెమలిఫించము చేబట్టి అదిగో భద్రాద్రీ, గౌతమీ ఇదిగో చూడండి అని దీపపు కొమ్మలతో పల్లెటి దిక్కుల్లో దాసరులు ప్రత్యక్షమై, ఆ భద్రగిరీశుని ఆ రామభక్తుడైన రామదాసుని కీర్తనలు పాడుకుంటూ పరమానందమానసవీథిలో మునిగితేలుతూ ఉంటారు. ఆంధ్ర రమతల్లులు ఆంధ్రమాత ముద్దుబిడ్డలైన శ్రీ త్యాగయ్య, రామదాసు, నారాయణతీర్థ గీతము లాలపించుచూ, ఊయల లూపుచూ చిన్నపిల్లల తమ మృదుహస్తములతో జోకొట్టుచుంటారు. యవ్వనులందరూ నిద్ర మునిగిన నిశీథిలో వయోవృద్ధులు 'పాహిరామప్రభో, పాహిరామప్రభో, పాహి భద్రాద్రి వైదేహిరామప్రభో' అనే ఆలాపనలో స్వర్గానికి సోపానము కట్టుకుంటూ తన్మయత్వంలో ఉంటారు. సాధారణంగా పాఠశాలల్లో ఈనాటికీ ఒకటో క్లాసులో దాశరథీశతకంపద్యాలు నేర్పుతూనే ఉంటారు. ఆంధ్రదేశమున రాజమహేంద్రవరము, ఏలూరు మున్నగు నగరములందు శ్రీరామనవమిఉత్సవములు కన్నులార చూడవలసినవేగాని వర్ణింపతరముగావు. ఈ పందిర పందిరికి ఆ పందిరనుంచి ఈ పందిరికీ విహారికలై తిర్గి వెళ్లుతూ, కల్యాణాత్మకమైన కథ లాకర్ణించుచూ, ఆనందించుచూ తనివి తీరక రాత్రింబవళ్లు తిర్గుచుండు భక్తుల ఆసక్తితో చూడవలెనేగాని చెప్ప నలవికాదు.

భద్రాద్రికి గోదావరిపై ఇటు రాజమంద్రి, కొవ్వూరుమించి లాంచిమీద పోవచ్చు. అటు దోర్నకల్లుమీదుగా కొత్తగూడెంలో రైలుదిగి బస్సులో బూర్గంపాడు పోయి, రేవుదాటి భద్రాద్రి చేరవచ్చు. ఇటు గోదావరి కెదురుగా లాంచీలలోవచ్చు భక్తులు పాపికొండల సౌందర్యమును రసపిపాసతో తనివితీర అనుభవించెదరు. అటు వనకాంతల సొంపురేకులను తిలకించుచూ కిన్నెరసాని మంజులనిస్వనమునకు పులకించుచూ యాత్ర సాగింతురు.

"గోదారితల్లికీ గొజ్జంగి పూదండ,
కావేరికీ చెన్నకల్వదండ,
సుళ్లుదోపుళ్లు మొసళ్లు దప్పించి
మమ్ము ఇల్లుచేర్చండి ఓతల్లులార"

అనే సరంగుల ఏలపాటలతో తెరచాపలు విప్పి, పడవలపై మరికొన్ని భక్తబృందములు భద్రాద్రిని చేరును. పూర్వజన్మ సుకృతము ఉన్నవారికి తప్ప మైమరపించు ఈలాటిసుందరదృశ్యములు లభింపవు. ఆర్తిగలవారికి, భక్తిగలవారికి భద్రాద్రియాత్ర, భద్రగిరీశుని దర్శనమూ బ్రహ్మానందదాయకము.

ఈ మధ్యన విజృంభించిన రజాకార్ల, కమ్యూనిస్టుమూకలకు వెరచి మామూలుకాలంతో భద్రాద్రికి వెళ్లే యాత్రికుల సంఖ్య తగ్గింది. కొత్తగూడెంనుంచి, బూర్గంపాడుకు పోయే బస్సుల నప్పుడప్పుడు, పాల్వంచ అడవులదాపుల దుండగులు ఎదిర్చి ప్రయాణీకుల హింసించినందున సాయుధరక్షకభటుల కాపలాతో బస్సులు నడచుచున్నవి. వెళ్లేది దేవతాదర్శనానికి. ఆ శ్రీరాముడే రక్ష అనే ధైర్యంతోనే యాత్రికులు నిర్విచారంగా వెడుతూనే ఉన్నారు.

భద్రాచల క్షేత్రమహాత్మ్యాన్ని గూర్చి పురాణాలు ఈ విధంగా చెబుతున్నయ్. సర్వపర్వతాధిపుడైన మేరువు మేనకతోగూడా పుత్రార్థియై బ్రహ్మనుగూర్చి తపస్సు చేశాడు. చతుర్ముఖుడు అతని ఉగ్రతపస్సునకు మెచ్చి ఏమి కావాలో కోరుకోమన్నాడు. రామధ్యానపరాయణుండగు పుత్రుడు గావాలని అతను కోరుకోగా బ్రహ్మ వరమిచ్చాడు. ఆ ప్రకారం ఆ దంపతులకు భద్రుడు అనే పుత్రుడు ఉద్భవించి రామానుగ్రహానికి పాత్రుడై అతనికి నివాసమయ్యాడు. పితృవాక్యపరిపాలనార్థమై శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతుడై—

"పుణ్యుడు రామచంద్రుడట
వోయి ముదంబున గాంచె దండకా
రణ్యము దాపసోత్తమ శ
రణ్యము నుద్ధత బర్హిబర్హిలా
వణ్యము గౌతమీవిమల
వాఃకణపర్యటనప్రభూతసా
ద్గుణ్యము నుల్లసత్తరుని
కుంజవరేణ్యము నగ్రగణ్యమున్."

దండకారణ్యంలో తిరుగుతూ శ్రీరామచంద్రుడు ఒక్కచో విశాలమును అతి నిర్మలము నయిన గొప్ప శిలపై విశ్రమించి మార్గాయాసాన్ని బాపుకొన్నాడు. అందుకు సంతోషించి, మేరువునకు మేనకకు పుత్రుడవై మాకు శైలరూపమున అత్యంత ప్రియభక్తుడవు కాగలవు అని శ్రీరాముడు అనుగ్రహించాడు. అట్టకారము భద్రుడు అవతరించి, పూర్వజన్మజ్ఞానము గలిగి శ్రీరామదేవుని అత్యంతప్రియభక్తితో సహస్రవర్షములు ఆరాధించాడు. అతన్ని రక్షింపకోరి సీతాలక్ష్మణసమేతుడై ధనుర్బాణములు పూని శ్రీరామచంద్రుడు సాక్షాత్కరించాడు. భద్రుడు తన శిరస్సుపై వెలసి తన్నుద్ధరింపవలెనని రాముని ప్రార్థింపగా అటులనే అంగీకరించి కల్పాంతమున వైకుంఠమును పొందగలవని రాముడు వరమిచ్చాడు. శ్రీరామనవమి నాడు జాగరణము చేసి శ్రీరామభజన చేసినవారు శ్రీరామపాదసన్నిధిని పొందగలరనిగూడా భగవద్వాక్యం.

తమ్మలదమ్మక్క

భద్రాచలసమీపంలో ఒక గ్రామమున తమ్మలదమ్మక్క అనే భక్తురాలు కూతురుతో నివసిస్తూ ఉండేది. ఆమె నిద్రపోతూ ఉండగా శ్రీరామచంద్రుడామె మనస్సులో నెరిగి ప్రత్యక్షమై "నేను భద్రాద్రిరాముణ్ణి. ఈ గ్రామానికి నా భక్తుడైనవాడొకడు అధికారిగా వస్తాడు. అతడు గుడిగోపురాలు కట్టిస్తాడు. అంతవరకు నువ్వు నాకు నిత్యంతకైంకర్యం జరిపించవలసింది. అని సెలవిచ్చారు.

ఆమె తన కుమార్తెకు, గ్రామస్థులందరికీ ఈ శుభవార్త తెలిపి భద్రాచలశిఖరము నెక్కి చెట్టు తీగలలో కప్పబడిన సీతారామ లక్ష్మణవిగ్రహాలను కనుక్కున్నది. కనుక్కొని ప్రాణప్రతిష్ఠ జరి

(18 వ పేజీ చూడుడు)



భద్రాద్రి ఆలయమందలి శ్రీ సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహములు



సిండ్రెల్లా!

రచన:
శ్రీ బి. యల్. దేశపాండే

"సిండ్రెల్లా" ఆమెయిద్దరుఅక్కలతో ఉల్లాసముగా కాలము గడుపుతూ వుండేది. సిండ్రెల్లా అందచందాలలోను, తెలివితేటలలోను యిద్దరి అక్కలకంటే గొప్పది అని చెప్పవచ్చు. పరిశుభ్రతలోను. పనిపాటలలోను, ఆరితేరినచేయి సిండ్రెల్లాది.

సిండ్రెల్లాఅప్పలు యిద్దరును పనిపాటలు ఏమీ చేయకపోగా, రోజుకు వకసారి అయినా స్నానముకూడా చేయకుండా దుర్వ్యాసనలు కొట్టుకుంటూ లేకీగా వుండేవారు.

సిండ్రెల్లా వయసులో చిన్నదిఅవటముచేతను, చెప్పినమాట వినగలిగిన బుద్ధిమంతురాలు అవటముచేతను, యిద్దరు అప్పలు యింటిపనులను పూర్తిగా సిండ్రెల్లాకు అప్పచెప్పారు. నిత్యము యిల్లు అలకటము, కట్టెలు తెచ్చి వంటలు చేయటము, గుడ్డలను తెల్లగా వుతుకుతూవుండటము, తీరిక చిక్కినప్పుడు ఏదైనా పుస్తకాలను చదువుతూ కాలక్షేపము చేయటము సిండ్రెల్లాయొక్క నిత్యకృత్యాలుగా పెట్టుకునేది.

ఒకరోజున ఆఊరి రాజాగారిదగ్గర నుండి నృత్యము చేయటానికి ఆహ్వానాలు వచ్చాయి. సిండ్రెల్లా వంటయింటిదికాబట్టి, దానిని యింట్లోనే వుంచి యిద్దరుఅప్పలు సాయింత్రానికి మంచి గుడ్డలను వేసుకొని రాజాగారి యింటికి నృత్యానికి వెళ్లారు.

పాపం యింట్లో చిరిగిన దుస్తులలో సిండ్రెల్లా ఒకతే కూర్చుని తనను తీసుకు వెళ్లకుండా యిద్దరుఅక్కలు వెళ్లారే అని ఏడుస్తూ కూర్చుంది. పావుగంట తరువాత ఆమెకు నాలుగుగజాల దూరములో పెద్దధ్వని వినిపించి, పెద్దవెలుతురు కనుపిస్తూ; దాంట్లోనుంచి "ఏం సిండ్రెల్లా ఏడుస్తున్నావా నృత్యానికి వెళ్లలేదని భయపడకు. నీవు వెళ్లుదువు." అనేశబ్దము వచ్చింది.

మొదట వినబడిన ధ్వని, వెలుతురు, దాంట్లోనుంచి వచ్చిన శబ్దమును విని నిర్ఘాంతపోయి చూస్తోంది సిండ్రెల్లా. రెండునిముషాలకు తెల్లటి దుస్తులతో ముసలి స్త్రీ వచ్చి, బిడ్డా భయపడకు నీవూ వెళ్లుదువుగాని అని దగ్గరకు తీసుకొన్నది సిండ్రెల్లాను. ఆమెను చూచి అమ్మా అని గట్టిగా కౌగలించుకొని పెద్దగా ఏడుస్తోంది సిండ్రెల్లా.

సిండ్రెల్లాను ఓదార్చి ఒక గుమ్మడికాయను తెప్పించి, నాలుగు ఎలుకలను, నాలుగు చుంచుఎలుకలను పిలవమని చెప్పింది ముసలిమనిషి. సిండ్రెల్లా ఆలాగే తీసుకొనివచ్చి ముసలిమనిషి దగ్గర పెట్టింది. ఆ ముసలిమనిషి కండ్లు మూసుకొని ఏవో మంత్రాలు చదివి చేతిలోని మంత్రదండతో ఆ గుమ్మడికాయమీద, ఆ ఎలుకలమీదా త్రిప్పింది. ఆ గుమ్మడికాయ రత్నాల రథముగాను, ఎలుకలు నాలుగుగుఱ్ఱాలుగాను, చుంచుఎలుకలు నాలుగు, నలుగురు భటులుగాను తయారు అయ్యారు. తరువాత చేతిలో సిండ్రెల్లా ముఖముమీదనుంచి కాళ్లవరకు రాసింది. వెంటనే సిండ్రెల్లా ధగధగా మెరసిపోయే దుస్తులతో నవరత్నాల హారాలతో అప్సరసగాతయారయింది. తను ఈ విధముగా మారటము, గుమ్మడికాయ, ఎలుకలు ఆవిధముగా మారటము చూస్తూ ఆశ్చర్యముతో నేను కలకనటములేదుగదా అని అన్నది అమాయకిముగా సిండ్రెల్లా. ఏమీ అనుమానపడకు. నీవు ధైర్యంగా వుండి నృత్యానికి వెళ్లి సరిగ్గా పదకొండు గంటలకల్లా తిరిగి యిచ్చట వుండాలి. అని చెప్పింది ఆ ముసలిమనిషి.

భటులు నలుగురు రథముతలుపులను తెరచి సిండ్రెల్లాను కూర్చోమని ఆహ్వానించారు. సిండ్రెల్లా సంతోషముతో రథములో కూర్చోగానే తలుపులు వేసి రథమునకు ముందు యిద్దరు, వెనుక యిద్దరు భటులతో సాగింది. "రాజమహల్"లో అందమైన స్త్రీలతో రాజాగారు నృత్యము చేస్తూ ఉత్సాహభరితుడై వున్నాడు. సిండ్రెల్లాఅక్కలు అంత అందగత్తెలు కాకపోవుటచేత, దుస్తులుకూడ బాగా కనుపించకపోవటమువలన రాజాగారు వీరి ముఖమైనా చూడలేదు. నిమ్మ షరబత్‌లు, ఐస్క్రీమ్ బాగా తింటూ, తమను పిలువలేదే అని, పిలుపుకోసరము నిరీక్షించుచున్నారు సిండ్రెల్లా అప్పలు యిద్దరు. మహల్‌ముందు రత్నాలరథము ఆగగానే రాజాగారు రథమువైపు చూస్తూ ఏఅప్సరస వచ్చిందో అని తహతహలాడుచున్నాడు. రథములోనుండి ఓ వింత చూపుతో సిండ్రెల్లా దిగుచుండగా మహల్‌అంతా ధగధగా మెరసిపోయినట్లు గొప్పకాంతి వెలిగింది. ఆ వెలుగుకు ఆశ్చర్యంతో అందరు లేచి బయటనుండి వస్తూవున్న సిండ్రెల్లాను చూచి భలే, అప్సరస అనే నినాదము వెలువడింది అందరినోటినుండి. సిండ్రెల్లాను చూడగానే యిద్దరుఅప్పలకు కండ్లు మండినట్లు అయ్యాయి. రాజాగారు సిండ్రెల్లాహాలులోకి ప్రవేశించగానే ఎదురువెళ్లి స్వాగత మిస్తూ, ఒకచెయ్యితో దోవను చూపుతూ, మరొక చెయ్యి ఆమెబుజముమీద వేసి తిన్నగా ఆయనజరిపే నృత్యస్థలానికి వెళ్లి, మధుపానాలను స్వీకరించి, ఎన్నడు జరుపని నృత్యసంగీతాలతో ఆనందశోభల అనుభవిస్తూ వున్నాడు సిండ్రెల్లాతో రాజాగారు.


సిండ్రెల్లాను రాజాగారు అంతగా ప్రేమించి, నృత్యము చేస్తున్నాడే అని అప్పలు యిరువురు ఒకరినొకరు చూసుకుంటూ, గొణగటము ప్రారంభించారు. సిండ్రెల్లా అంత గుంపులోను వాళ్ల యిద్దరుఅక్కలను గుర్తుపట్టి, చూసిచూడకుండా రాజుగారితో అతి ఆనందం అనుభవిస్తోంది. రాజుగారు సిండ్రెల్లా నెంతో ప్రేమతో చూస్తూ, దేవలోకపు అప్సరస అని మురిసిపోతూవున్నాడు. యింతలోకే గోడగడియారము పదకొండుగంటలు టంగ్, టంగ్‌మని కొట్టింది. ఆ గంటలు వినగానే ముసలీమనిషి చెప్పిన టైము అయిందని రాజుగారి చేతిని వదలిపెట్టి గబగబా బయటకు పరుగెత్తింది. రాజుగారు,అచ్చట వున్నవారు. చాలా ఆశ్చర్యముగా చూస్తూ వున్నారుసిండ్రెల్లా వెళ్లేటప్పుడు కుడికాలుగాజు పాదరక్ష జారిపోయింది. సిండ్రెల్లా బయటకు పోయి తన రథముకోసరం వెతకటము ప్రారంభించింది. రథము మాయమైనది. తన అందమైన దుస్తులు కూడా మాయమై చినిగిన దుస్తులుగా మారాయి. ఇక ఒక్కక్షణమైనా అక్కడ వుండకుండా ఎవరికీ కనబడకుండా ఇంటికి వెళ్లిపోయింది సిండ్రెల్లా.

రాజుగారు అప్సరను వెదకండి అని తోటలు, మహల్‌అంతా వెదికించాడు. కాని అప్సరస కనుపించలేదు. ఒక చిన్న ఫైల్‌మాన్‌కు ఆగాజుపాదరక్ష దొరకగానే దానిని రాజుగారికి అప్పచెప్పాడు. రాజుగారు ఆ పాదరక్షను పరిక్షించి అది అప్సరసదే అని గుర్తుపట్టి, ఈ పాదరక్ష ఎవరిదిఐతే వారిని నేను పెండ్లిచేసుకొని పట్టపురాణీగా వుంచుతాను అని చాటించమని రాజుగారు భటులకు ఆజ్ఞాపించాడు.

ఆ యిద్దరుఅప్పలు ఆపాదరక్ష మాదే. మేము తొడిగి చూపిస్తాము అని కేకలు బెట్టారు. రాజుగారు అనుమానము ఎందుకు తప్పక తొడిగి ప్రయత్నించండి. అని ఆ పాదరక్షను ఆఇద్దరిఅప్పల దగ్గరకు పంపించాడు. పెద్దఆమె ఆ పాదరక్షను తొడగటము ప్రారంభించింది. కాలు పడితే వేళ్లు పడటములేదు. వేళ్లు పడితే కాలుమడమ పట్టటములేదు. అది చూచి రెండవఆమె కాళ్లు బాగా తాడుతో బిగించి తొడగటానికి ప్రయత్నించింది. కానీ పట్టలేదు. తరువాత అచ్చటవున్న స్త్రీలు అంతా తొడిగి ప్రయత్నించారుకాని ఒకరి పాదమైనా దాంట్లోకి పోలేకపోయింది. దాంతో రాజాగారికి ఒక ఆలోచన తట్టింది. ఊళ్లోవున్న స్త్రీలుఅందరూ తొడిగి ప్రయత్నించి తీరాలని, తాను స్వయంగా ప్రతియింటికి వస్తానని మళ్లీ చాటింపచేశాడు

ఊళ్లోని దాదాపు అన్నియిండ్లూ పూర్తిఅయ్యాయి. ఒకరోజు సిండ్రెల్లా గృహానికి వచ్చాడు రాజాగారు. రాజాగారిని చూడగానే సిండ్రెల్లాను బయటకు రానీయకుండా వంటయింట్లోనే వుంచివెయ్యాలని ఆలోచించారు యిద్దరు అప్పలూ. రాజుగారు చూడటానికి వస్తారని పెద్దఅప్ప తన కాలును పాదరక్షకు సరిపోయేట్లుగా కోసుకొని పైన కట్టుకట్టుకొని ఎప్పుడెప్పుడు రాజాగారు వస్తారా అని ఎదురు చూస్తూవుంది. రాజాగారు రాగానే ఆయనచేతిలోని పాదరక్షను పెద్దఅక్క తీసుకొని తొడగటానికి ప్రయత్నిం

(15 పేజీ-చూడుడు)



"అసలు అద్దెకు వదలటమే యీ ఇంటినిగూర్చిన గొప్పవిశేషం."

చింది. కాని ఆకట్టుమూలంగా అసలు పట్టలేదు. దాంతో కోపముగలిగి ఆపాదరక్షను విసురుపుచ్చుకొని పారేసింది. గాజు భాగము బద్దలైపోయింది. రాజుగారికి కోపమూవచ్చింది, నవ్వూవచ్చింది. పట్టకపోవటమువలన పెండ్లి చేసుకోవటము తప్పిందిగదా అని మనసులో అనుకుంటూ, మీకు ఒక చెల్లెలుకూడా వుండాలికదా ఆమె ఎక్కడ అని అడిగారు రాజాగారు. చెల్లెలు ఎవరూ లేరే అని అబద్ధము ఆడుచుండగా, సిండ్రిల్లా చినిగిన దుస్తులతో పాతబుట్టను చేతులో పుచ్చుకొని కట్టెపుల్లలకుఅని వీళ్లముందరగా వెడుతోంది. రాజాగారు సిండ్రిల్లాను చూచి ఆమెకదూ మీచెల్లెలు అని అన్నాడు. ఏమీ చెప్పలేక తలవంచుకున్నారు అప్పలు యిద్దరు. తొందరగా పోతూవున్న సిండ్రిల్లాను పిలిచి, పాదరక్షను చూపించి తొడిగి ప్రయత్నించమన్నారు రాజాగారు. సిండ్రిల్లా కొంత సిగ్గుతోను,కొంత అక్కల భయముతోను వెనుకకుతగ్గింది. రాజాగారు తెలుసుకొని, మీఅక్కలకు భయపడకు. ఈపరీక్ష ప్రతి స్త్రీ చేయవలసినదైయున్నది. కాబట్టి నీవు తొడిగి ప్రయత్నించు అన్నాడు రాజా. ఆ పాదరక్షను చూడగానే ఆనాడు నృత్యమునకు వెళ్లినప్పుడు జారిపోయిన సంగతి జ్ఞాపకమువచ్చి, తనదే అని ధైర్యంగా కాలునుబెట్టింది ఆపాదరక్షలోకి. ఏమీ ఎగుడుదిగుడు లేకుండా సరిపోయినందుకు రాజుగారు సిండ్రిల్లాచేయి పట్టుకొని, ఈరోజునుంచి నీవు నా రాణీవి నిన్ను నేను పెండ్లిచేసు కుంటున్నాను. అని అన్నారు రాజుగారు. సిండ్రిల్లా ఓప్రక్క సంతోషముగాను, మరొకప్రక్క సిగ్గూ భయముతోను తలవంచుకునే సరే అన్నట్లు తల వూపింది. రాజుగారు సంతోషపడి సిండ్రిల్లాను దగ్గరకుతీసుకొని ముద్దుపెట్టుకొని వెంటనే దుస్తులను మార్పించి అందమైనదుస్తులతో రాజాగారి రథములో రాజుగారిప్రక్కనే కూర్చుండి రాజమహల్‌కు వెళ్లిపోయింది సిండ్రిల్లా.

రాజుగారు తన వివాహమహోత్సవము జయప్రదముగా సాగటానికిగాను ఊళ్లోవున్నవారికి అందరికి ఆహ్వానాలు పంపి, అందరిముందర అతివైభవముగా పెండ్లిని చేసుకున్నారు.

తమకు ఆలాంటి వైభవము రాకుండా మురికివంటకత్తెకు వచ్చిందే అని నిరుత్సాహపడ్డారు అప్పలు యిద్దరు.

అందరూ వెళ్లిపోయినతరువాత సిండ్రిల్లా ఒక్కతే కూర్చునివున్నప్పుడు తిరిగి ధ్వని, వెలుతురు గల్గి, దాంట్లోనుంచి ఆ ముసలిమనిషి వచ్చి "ఏం సిండ్రిల్లా ఇప్పుడేలా వున్నావు"? అని నవ్వింది ఆ ముసలిమనిషి. అంతా నీదయ మాతృదేవీ అని ఆ ముసలి మనిషిని కౌగలించుకొని అన్నది సిండ్రిల్లా. ఇక ఏమీ భయము లేదు. స్వేచ్ఛగా రాజుగారితో జీవితాన్ని గడుపుకో. నీకు ఏలాంటి కష్టాలు రాకుండా నేను చూస్తూవుంటాను. అని ఆశీర్వదించి మాయమైపోయింది ఆ ముసలిమనిషి.

సిండ్రిల్లా ముసలిమనిషి చెప్పినట్లు రాజుగారితో ఎంతో ఆనందవైభోగాలతో జీవితాన్ని గడుపుతూంది. రాజుగారుకూడా సిండ్రిల్లాను మంచి గాఢమైన ప్రేమవిశ్వాసాలతో ఏలాంటి కష్టాలు రాకుండా హాయిగా జీవిస్తున్నారు!

(ఆంగ్లము నుండి)

ఎవరిప్రాణం వారికి తీపి

శ్రీ డి. వీరభద్రరావు

ఒక ఊరిలో సూరయ్య అను ఒకడు ఉండేవాడు. అతనికి తల్లి, తండ్రి, నాయనమ్మ, భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. నాయనమ్మకు తొంభైయేండ్లవయస్సు ఉంటుంది. కుమార్తెలు చిన్నవాళ్లు. ఒకామెకు ఎనిమిది యేండ్లు, రెండవ ఆమెకు ఐదు ఏళ్ళు ఉంటాయి.

ఒకనాడు అకస్మాత్తుగా సూరయ్య చనిపోయాడు. అతని భార్య, తల్లి, తండ్రి అంతా సూరయ్యశవముచుట్టా చేరి పెద్దగా ఏడుస్తున్నారు. ఇరుగుపొరుగువారు ఈ రోదనధ్వని గ్రహించి సంగతి తెలిసికొని ఈ ఏడ్చేవారిని ఓదార్చడానికని వచ్చారు. ఓదార్చడానికి వచ్చినవారు "చనిపోయినవారు తిరిగివస్తారా! ఎందుకు ఏడుస్తారు? జరగవలసిన కార్యాలు జరపండి" అని ఎంత మందలించినా వారు ఊరుకోలేదు సరిగదా "సూరయ్య లేని బ్రతుకు వ్యర్థం. మేంగూడా సూరయ్యతోటే మరణిస్తాం" అని ఇంకా పెద్దగా ఏడ్వడం మొదలెట్టారు. వీళ్ళు లా ఇప్పుడు ఏడుస్తూ ఉండగా యమధర్మరాజు సతీసమేతంగా సూరయ్యప్రాణాన్ని తీసికొనిపోవడానికి వచ్చాడు. వీరందరి రోదనము యమధర్మరాజుభార్య వినేసరికి హృదయం కరిగిపోయింది. ఆమె తన భర్తతో "వీరందరూ ఒక్కప్రాణాన్నిగురించి ఇంతగా విలపిస్తున్నారుగదా! ఈ ఒక్కణ్ణి బ్రతికించకూడదూ" అన్నది జాలిగా. ఆమాటలకు యమధర్మరాజు చిరునవ్వునవ్వి "పిచ్చిదానా! వీరు పైకి ఇలా విలపిస్తున్నారేగాని ఒక్కరూ తమ ప్రాణంకంటే అధికంగా చూడటం లేదు. ప్రతిజీవరాసికి తమ ప్రాణంకంటే అధికమైనది లేదు. దీనికి తార్కాణం నీ విప్పుడే నీకళ్ళారా చూద్దువుగాని" అని యమధర్మరాజు, అతని భార్య వైద్యులవలె మారిపోయి సూరయ్యశవమువద్దకు వచ్చి నాడి పరీక్షించేవారివలె నటించి "బ్రతికే అవకాశాలుఉన్నవిగాని మందులకు,మాకులకు బ్రతకడు" అన్నారు. ఆమాటలకు వారంతా "చెప్పండి ఏం కావాలో? మావాడు బ్రతికితే చాలు" అన్నారు. "చెప్పినా ఏం లాభంలేదు. మీరెవ్వరూ ఆ పనికి సాహసింపరు" అని వెళ్లిపోబోయారు ఆ కపటవైద్యులు.

ఆ వెళ్ళేవాళ్ళని సూరయ్యతండ్రి బ్రతిమాలి తిరిగి తీసికొని వచ్చి "మమ్మల్ని ఏం చేయమంటే అది చేస్తాం. మీరు ఎలాగైనా మా సూరయ్యను బ్రతికించాలి" అన్నాడు.

ఆ మాటలకు వైద్యులు "మీ కుమారుడు బ్రతకాలంటే మీ కుమారుడి ప్రాణానికి వేరొక ప్రాణం ఇస్తే బ్రతుకుతాడు. లేకపోతే బ్రతకడం కల్ల" అని కచ్చితంగా చెప్పారు. ఆ మాటలకు అందరూ ఆశ్చర్యపడడమేగాకుండా ఎవరి ప్రాణం ఇద్దామా అన్న సందేహం వచ్చింది.

ఇరుగుపొరుగువారంతా భర్తకు ఆపద వచ్చినపుడు భార్య, భార్యకు ఆపద వస్తే భర్త సహాయపడాలి. కాబట్టి భార్యప్రాణం ఇవ్వడం న్యాయ" మన్నారు.

వైద్యులు సూరయ్యభార్య నడిగారు. ప్రాణ మివ్వడానికి ఇష్టమేనా అని. సూరయ్యభార్య "నాకు నా భర్తంటే ఎంతో ప్రేమ. కాని కడుపున పుట్టిన వాళ్లు ఆడపిల్లలు. వాళ్ళకైనా ఇంకా వివాహాలు కాలేదు. వాళ్ళకు మంచి చెడ్డ చూడాలన్నా ఆయనకు ఏం తెలుస్తుంది. నాకు బద్ధకంగా ఉన్నపుడు ఏ పొరుగమ్మనైనా వాళ్ళకు తలదువ్వమంటే విసుగుకుంటూరు, తిడతారు కూడాను. నేనుంటేనే ఇంత ఈర్ష్యగా నా పిల్లల్ని చూస్తున్నారు. ఇక నేను లేకపోతే నా పిల్లల గతి ఏం కాను?" అని ఏడ్వడంమొదలెట్టింది ఆ మహాపతివ్రత.

వైద్యులు సూరయ్యను నవమాసాలు మోసి, కని పెంచి, పెద్దవాణ్ణిగా చేసిన సూరయ్యతల్లివద్దకు వెళ్లి సూరయ్యను బ్రతికించుకొనమని అడిగారు. దానికి సూరయ్యతల్లి "నాకు ఒక్కడే కుమారుడు. అతడంటే నాకు తగని ఇష్టం. కాని మా వారు వేళగాని వేళ ఇంటికి వస్తూ ఉంటారు. వారికి గుప్పెడు మెతుకులు పెట్టాలన్నా ఏదైనా ఆలోచన చెప్పాలన్నా నేను ఉండాలి. ఇంకా చుట్టాలు, పక్కాలు వస్తూఉంటారు. వారికి తగు మర్యాదలు చేయాలంటే కోడలిపిల్లకు ఏం తెలుస్తుంది? నేను ఇంటిపెత్తనం వహించి ఇల్లు సరిదిద్దకపోతే ఈ సంసారంగతి ఏమవుతుంది" అని దీర్ఘాలుతీస్తూ చెప్పింది.

వైద్యులు తండ్రి నడిగారు "ఏమయ్యా! మమ్మల్ని పోయేవాళ్లని పోనీయక ఎంతో బ్రతిమాలి తీసికొని వచ్చావు. మరి నీ ప్రాణం ఇచ్చియైనా పుత్రుణ్ణి బ్రతికించుకో" అని.

"నే నేదో కష్టపడి నాలుగు డబ్బులు తెస్తే ఈ సంసారం జరుగుతుంది. నేను లేకపోతే వీళ్లకు గంజైనా దొరకదు. ఐనా! ఆ వెంకయ్యకొడుకు నాకు వెయి రూపాయలు ఇవ్వాలి. నేను గనుక చనిపోతే ఆ డబ్బు నిష్కారణంగా గంగపాలవుతుంది. కొడుకు బ్రతికినామాత్రం ఏం చెయ్యగలడు" అని తేల్చాడు చివరకు.

ఇక మిగిలింది ముసలమ్మ. వైద్యులు తొంభైయేళ్ళు వచ్చి, మూడవకాలు సహాయానగూడా నడువలేక, ఒక మూల కుక్కిమంచంపై పడుకొని మూల్గుతున్న ఆవిడవద్దకు వెళ్లి "ఓ ముసలమ్మా! ఎందు కిలా బాధపడతావు. మలమూత్రవిసర్జనగూడా మంచంపైనే జరుగుతున్నది. నీకు తొంభైయేళ్లు దాటాయి. రేపో మాపో చావడానికి సిద్ధంగా ఉన్నావు. నలభైయేండ్లుగూడా రాని నీ మనుమడు చనిపోయాడు. నీ గుక్కెడుప్రాణం ఇస్తే రాయిలాంటి నీ మనుమడు బ్రతుకుతాడుగదా! నీవు బ్రతికియుండి మాత్రం ఏం ప్రయోజనం?" అని అడిగారు.

ఆమాటలకు ముసలమ్మ "నేనూ ఈ బాధ పడలేకపోతున్నాను. ఆఇద్దరి మనుమరాండ్ర పెళ్లి చూచిపోదామని ఇంతవరకు వేచిఉన్నాను. ఏదో ఇంటికి నాబోటిది లేకపోతే ఇప్పటివాళ్ళకు ఆచారవ్యవహారాలు ఏం తెలుస్తాయ్?" అని ముక్కుతూ, మూలుగుతూ, దగ్గుతూ చెప్పింది.

ఆ మాటలకు యమధర్మరాజు, భార్య లోలోన నవ్వుకుని సూరయ్య ప్రాణాన్ని తీసికొని వారిదారిని వారు వెళ్లారు.

సూరయ్యతండ్రి ఇరుగుపొరుగువారు సూరయ్యశవాన్ని దహనంచేసి తిరిగి ఇంటికి వచ్చారు.

ఎనైరిన్ బెవాన్

(7 వ-పేజీ తరువాయి)

అంగీకరించాడు. మంత్రివర్గంలో అతని మాట సాగవలసిందే. లేకపోతే మంత్రివర్గసమావేశాల్లో పెద్దపులివలె పోరాడతాడు.

బెవాన్ అనేకపర్యాయాలు కార్మికనాయకత్వాన్నెదిరించాడు. యుద్ధకాలంలో అతన్ని పార్టీనుంచి వెళ్లగొట్టాలనికూడా ఒకసారి యత్నించారు. ఉక్కుపరిశ్రమల్ని ప్రభుత్వపరం చెయ్యడానికి మంత్రివర్గంలో చర్చ జరిగినప్పుడు ఈ శాసనాన్ని వాయిదావెయ్యరాదని ఉపప్రధాని మారిసన్‌తో పోరాడి తన మాట నెగ్గించుకున్నాడు. అతని పట్టుదలవల్లనే ఆ శాసనం పార్లమెంటులో ప్రవేశపెట్టబడింది.

ఉచితవైద్యకార్యక్రమం:

బెవాన్‌కు అత్యంతప్రీతికరమైనది అతని ప్రస్తుతకార్యక్రమమైన వైద్యసహాయం. సర్వజనులకూ ఉచితంగా వైద్యం లభింపచెయ్యాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని బెవాన్ అమలు జరిపాడు. 1911 లో లాయిడ్ జార్జి జాతీయ భీమానిర్బంధశాసనాన్ని పార్లమెంటుచేత అనుమతింపచేశాడు. ఈ శాసనంవల్ల బాధపడే కార్మికులకు నిరుద్యోగులకు ఉచితవైద్యం, ధనసహాయం లభించాయి. ఈ కార్యక్రమం 1941 సంవత్సరానికి బ్రిటన్‌లో దాదాపు సగం జనాభాకు అమలుజరిగింది. దాదాపు బ్రిటిష్ డాక్టర్లందరూ రోగులకు ఉచితంగానే చికిత్స చేసేవారు. పారిశ్రామికవాణిజ్యయజమానులూ కార్మికులూ చెల్లించే చందాలు, పన్నులుచేరి డాక్టర్ల బిల్లులు చెల్లించేవి.

బెవాన్ కార్యక్రమంప్రకారం ప్రజల్లో ప్రతిఒక్కరూ ప్రజారోగ్యభీమాకు చందా చెల్లించవలసిందే. ఎవరికి వైద్యసహాయం కావలసినా ఏ డాక్టరుకద్దకైనా వెళ్లవచ్చును. ఉచితంగా వైద్యం లభిస్తుంది. రోగులకు అవసరమైనన్ని రోజులు ఉచితంగా వైద్యులు చికిత్స చెయ్యవలసిందే. తలనెప్పిమాత్రలమొదలు పెనిసిలిన్ ఇంజక్షన్లవరకూ ఏ మందు కావలసినా డాక్టరు చీటీ రాసి ఇస్తాడు. రోగి చీటీ తీసికెళ్లి మందుల షాపులో చూపితే షాపుయజమాని మందు ఒప్పగించి చీటీని ప్రభుత్వానికి పంపుతాడు. ప్రభుత్వం ఆ మందుల ఖరీదు చెల్లిస్తుంది. కళ్లజోడు, కర్రకాలు మొదలైనవి ఏవి కావలసినాసరే డాక్టరుచీటీతో ఉచితంగా లభిస్తాయి. ఒక్కొక్క జబ్బుకి ప్రత్యేకనిపుణుడైన డాక్టరుచికిత్స అవసరమని తోచినప్పుడు డాక్టరు ఆ నిపుణుల జాబితా ఒకటి రోగికిస్తాడు. ఆ నిపుణుల్లో ఎవరిదగ్గరైనాసరే ఉచితంగా చికిత్స జరుగుతుంది, నిత్యరోగంవల్ల గృహకార్యాలు నిర్వర్తించుకోలేనివారికికూడా సహాయం ఏర్పాటుచేస్తారు. ఒక వైద్యుడు నచ్చకపోతే ఏ బెడదా లేకుండా మరొక వైద్యుడివద్ద చేరవచ్చును. ఉచితవైద్యం పరువు తక్కువైనవారికి డబ్బు తీసుకుని వైద్యం చెయ్యడానికికూడా వీలుంది.

ఈ సౌకర్యం ప్రభుత్వం ఏర్పాటుచేసినందుకు బ్రిటిష్‌ప్రజలు జాతీయసభలో కార్యక్రమంనిమిత్తం ప్రత్యేకంగా ఏమీ ఖర్చుపెట్టనవసరంలేదు. ప్రతివారం వారి వేతనాల్లోనుంచి ప్రభుత్వం నిర్బంధభీమా, వృద్ధకాలవిశ్రాంతిభీమా, నిరుద్యోగభీమా, మొదలైన వాటినిమిత్తం కొద్ది కొద్ది మొత్తాల చొ॥ మినహాయించుకున్నట్టే ఆఖర్చుకికూడా కొద్దిమొత్తం మినహాయిస్తారు. 18 ఏళ్లు పైబడి వృత్తిలో ఉన్నవారు వారానికి 4 షిల్లింగుల 11 పెన్నీలు, అర్జనాశక్తిగల స్త్రీలు వారానికి 3 షిల్లింగుల 10 పెన్నీలు తమ వేతనాలనుండి వొదులుకోవాలి, అయితే ఈరీతిగా తీసుకున్న మొత్తం అసలుఖర్చుకు చాలదు. ప్రభుత్వం మొత్తం అన్ని రకాలపన్నులూ కలిపి ప్రజల ఆర్జనలో మూడోవంతు రాబట్టుతోంది. ప్రభుత్వాదాయంలో నాలుగోవంతు సాంఘికసేవా కార్యక్రమాలనిమిత్తం ఖర్చవుతుంది. ఈవైద్యసౌకర్యంకూడా ఇందులోనే చేరుతుంది. ప్రత్యేకంగా ఈ వైద్యకార్యక్రమానికి బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని అంచనా వెయ్యబడింది. క్రమంగా ఈ ఖర్చు హెచ్చు కావచ్చునని కొందరు అభిప్రాయపడుతున్నారు.

ఈ కార్యక్రమం నిర్వహించడానికి బెవాన్ 138 కార్యవర్గాలను నియమించాడు. ఒక్కొక్క వర్గంలో 25 మంది వలంటీర్లున్నారు. ఈ సంఘాలలో సర్వపక్షాలవారినీ చేర్చుకున్నాడు. బ్రిటన్‌లోని ఆస్పత్రులన్నీ కార్యక్రమం అమలుజరిగినక్షణంనుంచీ ప్రభుత్వాధీనమైనాయి. ఈ ఆస్పత్రుల నిర్వహణకు హాస్పిటల్ బోర్డులను నియమించారు. ఇదివరకు ఆస్పత్రులను నిర్వహిస్తున్నవారే ఈ బోర్డులలో నియమితులైనారు. ఈ కార్యక్రమంలో ఇప్పటికి దాదాపు పదివేలమంది వాలంటీర్లు నియమితులైనారు. కాని బెవాన్ నిర్వహణలో ఉన్న ప్రభుత్వశాఖలో వేతనాలు తీసుకుంటున్న ఉద్యోగులు మొత్తం 800 మందే ఉన్నారు.

డాక్టర్ల జాబితాల్లో ఉన్న రోగుల జాబితాను కార్యవర్గాలు పరిశీలిస్తాయి. పరిశీలించి పని అధికంగా ఉన్న డాక్టర్ల జాబితాలోనుంచి



గా. హా. సీతారామరెడ్డి కొక్కిరాల లంకలో లంకగ్రామస్థుల దుస్థితిని వినుచుండుట.

కొందరు రోగుల్ని మరొకడాక్టరుజాబితాలో చేరుస్తారు. అవసరమైనప్పుడు కొందరు డాక్టర్లను ఇష్టంలేకపోయినా కొన్నిప్రాంతాల్లో ఉండాలని నిర్బంధించే అధికారం ఈ కార్యవర్గాలకుంటుంది. ఒక ప్రాంతంలో అనవసరంగా డాక్టర్ల సంఖ్య అధికంగా ఉంటే కొత్తవారి నక్కడ చేరకుండా ఆజ్ఞ చెయ్యవచ్చును.

మొట్టమొదట బ్రిటన్‌లోని డాక్టర్లలో చాలమంది ఈ కార్యక్రమాన్ని ప్రతిఘటించినప్పటికీ తరవాత నూటికి 86 మంది చేరారు. ఇతరత్రా సంపాదనకు అవకాశం తగ్గిపోతున్నందువల్ల కొంతమంది అనిష్టంగానే చేరారు. ఇప్పుడు కాకపోతే ఎప్పటికైనా డాక్టర్లందరూ ప్రభుత్వకార్యక్రమంలో చేరక తప్పదని చాలమందిఅభిప్రాయం. డాక్టర్లకు తమ జాబితాలోని రోగులకు ప్రతిఒక్కరిపరంగానూ సాలుకి 17 షిల్లింగులు చొ॥ ప్రభుత్వం చెల్లిస్తుంది. ఆ రోగుల పేర్లు జాబితాలో ఉంటే చాలు, చికిత్స చెయ్యకపోయినా డాక్టర్లకి డబ్బు చెల్లించవలసిందే. ఏ డాక్టరూ 4 వేల మందికి మించి తమ జాబితాలో చేర్చుకోకూడదు. బ్రిటన్‌లో కొన్ని ప్రాంతాల్లో డాక్టర్ల సంఖ్య అధికంగా ఉంది. అంటే దాదాపు ప్రతి వెయ్యిమందిప్రజలకూ ఒకొక్క డాక్టరు చొ॥ ఉన్నారు. అటువంటిచోట్ల డాక్టర్ల ఫీజులు హెచ్చించరు. ధనం అధికంగా కావలిస్తే, వారు డాక్టర్లు కొరతగా ఉన్న ప్రాంతాలకు వెళ్లవచ్చునని బెవాన్ అంటాడు.

వాస్తవానికి ఈకార్యక్రమంవల్ల డాక్టర్ల ఆర్జన తగ్గలేదు. అనేకమందికి అధికమయింది కూడా. చాలచోట్ల డాక్టర్లకి ఊపిరితిరగని పనికలుగుతోంది. ఉచితంగా ఔషధాలుకూడా లభిస్తున్నందువల్ల అనేకమంది చికిత్స తీసుకుంటున్నారు. పూర్వంకంటె ఇప్పుడు ఔషధసేవ అధికమయింది.

ఈకార్యక్రమంవల్ల డాక్టర్లకి ఒకవిధంగా కొన్ని బెడదలు తీరిపోయాయి. ధనం అధికంగా ఉండి నిత్యం ఔషధసేవకు అలవాటుపడినవారు ఏ జబ్బు లేకపోయినా ఏదో జబ్బు పీడిస్తోందంటూ భ్రమలకు లోనై వచ్చి డాక్టర్లని చిక్కులుపెట్టే బాధ తప్పింది. డాక్టర్లకి ఆర్జన పడిపోతుందనే భయం పోయింది.

రోగులకుకూడా ఒకవిధంగా బాధ తప్పింది. ఏబాధతో వెళ్లినా శ్రద్ధగా సావధానంగా రోగపరీక్ష చెయ్యడానికిబదులు, అడిగిన ప్రశ్నలకి ఏమీ తెలియని రోగుల సమాధానాల్నే ఖరారుచేసుకుని ఏదో పెద్ద పేరు చెప్పి పెనిసిలిన్ ఇంజక్షనో మరో ఇంజక్షనో తీసుకోవాలని చెప్పే పద్ధతి పోయింది.


సర్వజనసంరక్షణాశయంగల ప్రభుత్వవిధానంవల్ల బ్రిటన్‌లో ప్రజాస్వామ్యం అంతరించి కమ్యూనిజానికి ప్రవేశం ఏర్పడుతుందని కొందరి సంశయం. అలాకాక సర్వజనులకీ రక్షణ, జీవనోపాధి లభించడంవల్ల అసంతృప్తి తొలగిపోయి కమ్యూనిజం ప్రవేశించడానికి తావుండదని బెవాన్ అభిప్రాయం.

ఉచితవైద్యసౌకర్యకార్యక్రమం అమలు జరుగుతున్న పద్ధతి చూసి బెవాన్ సంతృప్తి ప్రకటించాడు. అయితే ఇది ప్రారంభదశ మాత్రమే నంటాడు. ఇంతవరకూ చేసినదాన్ని నిలబెట్టుకోడానికి ముందుగా కృషిచేసి ఆపైన తరవాతికార్యక్రమాని కుపక్రమించాలని మారిసన్ అభిప్రాయం. అలా కాదంటాడు బెవాన్. పార్టీపద్ధతి అంతా సైకిల్‌పైన పోతున్నట్టుంది అంటాడు. సైకిలు తొక్కడం ఆపితే పడిపోక తప్పదు.

బ్రిటన్‌లో పెట్టుబడిదారీవిధానాన్ని మొదలంట పెరికివెయ్యాలంటాడు బెవాన్. అతని అంచనాప్రకారం దీనికి పాతిక సంవత్సరాలు పట్టుతుంది.

కార్మికపక్షంవారి అవివేకపు కార్యక్రమాలవల్లనే బ్రిటన్ అమెరికన్ల దానంపైన ఆధారపడి బ్రదకవలసివస్తున్నదని చర్చిల్ అన్నాడు. "కావలసిన అన్నవస్త్రాలను ఆర్జించుకోవాలంటే ఎవరికివారే కృషిచెయ్యాలి. స్వేచ్ఛాస్వాతంత్ర్యసూత్రాలకు లోబడినప్పుడే సమాజవ్యవస్థలో వ్యక్తిగత కృషి, ఫలమూ వృద్ధిచెందుతాయి" అన్నాడు చర్చిల్.

ఈ "పెట్టుబడిదారీ" వాదాన్ని ఖండిస్తూ బెవాన్ ఇలా అన్నాడు: "వ్యాపారపరిశ్రమదుల్లో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు అంటే ఇంతకాలంగా యజమానులు కార్మికుల యోగక్షేమాలను గమనించనక్కరలేదని అర్థంచెప్తూ వచ్చారు.



కొల్లేటిలంక గ్రామాలు పర్యటించుచున్న రెవిన్యూమంత్రి శ్రీ హా. శీతారామరెడ్డిగారు, శ్రీ మాగంటి బాపినీడు ఎం. ఎల్. ఎ. శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు, ఎం. ఎల్. ఏ. శ్రీమతి చో. అమ్మన్నరాజా, ఎం. ఎల్. ఏ. శ్రీ జి. ఏ. నరసింగరావునాయుడు విజయవాడ సూపరింటెండింగు ఇంజనీరు.

బాలానందం నాటిక :

బూచివాడు

శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు

మొదటి దృశ్యం

(రాత్రి తొమ్మిదిగంటల సమయం. బాబుకి నిద్రరాక తల్లిని, చిత్రవిచిత్రమైన ప్రశ్నలు వేస్తూ ఉంటాడు. తల్లి ఆ ప్రశ్నలకి తోచిన సమాధానాలు చెబుతూ ఉంటుంది.)

బాబు : రాత్రి ఎల్లా అవుతుంది అమ్మా?

తల్లి : సూర్యుడు వెళ్ళిపోవడంతోనే చీకటి పడుతుంది. దానినే మనం రాత్రి అంటాము.

బాబు : సూర్యుడు ఎందుకు వెళ్ళిపోతాడు?

తల్లి : ఉదయంనించీ సాయంత్రంవరకు ఆకాశంలో తిరిగి తిరిగి అతనికి విసుకేస్తుంది. అలసిపోలసి ఇంటికి వెళ్లి నిద్రపోతాడు.

బాబు : ఇప్పుడు ఎన్నిగంటలు అయింది?

తల్లి : తొమ్మిది అయిఉంటుంది.

బాబు : ఇంత రాత్రి అయినా నాన్న ఎందుకు ఇంటికి రాలేదు?

తల్లి: ఏమో, ఏదైనా పని ఉండిఉంటుంది. అందుకోసమే రాలేదనుకుంటాను.

బాబు: సూర్యుడు ఉదయంనించీ సాయంత్రంవరకూ తిరిగి అలసిపోతాడని చెప్పావు. నాన్నకూడా ఉదయమే ఇంటినించి వెడుతాడు. ఇంతరాత్రి అయినా ఇంటికి రాడు. సూర్యుడికిమల్లే నాన్న అలసిపోడా?

తల్లి: బాబూ, నీవు ఏవో పిచ్చి పిచ్చి ప్రశ్నలన్నీ అడిగి నన్ను వేధించుకుతింటావు. నీకు సమాధానాలు చెప్పడానికి రోజుకు మూడు వేళ్ల అన్నమైనా తినాలి—ఇప్పటికే చాలా రాత్రి అయింది. ఇక పడుకో.

బాబు: నాకు నిద్దర రావడంలేదు— నేను పడుకోను.

తల్లి: బూచివాడు వస్తాడు—పడుకో బాబు—

బాబు: ఎల్లాఉంటాడమ్మా, బూచివాడు.

తల్లి: నల్లగా, భయంకరంగా ఉంటాడు. పైనగొంగడి వేసుకొని పొడుగాటి కఱ్ఱతో రాత్రిళ్లు వస్తాడు. అల్లరిచేసే పిల్లలనీ, త్వరగా పడుకోని పిల్లలనీ ఎత్తుకుపోతాడు.

బాబు: ఈ రోజు నేను నిద్రపోలేను. బూచివాడు నన్ను ఎత్తుకుపోవడానికి వస్తాడా?

తల్లి: వస్తాడనే, పడుకోమని నీకు పదేపదే చెబుతున్నది.

బాబు: ఇంకా ఎల్లాఉంటాడమ్మా బూచివాడు?

తల్లి : చింతనిప్పులకు మల్లే కళ్లు ఉంటాయి. కారుచీకట్లో చుక్కలకుమల్లే నల్లటి మొహంలో తెల్లటికళ్లు మెరుస్తాయి.

బాబు: బూచివాడు, సూర్యుడూ, నాన్నకు మల్లే ఉదయంనించి సాయంత్రంవరకు పని చేయడూ?

తల్లి: లేదు, సాయంత్రం నించీ ఉదయం వరకు పని చేస్తాడు.

బాబు: ఏమి పని చేస్తాడమ్మా?

తల్లి: కొంటెపిల్లలనీ, అల్లరిపిల్లలనీ ఎత్తుకుపోతాడు.

బాబు: ఎక్కడికి ఎత్తుకుపోతాడు?

తల్లి: నల్లటి చీకటిలోకిఎత్తుకుపోతాడు.

బాబు: చీకటిలోకి ఎత్తుకుపోతే భయమెందుకమ్మా? నేనైతే హాయిగా వెళ్లిపోతాను.

తల్లి: పిల్లలు, బూచివాడంటే భయపడాలి-అల్లా మాట్లాడుతారా?

బాబు: బూచివాడు నాన్నని ఎత్తుకుపోయి ఉంటాడు. అందుకోసమే నాన్న ఈ రోజు ఇంటికి రాలేదు.

తల్లి : వాడు పెద్దవాళ్లని ఏమీ అనడు— చిన్నపిల్లలను మాత్రమే ఎత్తుకుపోతాడు.

బాబు: అయితే, ఈ రోజు రాత్రికి వస్తాడా?

తల్లి: నీవు నిద్దరపోకపోతే తప్పకుండా వస్తాడు.

బాబు: నేను నిద్దరపోను—వస్తే ఎల్లా ఉంటాడో చూస్తాను.

తల్లి: అదుగో! గానేవచ్చాడు. కళ్లు మూసుకో బాబూ! ఏయ్ బూచోడా! మా పిల్లవాడు నిద్దరపోయినాడు— వెళ్లిపో—

బాబు: నేను నిద్దర పోలేదు— బూచోడా నన్ను ఎత్తుకెళ్లు—

తల్లి : బూచివాడు రాలేదుకామాలు— అందుకోసమే నిన్ను ఎత్తుకెళ్ళ లేదు—పక్కింటి సుధ అల్లరి చేస్తూఉండింది—బహుశా ఆ అమ్మాయిని ఎత్తుకుపోయి ఉంటాడు.

బాబు: అప్పుడు నేను అల్లరి చేస్తే నన్ను ఎత్తుకు పోడా?

తల్లి: ఈ రోజుకి ఇక మనవీధికి రాడు— రేపు నీవు అల్లరి చేస్తే నిన్నుకూడా ఎత్తుకు పోతాడు.

బాబు: అయితే రేపు తప్పకుండా అల్లరి చేస్తాను—

తల్లి: ఇప్పటికి పడుకో— రేపటి సంగతి రేపు ఆలోచిద్దాం—

బాబు: నేను పడుకున్న తరువాత బూచివాడు వస్తే నన్ను లేపుతావుకదూ?

తల్లి: సరేలేపులాను - ఇకపడుకో

బాబు: పాటపాడితే పడుకుంటాను.

తల్లి: మొదట కళ్లుమూసుకో—తరువాత పాడుతాను.

(బాబు కళ్లు మూసుకుంటాడు— తల్లి చక్కని జోలపాట పాడి అతన్ని పడుకో బెడుతుంది.

రెండవ దృశ్యం

(మరునాడు ఉదయం ఎనిమిది గంటలు. తండ్రి కాఫీ తాగుతుంటాడు. బాబు అప్పుడే నిద్దర లేచి, కళ్లు నలుముకుంటూ వచ్చి తండ్రిని ప్రశ్నపరంపరలతో ముంచివేస్తాడు)

బాబు: బూచివాడు ఎల్లా ఉంటాడు నాన్నా?

తండ్రి: ఇప్పుడు వాడిసంగతి ఎందుకు వచ్చింది?

బాబు : అది కాదునాన్నా! నాకు బూచివాడు ఎల్లా ఉంటాడో తెలుసుకోవాలని ఉంది.

తండ్రి : బూచివాడు నల్లగా చీకటికిమల్లే ఉంటాడు.

బాబు : కఱ్ఱతీసుకొనివస్తాడా?

తండ్రి : లేదు, కఱ్ఱఉండదు—

బాబు : గొంగడి కప్పుకునివస్తాడా?

తండ్రి : లేదు, గొంగడికూడా ఉండదు - అసలు వొంటిపైన ఏమీ ఉండదు.

బాబు : పళ్లుఎల్లా ఉంటాయి?

తండ్రి : పళ్లు మామూలుగానే ఉంటాయి. కాని మీసాలు గుబురుగా భయంకరంగా ఉంటాయి.

బాబు : ఇంకా ఎల్లా ఉంటాడు నాన్నా బూచివాడు?

తండ్రి : జుట్టువిరియబోసుకొని ఉంటాడు. మోకాళ్ల వరకు పంచె కట్టుకుంటాడు.

బాబు : వా డేమిచేస్తాడు నాన్నా?

తండ్రి : అల్లరిపిల్లలను ఎత్తుకుపోతాడు.

బాబు : ఎప్పుడు వస్తాడు నాన్నా?

తండ్రి : ఇప్పుడు నీవు అల్లరిచేస్తే, ఇప్పుడే వస్తాడు—

బాబు : రాత్రిళ్లు వస్తాడని అమ్మ చెప్పింది.

తండ్రి : బూచివాడికి రాత్రీ, పగలూ అనే భేదంలేదు. పిల్లలు ఎప్పుడు అల్లరి చేస్తే అప్పుడే వస్తాడు.

బాబు : బూచివాడు నాకు కనపడుతాడా?

తండ్రి : లేదు కనపడకుండా వచ్చి పిల్లలను ఎత్తుకుపోతాడు!

బాబు : గొప్ప చిక్కేవచ్చింది— కనపడకండా వస్తే ఏమి లాభం—

తండ్రి : చిక్కెందుకు బాబు?

బాబు : మొనగాడైతే కనపడి ఎత్తుకు పోవాలి—చాటుగా ఎత్తుకుపోవడం ఏమంత గొప్పదనం?

(పిల్లవాడి మాటలకి తండ్రి చిరునవ్వు నవ్వుతాడు. బాబు ఆసంగతి గమనించకండా అక్కడినించి వెళ్లి పోతాడు.)

మూడవ దృశ్యం

(అదేరోజు మధ్యాహ్నం—అన్నయ్య చదువుకుంటూ ఉంటాడు. బాబు అల్లరి చేయకండా గదిలోకి వచ్చి తదేకదీక్షగా అన్నయ్య వేపు చూస్తాడు)

అన్నయ్య : ఎందుకు వచ్చావు బాబు?

బాబు : "..........."

అన్నయ్య : నేను చదువుకుంటూవుంటే అల్లరిచేయడానికి వచ్చావా?

బాబు : లేదు—

అన్నయ్య : మరి ఎందుకు వచ్చావు?

బాబు : "..........."

అన్నయ్య : ఫరవాలేదు చెప్పు!

బాబు : బూచివాడు ఎల్లా ఉంటాడు అన్నయ్యా!

అన్నయ్య : ఇందుకోసమే వచ్చావా నీవు?

బాబు : అవును — బూచివాడు ఎల్లా ఉంటాడో కనుక్కుందామని వచ్చాను. చెప్పవు అన్నయ్యా?

అన్నయ్య : చెబితే అల్లరి చేయకండా ఇక్కడినుంచి వెళ్లిపోతావా?

బాబు : ఆఁ

అన్నయ్య : ఎల్లా ఉంటాడేమిటి? నల్లగా ఉంటాడు—చూస్తేనే భయంవేస్తుంది.

బాబు : నీవు వాడినిచూచావా అన్నయ్యా?

అన్నయ్య : చూచాను-చాలా భయమేసింది. గట్టిగా కళ్లుమూసుకున్నాను.

బాబు : నిన్ను ఎత్తుకుపోలేదా అన్నయ్యా వాడు?

అన్నయ్య : లేదు-కళ్లుగట్టిగా మూసుకుంటే, దయదలచి వదిలివెళ్లాడు.

బాబు : బూచివాడు ఎల్లా ఉన్నాడు?

అన్నయ్య : నల్లగా ఉన్నాడని ఇంతకు ముందే చెప్పానే!

బాబు : చేతిలో కఱ్ఱ ఉందా? బుజంపైన గొంగడి ఉందా?

అన్నయ్య : వాడిని చూచేసరికే, నాకు భయమేసింది. నేను అవి ఏవీచూడలేదు.

బాబు : గొంగడీ, కఱ్ఱా లేవనుకుంటాను?

అన్నయ్య : నాకు చూచినట్లు జ్ఞాపకం లేదు.

బాబు : ఈ రోజు రాత్రికి వస్తాడట-అమ్మ చెప్పింది.

అన్నయ్య : వస్తేరావచ్చు-నీవు అల్లరిచేయకండా త్వరగా పడుకో. అప్పుడు వాడు నిన్నేమీ అనడు-తెలిసిందా?

బాబు : లేదు అన్నయ్యా-అల్లరిచేస్తాను. అల్లరిచేస్తే వాడిని చూడడానికి వీలుఅవుతుంది.

అన్నయ్య : చిన్నపిల్లలు వాడిని చూడకూడదు. చూస్తే భయమేస్తుంది-భయానికి జ్వరం వస్తుంది.

బాబు : వస్తే వచ్చింది. నేను తప్పకుండా అల్లరిచేస్తాను. తప్పకుండా బూచివాడిని చూస్తాను.

అన్నయ్య : ఏడ్చావు-వెళ్లు ఇక్కడినించి వెళ్లు.

బాబు :

చేస్తాను-అల్లరి-చేస్తాను
చేస్తాను-అల్లరి-చేస్తాను

(పాటకి మల్లె పాడుతూ గంతులు వేస్తాడు)

అన్నయ్య : అల్లరిచేయవద్దని నీకుకదూ నేను చెప్పింది. అల్లరిచేయనని బొంకి, ఏమీ తెలియనట్టు మళ్లీ మొదలు పెట్టావా? ఇంతకీ నీవు ఇక్కడినించి వెళ్లిపోతావా లేదా?

బాబు :

చేస్తాను-అల్లరి-చేస్తాను
చేస్తాను-అల్లరి-చేస్తాను
అల్లరి చేసి-బూచివాడిని-చూస్తాను
చూస్తాను-బూచివాడిని-చూస్తాను.

(బాబు అల్లరిగా పాడుతూ, అన్నయ్య గుర్రుజేయడంతోనే అక్కడినించి తుర్రున పారిపోతాడు.)

నాల్గవ దృశ్యం

(రాత్రి 9 గంటలు-బాబు నిద్దరపోకండా, ఆ రోజురాత్రి బూచివాడికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. తల్లి బాబుని నిద్దరపుచ్చడానికి ప్రయత్నిస్తున్నది.)

బాబు : ఎప్పుడు వస్తాడమ్మా బూచివాడు?

తల్లి : నువ్వు పడుకోకపోతే ఇప్పుడే వస్తాడు.

బాబు : నేను పడుకోవడంలేదుగా, ఇంకా ఎందుకు రాడు—

తల్లి : బూచివాడు మనం రమ్మంటేరాడు.

(21-వ పేజీ చూడుడు)

ఇప్పుడు ప్రభుత్వమే ఈ దినులకుక్కడుపునిండా తిండి ఆరోగ్యసంరక్షణ మొదలైనవి ఇవ్వడానికి పూనుకున్నది. స్వయంకృషికి దోహదమివ్వడంలేదనీ, స్వేచ్ఛాస్వాతంత్ర్యాల నరికట్టుతున్నారనీ ఎన్నిచెప్పినాసరే బ్రిటిష్ పౌరులింక వినబోరు. ఆరోగ్యవంతులైన తమ బిడ్డల వంక చూసి ఈ ప్రచారకులు చెప్పేదంతా పచ్చి అబద్ధమని వారే సమాధాన మివ్వగలరు. వారికి కావలసినది సర్వజనసంరక్షణాశయంగల ప్రభుత్వం."

రుద్రమదేవి

(6 వ పేజీ తరువాయి)

అన్నమంత్రి సోమయాజివెంట వచ్చిన ఇరువురు శిష్యులనంకను జూచెను. తన యశేషకార్యభారము నీ యిద్దరు శిష్యులును చేయగల రనియే సోమయాజులు తలంచుచున్నారు పెద్దంతో నా విషయము చెప్పు టెట్లు? వినయముతో మధ్య మధ్య మాట లాపుచు నన్నయదేవు డుపక్రమించెను.

"మీ మంచిమాటకు మిక్కిలి కృతజ్ఞుడను. కాని—ఇప్పుడు—సిద్ధముచేయ వలసిన లెక్కలు ఒక రిద్దరితో తీరునవి కావు. అధమపక్షము—"

తిక్కన: "ఎందరు కావలె మహామాత్యా?"

అన్నమంత్రి: "అధమపక్షము—మిక్కిలి సమర్థు లైనచో—అధమపక్షము—పాతికమంది యైనను లేనిది కాదు. అదియు గాక చాలించుకొన్నవారు మొద లా లెక్క లే స్థితిలో నుంచిరోకదా!"

తిక్కన: "మహామాత్యా, నావెంట నూరుగురు శిష్యు లట్టి సమర్థు లున్నారు. అందులో మీరు కావలసినంతమందిని వినియోగింపుడు!"

ఆ మాటలకు అన్నయమంత్రి నిర్ఘాంతపోయెను. అతని మనస్సులో నంత సేపుగా నావరించి యున్న చింతానీహార మొక్కసారిగా విరిసెను. తుష్టుడై నవ్వుచు ని ట్లనెను.

"నూరుమంది శిష్యులా సోమయాజీ? మీ రందరును ఏకశిలానగరము పట్టుకొనుటకు దండెత్తి రాలేదుగదా!—అందరును ఈ గురునాథునివంటివారే యైనచో ముందు మీ యందరను రాజభటుల కప్పగింపవలెనేమో!"

గురునాథుడును మారనయు చిరునవ్వు నవ్విరి. తిక్కనసోమయాజి నిట్టూర్పు పుచ్చెను! అయినను స్వకార్యవ్యగ్రతలో అన్నమంత్రికి సోమయాజులకు చింతాశల్య ముండె నని స్ఫురింపలేదు.

అంతట సోమయాజియాదేశమున మారన బయలుదేరపోయి వారి వసతినుండి పాతికమంది కరణముల బిలిచికొనివచ్చెను. వారు దివాణముముందుకు రాగానే వేద మంత్రములతో సూక్ష్మముగా స్వస్తి చెప్పి యన్నమంత్రిని ఆశీర్వదించిరి.

ఆ కరణముల యుదాత్తతకు అన్నమంత్రి నిర్ఘాంతపోయెను. ఇన్నాళ్లును తా నెరిగిన కరణములు తన్ను సేవించువారు. మరి వీరో, కేవలము వేదమాతృస్వరూపులై తన్ను ఉద్ధరించుటకు వచ్చిన పుణ్యబ్రాహ్మణమూర్తులు. అప్రయత్నముగా అన్నమంత్రియే వారి కందరకు నెదురుపోయి నమస్కరించి లోనికి తెచ్చెను.

తిక్కనసోమయాజి యా వచ్చిన కరణములకు వా రప్పుడు చేయవలసిన కార్య మాదేశించెను. వా రన్నయదేవునివెంట వ్యవహారపుదివాణములో ప్రవేశించిరి. ఆ మందిరము చెక్కుచెదరక యుండెను. పత్రములు దస్త్రములలో స్పష్టముగా కనపడుచున్న ముఖపత్రముల సూచికలతో నన్నియు యథాస్థానములలో నున్నవి. ఆ క్రొత్తకరణములు నిస్తంద్రులై యా మందిరము ప్రవేశించిరి. చిరకాల మచ్చట పనిచేయుట కలవాటుపడినవారివలెనే వా రొక్కొక్క రొక్క స్థాన మాక్రమించి పని ప్రారంభించిరి. వీరికి క్రొత్తకూడ లే దేమి?"

అన్నదేవునికి పోయిన ప్రాణములు లేచివచ్చిన ట్లయ్యెను. ఇది యంతయు నతనికి కలయా యని విభ్రాంతి కలిగెను. అయితే అత డట్లు ఆశ్చర్యపడుచు నాలోచించుట కాతనికి తీరిక లేదు. శీఘ్రముగా కార్యనిమగ్ను డయ్యెను. ఆతడు తన పని ఏకాగ్రచిత్తుడై యొక మహాయోగివలెనే చేయసాగెను.

మధ్యాహ్నకాల మతిక్రమించెను. దివాణమున గడియారమున రెండెనిమిదుల ఘంటాఘణాత్కారములు మ్రోసెను. అన్నయదేవుడు ఆ ప్రక్క నున్న గదిలో సోమయాజులను వదలివచ్చిన సంగతియే మరచిన ట్లుండెను. ఇదుగో వచ్చును. అదిగో వచ్చును అని తిక్కనసోమయాజి యాతని రాకకై దీర్ఘకాలము నిశ్శబ్దముగా నిరీక్షించెను. గురునాథున కొకవైపునుండి కోపము వచ్చుచుండెను. మారన తన కభిమానమైన మార్కండేయపురాణములోని ఘట్టములు మననముచేయుచు ఇతరము మరచిపోయెను.

తిక్కనసోమయాజికి అన్నమంత్రికార్యవ్యగ్రతకు అచ్చెరు వయ్యెను. అత డిక పని తీరనిది రా దని నిశ్చయించి మాధ్యాహ్నికకృత్యములకు వేళ యతిక్రమించు చున్నందున వసతికి బయలుదేరుటకు లేచెను. గురునాథుడును లేచెను. మారన నిద్రలోనుండి లేచినవానివలె గురునాథు డుద్బోధింపగా లేచెను. అన్నమంత్రికి చెప్పివెళ్లుట ధర్మముకదా!

"మరల మీ దర్శనమునకు వచ్చెదను మంత్రీశ్వరా!"

ఈ మాటలు అన్నమంత్రీశ్వరుని ఎదుటికి పోయి తిక్కనసోమయాజులు పలికెను. కాని యా మాటలు అన్నమంత్రి వినిపించుకున్నట్లు లేదు. ఏమి చేయుటా యని తిక్కనసోమయాజి ద్వారపార్శ్వమున సందేహించుచు నిలువబడెను.

అత డట్లు నిలుచున్న ప్రదేశము అన్నమంత్రియంతఃపురములోనివారికి కనబడుచుండెను. సోమయాజులు తమ దివాణములోనికి వచ్చినప్పటినుండియు అన్నమంత్రి తల్లియు నిద్దరు భార్యలు పార్వతియు లకుమాంబయు నాయనను జాగరూకులై కనిపెట్టియుండిరి. అందుచే సోమయాజుల ప్రస్తుతస్థితి వారికి వెంటనే యవగత మయ్యెను.

ఆరేళ్లపిల్ల యొకతె దాసిని వెంట నిడుకొని సోమయాజులకు ప్రత్యక్ష మయ్యెను. బాలాత్రిపురసుందరి యీ రూపమున దర్శన మిచ్చినదా యని సోమయాజితలపులో జారుచున్న దేతడవుగా నది—.

"తాతగారూ, మా అమ్మగారే,—మిమ్మను లోపలికి తీసికొనిరమ్మన్నారు!"

ఇట్లనుచు నా పిల్ల ప్రేమతో గౌరవముతో సోమయాజుల చేయి పుచ్చుకొని గురునాథునివంక బెదరుబెదరుగను మారనవంక సిగ్గుతోడను చూపులు పరపుచు వారల మువ్వురను అభ్యంతరమందిరములోనికి తోడ్కొనిపోయెను.

బాలవిజ్ఞానము:

★ మెఱుపు - పిడుగు ★

మూలం: లెనాక్సు డార్ట్

అనువాదం: శ్రీ రే. కృష్ణమూర్తి

మెఱుపునుగురించి, పిడుగులనుగురించి ప్రజలకు చాల మూఢనమ్మకా లున్నాయి. కొందరు పిడుగు ఒకచోట పడితే మళ్లా అక్కడ ఇంక పడ దంటారు. కాని ఇది నిజము కాదని ఇటీవల తెలిసింది. ఒకసంవత్సరము అమెరికాలో తుపాను వచ్చినప్పుడు ఒక సెకండులో 20 సార్లకుపైగా ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పైన పిడుగులు పడ్డాయిట. ఆ భవనము చాల భద్రముగా కాపాడబడింది. పిడుగులన్నీ భూమిలోకి అపాయం లేకుండా పంపించబడ్డాయి. ఈ భవనముపైన ఒక పరిశోధనశాల నిర్మించబడి ఉంది. అందులో తుపాను వచ్చినపుడు "ఫోటోలు తీసి మెఱుపులను పరిశీలిస్తారు.

మెఱుపులనుగూర్చి నేర్చుకోవటం చాల కష్టం. ఎందుకంటే మెఱుపులు చాల కొద్దికాలం ఉంటాయి. ఒకొక్క మెఱుపు రమారమి నూరు మైక్రోసెకం డ్లుంటుంది. ఒక్క మైక్రో సెంకండంటే సెకండులో మిలియనవభాగము. ఇప్పుడు ఒక క్రొత్తయంత్రము కనుగొనబడింది. తుపానులు వచ్చినప్పుడు ఆ యంత్రము దానంతటదే మెఱుపులను ఫోటోతీస్తుంది. ఆ ఫోటోల వలన ఒకొక్క మెఱుపువేగము, శక్తి కనుక్కుంటారు. పిడుగులు పడటంలో నష్టాలే కాక లాభాలుకూడా ఉన్నాయి. పిడుగు గాలిలో వచ్చేటప్పుడు చాలభాగాలుగా విభజింపబడుతుంది. దీనివలన సంవత్సరానికి రమారమి 10 కోట్లటన్నుల "నైట్రోజన్" తయారుచేయబడుచున్నది. ఈ నైట్రొజన్ మనము తయారుచేసే నైట్రోజన్ మాదిరే ఉంటుంది. కాని మొత్తంమీద లాభాలకన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి.

మెఱుపులనుంచి, పిడుగులనుంచి తప్పించుకొనేందుకు కొన్నిమార్గా లున్నాయి. మెఱుపుకూడా ఒకవిధమైన విద్యుచ్ఛక్తే. ఈశక్తి ముందు ఎత్తుగా ఉన్న భవనాలపైన, చెట్లపైన పని చేస్తుంది. కాబట్టి మెఱుపులు. పిడుగులు వచ్చేటప్పుడు పైభవనాలలో కాకుండా క్రింద ఉండటం మంచిది. చుట్టు చెట్లు లేని ఇంటిలోకి పోవటంకూడ మంచిదే. ఒకొక్కసారి పిడుగు తుపానుగాలిశక్తిచేత ఒకచోటినుంచి ఇంకోచోటికి తీసికొనిపోబడుతుందంటారు. కాబట్టి తుపాను వచ్చేటప్పుడు కిటికీలదగ్గఱ, తలుపుల దగ్గఱ నిలబడకూడదు. కాని ఇల్లా జరగటం చాల అరుదు. ముఖ్యంగా గమనించవలసింది నీరు. తుపాను వచ్చేటప్పు డెప్పుడుకూడ నీళ్లల్లో ఈదకూడదు.

అన్నిటికన్న ముఖ్యంగా మెఱుపు, ఉఱుము, పిడుగు మానవుడికి కలిగించేది అనవసరమైన భయం. నిజానికి మానవుడు భయపడటం దేనికి? ఒక్కసారి మెఱుపు వస్తే అది ఇంక ఏమీ చేయలేదు. మనము చూచేటప్పటికే దాని ప్రభావం పోయిఉంటుంది. పిడుగు కూడా ఇంతే. ఇంక మనపైన పడితేనో? అది మనకు తెలియనే తెలియదు.

భద్రాద్రిక్షేత్రం భక్తరామదాసు

(13వ-పేజీ తరువాయి)

పించింది. తర్వాత బహుకాలానికి నెలకొండపల్లెలో రామదాసు జన్మించి, భగవదనుగ్రహం వల్ల భద్రాచలానికి తహసీల్దారై, రాజద్రవ్యాన్ని సద్వినియోగం చేసి రామునికి గుడి గోపుర ప్రాకారాలు ఏర్పరచి అందుకు రాజకీయంగా శిక్షపడి చెరలో యాతనలు పడి చెక్కుచెదరక అందుకు లభించిన పుణ్యాన్నిమాత్రమే స్వాయత్తం చేసుకొని తరించాడు. ఉచితిజ్ఞుడైనటువంటి తానీషా గూడా అప్పట్లో ప్రమత్తుడై అధికారదుర్వినియోగం చేశాడని గోపన్నకు తగుపాటి దండన విధించినా ఆతడు చేసిన కైంకర్యాన్ని మన్నించి, అనంతరము వెలసినటువంటి పదుపాయం శాశ్వతంగా తాను చేశాడు ఈనాటికి ఆ పరిపాటే సాగుతోన్నది. శ్రీరామనవమిఉత్సవసందర్భంలో నానాదేశయాత్రికులు భక్తులు తరలివచ్చి స్వామిని సేవించటమేగాని ప్రతినిత్యమూ ఆరాధానార్చనలకు ప్రధానకర్తృత్వబాధ్యతలు ఆ తురకప్రభువు పరంపరలో వారికే. ఆనాడు ఈనాటి నాగరికపు మతవైమన్యాలుకాని, అసహనాద్రేకాలుకాని లేవేమో! భక్తివిషయములో ఏ మతస్థుడైనా ఏకభావనే. ఏకఆదరణే. గోపన్నకు తారకమంత్రము ఉపదేశించిన గురూత్తముడు సాటిబ్రాహ్మణుడు కాడు. సర్వసముడైన కబీరుదాసు.

గోపన్నకు ఉద్యోగంఇచ్చి; తరించే అవకాశం కల్పించింది, బ్రాహ్మణ ప్రభువు కాదు. తానీషా. ఆ సౌజన్యమే ఈనాటికీ ప్రవర్తిల్లుతూన్నదని నాగరికులు గుర్తుఉంచుకున్న పక్షంలో ఈ నడుమ భాగ్యనగరపరిసరాల్లో జరిగిన బీభత్సానికి, అవకాశం ఉండేదే కాదేమో. ఆనాటి ప్రభువులూ ప్రజలూ, సర్వసౌజన్యాన్ని మతసహనాన్ని గురించి ఉపన్యాసాలు ఇవ్వలేదు. ఫర్మానాలు జారీ చేయలేదు. గుట్టుచప్పుడు గాకుండా ఆచరణలోకి తెచ్చారు. మతాంతరుడని ఆతడి చిత్తశుద్ధిని శంకించని నిశ్చలచిత్తము ప్రతివారికీ ఏర్పడటం సాధ్యమైతేనే ఈలాటి సౌజన్యం సంభవమాతుందేమో? అది అన్ని శతాబ్దాలకు వెనుక వర్ధిల్లిన ఆ సౌహార్ద్రం ఈనాడు ఎడనెడ లోపించడానికి ఏమిటి కారణం? ఇది మన నాగరికత చేసుకున్న పాపమా?

కిన్నెరసాని

భద్రాద్రిత్రోవను పయనించే యాత్రికులకు మధ్యేమార్గాన ఆ చల్లనితల్లి కిన్నెరసాని దర్శనమిస్తుంది. ఉత్తమఇల్లాలి శోభను గుర్తించి అక్కున చేర్చుకొని తనలో లీనంచేసుకొని ఆదరించిన నిత్యకల్యాణి గోదావరీమతల్లికి ఆవలివడ్డున సీతమ్మతల్లి. ఈవల అంతటి ఇల్లాలు కిన్నెరసాని.

"తెలుగుదైవమ్మ భద్రాద్రిపై నెలకొన్న
రామయ్య అతని దర్శనము చేసేత్రోవ
కాచింది కిన్నెరా
తెలుగుయాత్రికుల కందిచ్చు చల్లని నీడ
పుణ్యాత్మ కిన్నెరా
తెలుగుయాత్రికుల కందిచ్చు చల్లని నీరు
పూతాత్మ కిన్నెరా."

కిన్నెరసానివాగును చూడగానే మహాకవి విశ్వనాథసత్యనారాయణగారి ఈ అమోఘరచన మనస్సునిండుతుంది. మనసార ఆమహేంద్రకవికి నమస్కరించి కిన్నెరసానికి కేలోడ్చి, భక్తుడు ముందుకు అడుగువేస్తాడు. భద్రాద్రి రామదర్శనానికి సాగిపోతాడు. ఉత్సవసందర్భంలో స్వామిని సేవించుకొని, దర్శించుకొని తరిస్తాడు. కల్యాణోత్సవసందర్భాన దివ్యమేఘపంక్తులు చిలికించే ముత్యాలజడిలో ఒక్కచినుకైనా మీదపడితే, ధన్యు డవుతాడు.

హైదరాబాదులో నేటి కార్మికస్థితి

చారిత్రాత్మకమైన పోలీసుచర్యానంతరము సంస్థానములో కార్మికసమస్యలను కార్మికశాఖ ఎక్కువ నైపుణ్యముతో నెదుర్కొనవలసివచ్చినది. ఉత్పత్తి తగ్గిపోకుండాను, కార్మికులకు యిబ్బందులేమీ కలుగకుండాను పారిశ్రామికరంగములో సమరససద్భావములను నిర్వహించుటకు వ్యవస్థలులేని పరిస్థితినుండి వ్యవస్థాయుతమైన స్థితికి కార్మికసంస్థలలో వచ్చు మార్పులు సుకరముగాను శాంతియుతముగాను జరుగునట్లు చేయవలసివచ్చినది. నూతనశకోదయముతో కార్మికులలోను, జనసామాన్యములోను వెల్లువగా వచ్చిన యుత్సాహమువలన నుత్పన్నమైన ఆందోళనకరపరిస్థితిని కార్మికశాఖ అదుపులో వుంచినది. ఇదివరలో వారి ఇబ్బందులను చెప్పుకొనకుండా నోరులను నొక్కివేసిన నిర్బంధముల నొక్కసారిగా హఠాత్తుగా సడలించుటతో సహజముగానే కార్మికులలో యుత్సాహపు వెల్లువ పెల్లుబికినది. తొమరతంపరగా కార్మికసంఘములు స్థాపింపబడినవి. ఇబ్బందులను తెలియజేయుచు పెద్దపెద్ద విజ్ఞప్తులు సమర్పింపబడినవి.

కార్మికశ్రేణులలోగల యీ తొందరపాటు నెమ్మదిగా తగ్గి నిర్మాణాత్మకమైన విధానముల నవలంబించుట నారంభించిరి. వారి ఇబ్బందులు, ముఖ్యముగా బేసిక్ జీతము, కరువుభత్యములకు సంబంధించినవారి కోర్కెలు అటులేయున్నవి. కాని యీ యిబ్బందులను తెలియజేయుట, వాటి నివారణను కోరుట మాత్రము చట్టసమ్మతమైన పంథాలో నడిచినవి.

భారత ప్రభుత్వముయొక్క కార్మికవిధానముతో సమానస్థాయికి తమ కార్మిక విధానమును తీసుకురావలెననియే కార్మికశాఖ సంకల్పించినది. అయితే హైదరాబాద్ భారతదేశముల మధ్యగల మానవకల్పితములైన అంతరాయములను తొలగించుటతో యీ విధానము త్వరితగతిని నడచినది. భారతదేశములోనున్న చట్టములు, బిల్లుధోరణిలో చిత్తునిబంధనలు తయారుచేయబడి ప్రభుత్వమునకు సమర్పింపబడినవి.

కొత్తగూడెము, తాండూరు బొగ్గుగనులలో పనిచేయుచున్న కార్మికుల ఇబ్బందులను పరిశీలించి నివేదిక సమర్పించుటకు భారతప్రభుత్వ ప్రాంతీయ కార్మికకమీషనర్ శ్రీ డి. బి. జాదవ్ అధ్యక్షుడుగా నొక కమిటీని పోలీసుచర్యానంతరము ఆరునెలలో ప్రభుత్వము నియమించినది. సంపూర్ణవివరములతో విచారణ ముగించిన తర్వాత కమిటీ తన సలహాల నర్పించినది. తర్వాత ప్రభుత్వము వాటి నంగీకరించినది. ఇప్పుడు అవి అమలు జరుపబడుచున్నవి.

సంస్థానములో పారిశ్రామిక కార్మికుల యొక్క స్థితిగతులలో నభివృద్ధిని తీసుకవచ్చుటకు శ్రీ డి. వి. రెగె, ఐ. సి. యస్. అధ్యక్షతన నియమింపబడిన కర్మాగార కార్మికుల విచారణకమిటీ హైదరాబాద్ ప్రభుత్వము తీసికొనిన మరియొక చర్య.

పారిశ్రామిక సంబంధములు:

మన పునర్విమర్శనలోనున్న సంవత్సరములో ఎన్నడూ లేనట్టి సమ్మెలు లాక్ అవుట్లు జరిగినవి. కాని ఎప్పుడూకూడా పరిస్థితి చెయిదాటిపోలేదు. తగాయిదాలు చాలావరకు సమిష్టి సంప్రదింపుల ఫలితముగాను కార్మికశాఖ తోడ్పాటు కల్గించుకొనుటవల్లనూ సఖ్యముతో పరిష్కరింపబడినవి. మిగిలినవి ప్రత్యేకముగా వాటికొరకేర్పరచబడిన మధ్యవర్తిత్వ సంఘములకు సూచింపబడినవి. 1358 ఫ. లో హైదరాబాద్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్ మిల్సు, హైదరాబాద్ ఆల్విన్ మెటల్ వర్క్సు, లాజ్ గ్లాస్ ఫాక్టరీ, యాస్‌బెస్టాస్ సిమెంట్ వర్క్సు, డి. బి. ఆర్. మిల్సు, ప్రాగాటూల్సు కార్పొరేషన్లతో సహా 10 కేసులు ప్రస్తుతము అమలులోనున్న పారిశ్రామికతగాయిదాల శాసనము ననుసరించి మధ్యవర్తిత్వసంఘములకు సూచింపబడినవి. బేసిక్ జీతములు, కరువుభత్యముల హెచ్చింపే యీ పరిశ్రమలలో పనిచేయుచున్న కార్మికుల ప్రధానకోర్కెలు. ఈ కేసులన్నింటిలోను ఉభయపక్షముల అంగీకారముతోనూ సంఘములు తీర్పుల నిచ్చినవి. అయితే ఒకే కేసు డి. బి. ఆర్. మిల్సు తగాదాలో మాత్ర మిది సాధ్యము కాలేదు. డి. బి. ఆర్. మిల్సు తగాదాలో ఇచ్చిన తీర్పుమీదపడిన పక్షములకు సమ్మతము కాలేదు. గనుక పారిశ్రామికన్యాయస్థానమునకు ఇది పరిష్కారము నిమిత్తము సూచింపబడినది. పి. డబ్ల్యు. డి. కార్ఖానా, ప్రభుత్వ డిస్టిలరీ, ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు మింటులో వచ్చిన పారిశ్రామిక వివాదములు మిస్టర్ జస్టిస్ సూర్యనారాయణరావుగారు అధ్యక్షుడుగా నున్న పారిశ్రామిక న్యాయస్థానమునకు సూచింపబడినవి. ఎలక్ట్రిసిటి, పి. డబ్ల్యు. డి. కార్ఖానాలో పనిచేయుచున్న కార్మికులకు రూ. 8-8-0 చెల్లించవలెననియు, సెలవుసౌకర్యములు తగ్గించబడినందువలన వాటికి బదులు 1357 ఫ. సంవత్సరమునకు ఒక నెలజీతము బోనసుగా యిచ్చుటకు న్యాయస్థానము ఇదివరకే తాత్కాలికనిర్ణయము చేసినది.

ఔరంగాబాద్ మిల్లులలో వచ్చిన తగాదా ఔరంగాబాద్ సెషన్సుజడ్జి అధ్యక్షుడుగానున్న పారిశ్రామికన్యాయస్థానమునకు సూచింపబడినది.

కాని 1949 సంవత్సరములో మూడవ క్వార్టరులో సిబ్బందిని తగ్గించు వేయుసమస్య కొంతవరకు ముఖ్యతగాంచినది. మార్కెట్ పరిస్థితులు వ్యతిరేకముగా నుండుటవలన కొన్ని యాజమాన్యములు సిబ్బందిని తగ్గించివేసినవి. అందువలన కార్మికులలో అలజడి అశాంతి కలిగినది. అయినా సరిపడినంత ముందుగా తీసివేయుచున్నట్లు నోటీసునకు ప్రతిగా జీతములుచెల్లించుట యాజమాన్యములకు తప్పనిసరిచేయబడినది. కొన్ని సందర్భములలో ఆసివేయబడిన కార్మికులకు కొంతకాలమువరకు జీవనోపాధి యుండునట్లు చేయుటకు యజమానులు పైన కొంత ధనము చెల్లించిరి. సిబ్బందిని తగ్గించుట వీలైనంతవరకు నిరోధించుటకు ప్రభుత్వ కార్మికశాఖ శక్తివంచన లేకుండా కృషి చేయుచున్నది. ఏది తప్పనిసరి కారణమువలన ఫాక్టరీని మూసి వేయుటగాని, సిబ్బందిని తగ్గించుటగాని యుండినచో తగినంత ముందుగనే ప్రభుత్వమునకు తెలియచేయుటకు యిందుకొరకు, సమావేశపరచబడినసభలో 30 మంది యజమానులు అంగీకరించినారు.

1949 మార్చి, 1949 సెప్టెంబర్ నెలల మధ్యకాలములో సమ్మెలవల్ల 16 పరిశ్రమలు దెబ్బతిన్నవి. సమ్మెలో 10,419 కార్మికులు పాల్గొనిన కారణమువలన పయోజనులు పనిచేయు 42,799 రోజులు నష్టమైనవి.

సంస్థానములో కార్మికశాసనములు:

కార్మిక శాసనములలో యీ క్రింది శాసనములు అమలులోనున్నవి.

(22 వ పేజీ చూడుడు)





జేమ్సు స్ట్రీటు

సికింద్రాబాదు

శ్రీ సాల్వేరు రామయ్య

సికింద్రాబాదు చక్కటి, చిన్న పట్టణం. ఇంకా అందంగా, పొందికగా ఉండేదే. కాని 1945 నుంచి మానగరం అలంకారం చేసుకోటానికి వీల్లేకపోయింది. బ్రిటిష్‌ప్రభుత్వం సికింద్రాబాదును సైనికకేంద్రంగా, కంటోన్మెంటుగా, ఉంచి, చాలా అభివృద్ధికి తెచ్చింది. ఆనాటి పరిపాలకులు అనేకమైన పిచ్చిపనులు చేసినా, కొంత మేలు కూడా చేశారు. నవంబర్ 1945 లో ఈపట్టణంపైన బ్రిటిష్ వారి ప్రత్యక్ష పాలనకు పొద్దుకూకింది - ఇంత వరకు తెల్లవారలేదు. పట్టణాభివృద్ధి కార్యక్రమం, ఆనాటికంటోన్మెంటుఅధికారులు వదలినచోటే ఉండిపోయింది. అయినా, ఈనాటికీ ఆంధ్రదేశం మొత్తంమీద ఇంత చక్కటి జనపదం మరొకటి లేదు. ఉన్నతవిద్యాసౌకర్యాలే ఇక్కడ ఉన్నట్టుంటే, ఈపట్టణపు ప్రభ మరీ బాగుండేది.

వెలెస్లీహయాంలో ఇక్కడ ప్రప్రథమంగా సైనికకేంద్రం ఏర్పాటయింది. అప్పుడిదొక చిన్న గ్రామం. సైనికకేంద్రాన్ని "లస్కర్" అంటారు. ఇప్పటికీ పాతవాసనలు పోనివారు, సికింద్రాబాదును లస్కర్ అనే అంటూవుంటారు. సైనికులకు ఇంటివసతులు, తిండి, గుడ్డ వసతులు కల్పించటానికి పూనుకున్నవారితో, ఈ కార్యక్రమాన్ని ఆధారంచేసుకొని ఉత్పన్నమయ్యే జీవనాధారాల్ని ఆశించి వచ్చిన వారితో గ్రామం పెరిగిపోవ ప్రారంభించింది.

1687 లో మొట్టమొదటి పురపాలకసంస్థ, మద్రాసులో నెలకొల్పబడింది. పురపాలనా నిర్వహణకు నియమింపబడిన అధికార్లే 'సంస్థ' అయ్యారు. అప్పటినుంచి, బ్రిటిష్‌వారి అధికారంక్రిందకు వచ్చిన పెద్దఊళ్లన్నీ మ్యునిసిపాలిటీలయ్యాయి. కాని సైనికకేంద్రంగా ఉన్న పట్టణాల (కంటోన్మెంటుల) విషయంలో, 1809 లో ఒక ప్రత్యేకత వచ్చింది. సైనికాధికారికి ఆపట్టణప్రాంతంలో శాంతిభద్రతలు కాపాడే అధికారం ఇవ్వబడింది. 1864 లో సైనికాధికారి పురపాలనకు పూర్తి బాధ్యత వహించటానికి ఏర్పాట్లు జరిగాయి. అప్పుడే కంటోన్మెంట్ల బిల్లు కూడా జన్మించింది. 1889 లో, సైనిక పట్టణాని కుండే ప్రత్యేకతల్ని ఉంచి, ఆర్థికకార్యక్రమాల్లో మ్యునిసిపాలిటీల ననుసరించే పరిపాలన జరగాలని చట్టం చేయబడింది. 1910 లో, సైనికాధికారి, స్థానిక మేజస్ట్రేట్ సలహాపై శాంతిభద్రతల రక్షణకై కఠినచర్యలనుతీసికొనవచ్చునని, శాసనం చేశారు. తర్వాత వరసగా 1912-14-19-23-24-36 సంవత్సరాలల్లో కంటోన్మెంటుల పాలనపై శాసనాలు, సవరణలు చేయబడ్డవి. ఇందులో ముఖ్యమైన విషయమేమంటే, 1919 లో, కంటోన్మెంట్ల పౌరప్రతినిధుల మహాసభ అంబాలాలో జరిగింది. మహాసభవారు కంటోన్మెంట్లలోని పౌరప్రాంతాల్ని అభివృద్ధిచేయాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. తత్ఫలితంగా 1923లో ఒక చట్టం చేయబడింది. ఈ చట్టప్రకారం సైనికులకు, సైనికాధికారులకు గృహవసతుల్ని పౌరులు చూపాల్సిన బాధ్యత తొలగిపోయింది. 1924 లో చేసిన మరొకచట్టంద్వారా, కంటోన్మెంటులలోని పౌరప్రాంతాల్ని మ్యునిసిపాలిటీలకు లాగనే పాలించాలని-ఒక్క శాంతిభద్రతలు, ఆరోగ్యపారిశుధ్యాలు మినహా-నిర్ణయించబడింది. ఇదేకాలంలో కంటోన్మెంటుబోర్డులు కూడా సృష్టిఅయ్యాయి. 1936 లో ఈ బోర్డులకు పాక్షికపు ఎన్నికలు జరిగేటందుకు ఒక చట్టం ద్వారా ఏర్పాటయింది. దేశవిభజనకు పూర్వం మొత్తంమీద దాదాపు 90 కంటోన్మెంట్లుండేవి.

ఇంక సికింద్రాబాదువిషయం. కంటోన్మెంటు స్థాపనకాలంలో ఇల్లు కట్టగలిగిన ప్రతివాడూ, ఒక ఇల్లు కట్టటం, దాన్ని మిలిటరీ వాళ్లకి కిరాయి కివ్వటం ప్రారంభమయింది. మిలిటరీకి కావలసిన వస్తువుల్ని సప్లై చేయటానికి అనేకమంది చేరారు. ధనసంపాదనకు అనేక మార్గాలేర్పడ్డాయి. రానురాను సికింద్రాబాదు చక్కటి రవాణాకూడలి అయిపోయింది.

అప్పుడు కంటోన్మెంటును పాలించేది సైనికాధికారి-మరోముగ్గురు ప్రభుత్వంవారు నియమించినవారు. శాంతిభద్రతలను నిరంకుశంగా కాపాడటానికి, ఆ విషయాల్లో సైనికాధికారికి సలహా లివ్వటానికి కంటోన్మెంటు మేజస్ట్రేటు ఉండేవాడు. కంటోన్మెంటు పరిపాలనంతా ఒకేవ్యక్తి నిరంకుశంగా నడిపేవాడు.

కాని కంటోన్మెంటుపౌరుల మహాసభ చేసుకున్న విన్నపాలఫలితంగా 1926 లో, మొట్టమొదటిసారిగా, కంటోన్మెంటుబోర్డుకు ఎన్నికలు జరగాయి. సైనికాధికారికి బదులుగా, మరొక అధికారిని, బోర్డుఅధ్యక్షుడుగా నియమించారు. 14 మంది సభ్యులు- ఇందులో సగంమంది ప్రభుత్వం నియమించినవారు మిగిలినవారు ఎన్నుకోబడ్డవారు. అయితే ఎవ్వరూ ఈ బోర్డు ఎన్నికల్లో శ్రద్ధ తీసుకునేవారుకాదు. ఎన్నుకోబడిన సభ్యులుకూడా, ప్రభుత్వం అన్నదాని కల్లా తల ఊపేరకంవారు తయారయ్యేవారు. బిరుదులు కలవారు, పెద్దపెద్దసేట్లు, పలుకుబడి గలవారి ఆప్తులు బోర్డుసభ్యులవటం అప్పటి ఆచారం.

సికింద్రాబాదుకు 1933 వరకూ ప్రతిఏడూ ప్లేగువ్యాధి వస్తూఉండేది. ప్రజారోగ్యపారిశుధ్యశాఖలు సైనికాధికారుల క్రిందే ఉన్నా, పట్టణం శాస్త్రీయపద్ధతులపై నిర్మింపబడటం లేదుగనుక, వ్యాధులు తరుచు వస్తూఉండేవి. మొత్తానికి 1933 నుంచి పట్టణాభివృద్ధిప్రణాళికలంటూ అమలుజరగటం ప్రారంభమయింది. ఆ తర్వాతే కింగ్స్‌వే, హైదర్‌బస్తీ, జీరా, మారేడుపల్లి మొదలైనవి చక్కటి పారిశుధ్యపు సౌకర్యాలతో అభివృద్ధిచెంద నారంభించాయి.

1935 లో జరిగినబోర్డు ఎన్నికల్లో ప్రజలు చాలా ఉత్సాహంతో పాల్గొన్నారు. పక్కనే ఉన్న హైదరాబాదులో పరిస్థితులకు సికింద్రాబాదు పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉండె. వ్యత్యాసం ఉండటం అధికారులకు ఇష్టంలేకపోయి ఉండవచ్చు-హిందూ, ముస్లిం విద్వేషాల్ని రెచ్చగొట్టారు. కొట్లాట జరిగింది. కొట్లాట కూడదని బహిరంగంగా ప్రచారం చేసిన పెద్దలకు సికింద్రాబాదునుంచి బహిష్కారం సంప్రాప్తించింది. తర్వాత ఆ బహిష్కరణ ఉత్తరువుల్ని ఢిల్లీప్రభుత్వపు జోక్య ఫలితంగా స్థానికప్రభుత్వానికి ఉపసంహరించుకోక తప్పలేదు.

కాని కంటోన్మెంటుఅధికారులు ఏపని చేసినా, చాలా త్వరగా చేసేసేవారు. పట్టణాభివృద్ధిప్రణాళిక చాలా శీఘ్రంగా అమలుకాసాగింది. 1938 లో ఒకసారి, 42 లో ఒకసారి ఎన్నికలు కూడా జరిగాయి. 1942 లోనే ఆఖరు ఎన్నికలు. 1945 నవంబర్‌లో, ఎందరు కూడదంటున్నా లెక్కచేయక, సికింద్రాబాదును, అప్పటి భారత ప్రభుత్వం నైజాం కిచ్చేసింది. అప్పటితో అభివృద్ధికార్యక్రమాలు మూలపడ్డాయి. జనరల్‌బజారును వెడల్పుచేసి, పొడిగించే ప్రణాళిక మూలపడింది. నైజాంప్రభుత్వంలో జీర్ణించిన దుస్సాంప్రదాయాలన్నీ, సికింద్రాబాదుకు చేరాయి.

అసలు కంటోన్మెంటు స్థాపనసందర్భంలో జరిగిన (సైనికసహకారపద్ధతి) ఒడంబడిక ప్రకారం, ప్రతిసంవత్సరమూ, కంటోన్మెంటు నిర్వహణకు నైజాం ధనసహాయం చేయాలి; నైజాం అప్పులు తీర్చటంలో చాలా అశ్రద్ధ చేసేవాడు. అందువల్లనే బీరారును వదులుకోవాల్సివచ్చింది. అయితే, సికింద్రాబాదులో ఆబ్కారిపన్నును వసూలు చేసి, ఆ ధనాన్ని కంటోన్మెంటుకు ఇచ్చేటట్లు, రెసిడెంటుకు నైజాంకు ఒక ఒడంబడిక జరిగింది. నైజాంమాత్రం ఈ ఆదాయాన్నంతా తనవద్దే 'ఆబ్కారీనిధి' అనే పేర ఉంచి, కొంచెంకొంచెం ధన్నాన్ని కంటోన్మెంటుకు ఇవ్వనారంభించాడు. 1938 లో ఈనిధిని పూర్తిగా కంటోన్మెంటుబోర్డుకు అప్పగించాలని కోరగా, యుద్ధానంతరం దాని విషయం చూస్తామన్నారు పరిపాలకులు. యుద్ధం అయిపోయినవెంటనే, సికింద్రాబాదునే నైజాం కిచ్చేశారు!

సికింద్రాబాదు చాలా ప్రముఖవ్యాపారకేంద్రంగా ఉండేది. భారతదేశంలో ఎక్కడనుంచైనా, ఏసైనాసరుకుల్ని దిగుమతి చేసుకోటానికి హైదరాబాదుకంటె సికింద్రాబాదు అనుకూలమైనదిగా పరిగణింపబడేది. కారణమేమంటే, సికింద్రాబాదు ఢిల్లీప్రభుత్వం క్రింద ఉండేది. హైదరాబాదు అట్లా కాదు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టప్రకారం, చుట్టూ ఉన్నరాష్ట్రప్రభుత్వాలు సికింద్రాబాదులో ప్రత్యక్షంగా సంబంధాలు పెట్టుకోవచ్చు, వ్యవహారాలు నడుపుకోవచ్చు. ఏవైనా వ్యాపార పేచీలు వచ్చినా, సికింద్రాబాదుకుసంబంధించినంతవరకూ ప్రత్యక్షంగా వ్యవహారం నడపవచ్చు. అందువల్ల సికింద్రాబాదుకు వర్తకవ్యాపారాలు సులభమయ్యాయి. హైదరాబాదు వ్యాపారంఅంతా సికింద్రాబాదులోనే నడిచేది. అందువల్ల నైజాం ప్రభుత్వాని కొచ్చే 'కస్టంస్ ఆదాయం' లో చాలాభాగం సికింద్రాబాదునుంచే లభించేది. కాని నైజాంకు సికింద్రాబాదు నివ్వటంతో, సికింద్రాబాదువ్యాపారరంగం దెబ్బతిన్నది.

సికింద్రాబాదులో చక్కటి ఆటస్థలాలున్నాయి. ఊరంతా విశాలంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఈ మధ్యనే ఒక ఉస్మానియా విశ్వవిద్యాలయపు ఇంటర్మీడియేట్ కళాశాలను స్థాపించారు. దాదాపు పది హైస్కూళ్ళున్న సికింద్రాబాదుకు, ఒక చిన్న ఇంటర్మీడియేట్ కళాశాల ఏమి ఉపయోగం?

పట్టణంలో అన్ని జాతులవారు ఉన్నారు. అన్ని వసతులూ ఉన్నయ్యి—ప్రస్తుతం లేని వసతుల్ని కల్గించడానికి ఆధారాలున్నాయి. కాని ఇల్లాంటి ఊరికి పురమందిరంకూడా లేదు. చివరకు మ్యునిసిపాలిటీలో, ఈ తెలుగుపట్టణానికి ప్రాతినిధ్యం వహించే తెలుగుసభ్యుడు లేడు!

మనరాష్ట్రం మనదేశం

(5-వ పేజీ తరవాయి)

"ఆంధ్రదేశానికి ఆర్థికాభివృద్ధికార్యక్రమాల్లో అన్యాయం జరిగిందంటున్నారుకాబట్టి ఆస్తి అప్పుల పంపకంఎలా చెయ్యాదలిచారు-అని అయ్యంగారే తెలియపరచమంటున్నారు. పూర్వం జరిగిన అన్యాయానికీ నష్టానికీ తలొగ్గి పంపకం చేస్తే చాలని కూర్చున్నప్పుడు ఈతగువును తవ్వి తెచ్చి పరిష్కరించమనడంలో అర్థమేమిటి? మీరంతా మునిగిపోయినా సరే తగవు లేవీ ఉండకూడదని జపంచేసేవారికి జపం మాని ఒకసారి సావధానంగా చూస్తే బోధపడుతుంది. ఆతగవులన్నిటినీ వొదిలి రాగల నష్టాలన్నిటికీ శాశ్వతంగా తలొగ్గాలని చెప్పడమే దీని అర్థమా?

జె. వి. పి. రిపోర్టు ప్రకారం ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించడానికి అయ్యంగార్ సూచించిన పరిష్కారం కావలసిన విషయా లేవీ అడ్డురావు.

కచ్చాపచ్చాగా చేసే పంపకంలో అట్లో ఇట్లో (ప్రస్తుతసందర్భంలో ఇటే) కొంత అన్యాయం జరిగినా ఊరుకుని ఆ పంపకాని కొప్పుకొని ఉత్తరోత్తరా హెచ్చుతగ్గుల్ని సామరస్యంతో చక్కబరుచుకోవాలని జె. వి. పి. రిపోర్టుఆశ. ఆ ప్రయత్నంలో ఇటు కొద్ది అన్యాయంకాదు గొప్ప అన్యాయమే జరిగింది. అయినా ఒప్పుకున్నాం. ఒప్పుకున్నాక పంపకము కచ్చాపచ్చాగా జరగడానికి వీల్లేదనిగాని, జరిగిన పంపకానికి ఊరుకుని ఎప్పటికీ నోరెత్తవద్దనిగాని చెప్పడాని కెవరికీ హక్కు లేదు.

అయ్యంగార్ లేఖలో సూచించినట్లు విభాజకసంఘాన్ని నియమించవలసినదీ మద్రాసు మంత్రివర్గం. జె. వి. పి. రిపోర్టు ఆశయాన్నీ, జనవరి 26 లోగా గవర్నర్‌జనరల్ ఉత్తరువు రావలసిన అగత్యాన్నీ గుర్తుంచుకుని మద్రాసు మంత్రివర్గం వెంటనే కార్యాని కుపక్రమించవలసింది. కాని మద్రాసుప్రభుత్వం అవసర వివరాలన్నిటినీ తయారుచేసి సిద్ధపడమని చెప్పి మాసవారీమంత్రివర్గసమావేశానికి చర్చను వాయిదా వేసింది. మంత్రులు దేశసంచారానికి బయలుదేరారు. అయ్యంగార్ లేఖప్రకారం అనుసరిస్తే ఆంధ్రరాష్ట్రం వాయిదాపడక తప్పదు. ఈ విషయాల్ని ఇప్పుడైనా మంత్రివర్గం చర్చించి జె. వి. పి. రిపోర్టుఆదేశం ప్రకారం త్వరపడ్డం మంచిది. ఆంధ్రరాష్ట్రం రావడం రాకపోవడం మంత్రివర్గంపైనా, ముఖ్యంగా తెలుగుమంత్రులపైనా, నిర్మించబడనున్న విభాజకసంఘంపైనా ఆధారపడిఉంది.

ఒక జాతి లేదా ఒక ప్రాంతం న్యాయమైన వాంఛలు ప్రకటించిందంటే బాధ్యులైన అధికారులు తీర్చనిపక్షంలో, ప్రజలకు ప్రభుత్వాధికారంపట్లనూ, రాజ్యాంగవిధానంపట్లనూ-విశ్వాసం ఆదరం నశించగలవు. కేంద్రప్రభుత్వం కేంద్రకాంగ్రెస్ వర్గాల వైఖరివల్ల దేశంలో అసంతృప్తి ప్రబలుతోంది. దీనికి కన్నడశాసనసభ్యుల రాజీనామాయే తార్కాణం. తాడు నదేపని లాగుతుంటే ఎప్పుడో తెగక తప్పదు. ఆతరవాత, దేశంలో అనైక్యత, భాషావాదపిశాచం, కమ్యూనిస్టుముప్పు, అరాచకం అంటే లాభంలేదు. [సూర్యనారాయణ]

కులాసాకబుర్లు :

అద్దంలో అందం

[శ్రీ జి. యస్. సూరి]

అంబుధిలో అలలు చూస్తున్నా, అద్దంలో అందంచూస్తున్నా విసుకుపుట్టదుట సముద్రపు కెరటాలమాట ఎట్లా ఉన్నా అద్దాలసంగతి మాత్రం అక్షరాలానిజం. ఎవడి దృష్టిలో వాడు లోకంలోకల్లా అందగాడు. అట్లా అనుకోనకపోతే ధీమాగా వ్యవహరించలేడు. పదిమందిలో నిభాయించుకు రాలేడు. అద్దంఇచ్చే ఆత్మవిశ్వాసం ఇంతా అంతా అని చెప్పలేము. మద్దత్ ఇచ్చి హుషారుచేయటంలో దానికి మించినది లేదు.

అద్దానికి అందరూ దాసుల్లుఅయినప్పటికీ మగవారు ఆడవారినీ ఆడవారు మగవారినీ ఈ విషయంలో ఎత్తిపొడవటం పరిపాటిఅయింది. ఈ తగాదా తేల్చివేయటానికి బుద్ధిమంతులు కొందరు ప్రయత్నించిచూచారు. జంతులమారి పరిశోధనలు చేశారు. అద్దానికి బానిస ఆడదేనని నిరూపించారు, ఒక మతంవారు. అంతకు మించిన గులాము మగవాడేనని నిర్ధారణచేశారు. మరొక మతంవారు. ఈ సమస్య ఐక్యరాజ్య సమితివారు ఏమైనా తేలుస్తారేమో చూడాలి.

న్యూయార్కు పట్టణంలో పెద్ద కంపెనీ ఆఫీసు ఒకటి ఉన్నది. దానిలో ఒక వందమంది మగగుమాస్తాలు, వందమంది ఆడగుమాస్తాలూ పని చేస్తారు. మేడమీది హాలులో స్త్రీలు, క్రింది హాలులో పురుషులు ఉంటారు. ఆఫీసుకు అంతటికీ ఒక్కటే సింహద్వారం కావటాన దానిలో నుంచే ఉభయుల రాకపోకలు జరిగేవి. సాయంత్రం నాలుగ్గంటలకే పెద్దగంట మోగేది. అప్పటికి ఆ గంటసేపటినుంచీ రెండుకళ్లూ గడియారంమీద నిలిపిఉంచిన జనాభాయావత్తూ ఎప్పుడు బయటపడదామా అని హడావుడిగా బయలుదేరేవారు. రెండుదళాలు సింహద్వారం దగ్గర తారసిల్లేవి. మర్యాదరామన్నలూ ముసలి పేరంటాళ్లూ కొంచెం వెనకకు తగ్గినా కుర్రకారు యావత్తూ ఆడ మగ భేదంలేకుండా భుజబలపరాక్రమం చూపించేవాళ్లు. దోమకుత్తుకలో నుంచి కుంజరయూథం వస్తున్నట్లు కనబడేది.

ఆఫీసు ఖామందు ఈ హంగామా జరగకుండా చేయటానికి ఎంతో ప్రయత్నించాడు. నయానా భయానా చెప్పిచూశాడు. ఆడవాళ్లని అటకాయించడం ఏమి పెద్దమనిషితనమర్రా అని మగవాళ్లని మందలించాడు. మగవాళ్లను నెట్టుకుపోవటం ఏమి మరియాదర్రా అని ఆడవాళ్లను హెచ్చరించాడు. ఎంతమాత్రం ప్రయోజనం కనబడలేదు. మాటలసందర్భంలో ఆయన భార్య ఒకనాడు చక్కని సలహా ఇచ్చింది. ఆ మరునాటి ఉదయానికల్లా మేడమీద మెట్లదగ్గరగా ఒక పెద్ద నిలువుటద్దం తయారయింది. అంతటితో సింహద్వారపు తాకిడి సమసిపోయింది. మగగుమాస్తాలు వెళ్లిపోయిన పదినిముషాలకుగాని ఆడగుమాస్తాలు మెట్లు దిగేవాళ్లుకారు. అది అంతా అద్దంచలవ.

నిలువుటద్దాలు లేని కాఫీహోటలు వ్యాపారంలో ఎక్కరాదు. దూదిపింజలలాంటి ఇడ్లీ ఇవ్వనివ్వండి; పూతరేకులవంటి పెసరట్లను ఇవ్వనీయండి; ఘుమఘుమలాడే గులాబ్జామలను ఇవ్వనీయండి. గోడలనిండా అద్దాలు లేకపోతే బేరం బిగిసిందన్నమాటే. తప్పనిసరి అయితేనే తప్ప ఎవ్వడూ తినేందుకు వచ్చిన పాపానపోడు. ఒకవేళవచ్చినా ధుమధుమలాడుతూ ప్రతిపదార్థానికీ వంకపెడతాడు. గంటకు ఒకటి అందిస్తారేమని కసురుకుంటాడు. అందువల్ల ప్రతిహోటలులోనూ బల్లలకుమించిన అద్దాలు ఏర్పాటుచేస్తారు. అద్దానికి ఎదురుగా ఉండే కుర్చీలకోసం ఏలినంగా తొక్కిసలాడుతారో గమనించవలసిన విషయం. అద్దం ముందు కూర్చోబెట్టి అంబలిపోసినా అమృత తుల్యంగా తోస్తుంది.

చాలాకాలంవరకు అద్దాల ఆకర్షణ మనుషులకేనని అనుకునేవాళ్లం. ఒకసారి రైలు ప్రయాణంచేస్తున్నప్పుడు ఏదో స్టేషనుదగ్గర బండి ఆగింది. ఆవరణంలో ఎక్కడచూసినా కోతులు తిరుగుతూ ఉన్నవి. మా పెట్టెలో ఒక పెద్దమనిషి ఏదో మించుకుపోయినట్లు కిటికీలో చిన్న అద్దం పెట్టి తలదువ్వటం మొదలుపెట్టాడు. ఇంతలో ఒక కోతి చలీచప్పుడూ కాకుండావచ్చి అమాంతం అద్దాన్ని ఎత్తుకుపోయింది. రైలులో వాళ్లు కేకలువేస్తున్నా లెక్కచెయ్యక స్టేషను కప్పుమీదికి ఎక్కి కూర్చున్నది. ఎంతో సుతారంగా అద్దాన్ని పట్టుకుని చూసుకోటం మొదలుపెట్టింది. చూస్తూ ఇకిలించింది; పకిలించింది, వెక్కిరించింది. ఇంతలో ఇంకొక పెద్ద కోతి వచ్చి ఆ అద్దాన్ని లాక్కొని అదేమాదిరి చేయటం సాగించింది. ఈలోపుగా రైలు కదిలింది. అద్దం పోగొట్టుకున్న సోకుదారుతప్ప మిగతా ప్రయాణీకులంతా హాయిగా నవ్వుకున్నారు.

మా ఇంటిసావడిలో పెద్ద అద్దం ఒకటి ఉంటుంది. ఎలా వచ్చిందో కాని ఒకరోజున చూసేసరికి ఒక పిచ్చుక దాని చట్టంమీద వాలి ఉన్నది. కొంతసేపు తన ప్రతిబింబాన్ని చూస్తూ కూర్చునేది. కొంతసేపు ఎగురుతూ టక్కుటక్కున పొడవడం మొదలుపెట్టేది. ఎక్కడికీ పోకుండా సాయంత్రంవరకూ ఈ విధంగానే కాలం గడిపేది. మరునాడు మళ్లీ తయారై అదే కార్యక్రమం జరిపింది. తిండిగొడవే ఉండేదికాదు. మూడురోజులైనతరువాత దాని క్షోభ చూడలేక అద్దానికి గుడ్డ కప్పాం. ఆ తరువాత రావటం మానివేసింది పిచ్చిక. ఈలోపున మేమందరంపడిన యాతన ఇంతాఅంతా కాదు.

అద్దప్రస్తావన వచ్చినప్పుడు చిత్తూరు పద్మిని జ్ఞాపకం రాక తప్పదు. అల్లావుద్దీన్ పాదుషాకు అందమైన ఆడవాళ్లనుచూసి సంతోషించే సరదా ఉండేదిట. నవాబుగారి మెహర్బానీ సంపాదించే సర్దారులు రాణాగారి రాణి అందచందాలను ప్రబంధఫక్కీలో వర్ణించారుట. దానిమీద పాదుషావారికి ఎట్లాగైనా ఆమెను చూసితీరాలనే సంకల్పం కలిగి మధ్యవర్తులను కదిలించిచూశారుట. అందువల్ల ఫలితం ఏమీ కనబడనందువల్ల చతురంగబలాలతో తరలిపోయి నానా జాతరాచేసి చిట్టచివరకు అద్దంలోనైనా ఆమెను చూపమని ప్రాధేయపడి, ఆ దివ్యసుందరవిగ్రహం కనబడగానే దాఢీ దడదడ కొట్టుకుని మూర్ఛపోయినాడుట.

మా క్లబ్బు పేకాటబల్లదగ్గర రోజూ ఒక కళ్లజోడునాయుడుగారు తయారయేవాడు. ప్రతిసారి పేకముక్కలు పంచుతున్నప్పుడు కళ్లజోడు తీసి బల్లమీద పెట్టేవాడు. ఆట మొదలుకాగానే కంటికి తగిలించుకొనేవాడు. చాలాకాలంవరకూ ఈయనవిషయం బోధపడేదికాదు. చుట్టుపక్కలవారి ముక్కలు తెలిసినట్లు ఆడేవాడు. చివరకు మావాడుఒకడు రహస్యం కనిపెట్టాడు. కంటిజోడును మామూలు అద్దంగా ఉపయోగించి పరిసరప్రాంతాలలోని పేక ముక్కలను పసిబట్టేవాడుట. అప్పటినుంచి ఆయనపేరు అల్లాఫత్తీనాయుడుగారు అని క్లబ్బురికార్డులలో ఎక్కిపోయింది.

మన శాసనసభలలో గోడలను యావత్తూ అద్దాలతో నింపటం ముఖ్య అవసరంగా తోస్తున్నది. ప్రశ్నలు వేసేప్పుడు సభ్యుల ముఖాలు ఎట్లా ఉంటాయో, జవాబులు చెప్పేప్పుడు మంత్రుల ముఖాలు ఎట్లా ఉంటాయో, చర్చలు జరుపుతు నీవు అంటే నీవు అనుకునేప్పుడు ఉభయుల ముఖారవిందాలు ఎట్లా ఉంటాయో ఎవరికివారు ఎప్పటికప్పుడు చూచుకొంటూ ఉంటే మంచిది. ఒక్కసారి చూచుకుంటే శాసనసభలో సగం ఉపన్యాసాలు తగ్గిపోగలవు. అద్దాలనుగనుక ఉంచినట్లయితే సభ్యులు ఎవ్వరు నిద్రపోరు. పచార్లు చేయటానికి బయటికి వెళ్లరు. అందాకా ఎంగకు మనరాజ్యాంగసభలో చుట్టూ అద్దాలను పెట్టినట్లయితే మన రాజ్యాంగశాసనం గాంధిగారు అవతారం చాలించకమునుపే తయారయేది.

నేటి ప్రపంచం

(9-వ పేజీ తరువాయి)

ప్రత్యేకోపసంఘానికి ఇంకా మూడు సంవత్సరాలపాటు సమర్పిస్తూ ఉండాలని ఈ తీర్మానం సూచించింది.

స్వయంపరిపాలనాధికారం లేని దేశాల సంఖ్య మూడేళ్లలో ప్రత్యేకోపసంఘపర్యవేక్షణక్రింద 74 నుంచి 62 కు తగ్గింది. పన్నెండుదేశాలు స్వయంపరిపాలనాధికారం పొందినాయి.

ఈ ప్రత్యేకోపసంఘం 1946 సంవత్సరాంతాన మూడేళ్లకు నియమించబడింది. స్వయంపరిపాలనాధికారం లేని దేశాలలో ప్రజల రాజకీయాభివృద్ధికీ, స్వయంపరిపాలనాధికారం ప్రజల కివ్వడానికీ పాలకదేశాలెట్టి చర్యలు తీసుకుంటున్నవో పరిశీలించి సూచనలు చెయ్యడానికి సంఘం స్థాపించబడింది. ఇటువంటి దొక సంఘం తాత్కాలికంగా గాక శాశ్వతంగా స్థాపించబడాలని భారతప్రతినిధి అప్పుడు పట్టుపట్టినప్పటికీ అమెరికాయున్యైటెడ్ ప్రభుత్వంపైన తాత్కాలికస్థాపనకు అంగీకరించారు. ఇప్పుడింక ఈ సంఘాన్ని రద్దుపరచాలని బ్రిటన్, ఫ్రాన్సు మొదలైన దేశాలు పట్టుబట్టాయి పరాయిపాలన క్రింద ఉన్న ప్రజల్ని ఉద్ధరించే కర్తవ్యం ఐక్యరాజ్యసమితిపై ఉన్నదని భారతప్రతినిధి అన్నాడు. కాని "ఈ వలసలు మాస్వంతం. ఈ వలసలవిషయంలో సమితికి జోక్యం చేసుకునే అధికారం లేదు" అని బ్రిటన్ ఫ్రాన్స్, బెల్జియం వాదించాయి

"స్వయం పరిపాలనాధికారం గాని, పూర్తి స్వాతంత్ర్యంగాని లేని ప్రాంతాలన్నిటా ప్రజలకు పరిపాలనలో ఏ వంతు అధికారమూ ఉండదనీ, ఆప్రాంతాల పరిపాలన నిరంకుశంగా ఉంటుందనీ, ఒక అపోహ ఏర్పడినట్లు కనిపిస్తోంది. ఈ అపోహ తొలగించడానికి బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులు అనేకపర్యాయాలు ప్రయత్నించారు. కాని ఈ యత్నాలు విఫలమైనట్లున్నాయి వాస్తవానికి బ్రిటిషువలసల్లో ప్రజలు కొన్ని స్వతంత్రదేశాలలోని ప్రజలకంటె మేలు స్థితిలోనే ఉన్నారు" అని బ్రిటిషు ప్రతినిధి హెక్టర్ మెక్నీల్ అన్నాడు. కాని ఈ మాటల్లో ఎంత నిజం ఉందో భారతీయులకు, తదితరులకు తెలుసును.

"మా వలసల్లో జోక్యానికి ఐక్యరాజ్యసమితి వెనకనుంచి తోసుకువస్తోంది." అని బిటిషు ఉపమంత్రి లార్డ్ లిస్టోవెల్ బ్రిటిషు లార్డ్స సభలో అన్నాడు. ఈవలసల్లోకి దోడ్డిగుమ్మంద్వారా బ్రిటిషువారు ప్రవేశించి దేశీయుల్ని రాజకీయదాస్యానికి తెచ్చారన్న విషయాన్ని చిన్నరాజ్యాలేవీ మరచిపోలేదు. ఈ తీవ్రప్రతివాదాల్ని త్రోసిపుచ్చి ఐక్యరాజ్యసమితి సర్వసభ్యసమావేశం మరొక మూడు సంవత్సరాలు ప్రత్యేకోపసంఘం ఉండాలనీ, ఆ సంఘానికి వలసల యజమానులు వలసలకు సంబంధించిన సమాచారాన్ని సమర్పించాలనీ తీర్మానించింది.

[సూర్యనారాయణ]

బూచివాడు

(17-వ పేజీ తరువాయి)

ఏమిటి? వాడికియిష్టం వస్తే వస్తాడు - లేకపోతే మానుకుంటాడు—

బాబు : పడుకోకపోతే వస్తాడని చెప్పావు కదూ?

తల్లి : నిన్న ఆలాగే అనుకున్నాను—

బాబు : అయితే ఇప్పుడు రాడా?

తల్లి : ఏమోబాబు, నీమాటలతో నాకు విసికేస్తున్నది.

బాబు : ఎల్లా ఉంటాడమ్మా బూచివాడు?

తల్లి : నల్లగా ఉంటాడు - ఆసంగతి ఇదివరకే చెప్పానుగా?

బాబు : కత్తా, గొంగడీ ఉంటాయా?

తల్లి : ఆఁ, ఎందుకు ఉండవు? అవి లేకండా వాడు బయటికి కదలడు—

బాబు : అంతా ఉత్తదే — అవి ఉండవే ఉండవు.

తల్లి : ఎవరు చెప్పారు నీకు ఉండవని?

బాబు : నాన్నా, అన్నయ్యా చెప్పారు.

తల్లి : తప్పు చెప్పుతుంటారు—

బాబు : కాదమ్మా అసలు బూచివాడు ఉంటాడా?

తల్లి : ఎందుకు ఉండడు—ఉండడని ఎవరు చెప్పారు?

బాబు : నీవు, వాడు రాత్రిళ్లు వస్తాడని చెప్పావు. నాన్న ఎప్పుడు పడితే అప్పుడేవస్తాడని చెప్పాడు. ఏదీ నమ్మడానికి వీలులేదు.

తల్లి : నేనే పొరబడ్డాను. వాడు ఎప్పుడు పడితే అప్పుడే వస్తాడు.

బాబు : అంతా అబద్ధం—అల్లరిచేస్తే వస్తాడని అన్నయ్య, నాన్నా చెప్పారు—అల్లరి చేశాను. అల్లరిచేస్తే, అన్నయ్య గదిలోనించి వెళ్లగొట్టాడే కాని బూచివాడు రాలేదు ఈ రోజు రాత్రి వస్తాడని నీవు చెప్పావు—ఇంతసేపు కూర్చున్నా, వాడు రాలేదు. అందుకోసం, అసలు బూచివాడు లేనేలేడని నేను అనుకుంటున్నాను.

తల్లి : ఎందుకు లేడు? ఉన్నాడు - ఉన్నాడని నేను చెబుతున్నాగా?

బాబు : లేడు, లేడు, లేడు - ఉంటే ఈపాటికి తప్పక కనపడేవాడే - చూపించమని అన్నయ్యనూ, నాన్ననీ, నిన్నూ అడిగాను - కాని ఎవ్వరూ చూపలేదు.

తల్లి : అందుకోసమే లేడంటున్నావా?

బాబు : లేకపోతే లేడంటాను. అనవసరంగా ఎందుకు అంటాను —

తల్లి : నీకెవరు చెబుతారు బాబు - ఒకరు చెబితే నీవు అసలువింటావా?

బాబు : అబద్ధాలు చెబితే ఎందుకు వింటాను. నిజం చెబితే వింటాను.

తల్లి : పోనీ బూచివాడు లేడు - ఇకపడుకో.

బాబు : లేడుకదూ? లేడని నేను మొదటే చెప్పాను.

తల్లి : ఇక నన్ను అట్టే వేధించకు - ఇక పడుకో.

బాబు : లేడని గట్టిగా చెబితే పడుకుంటాను.

తల్లి : సరే లేడు - ఇకనైనా పడుకో.

బాబు : పాటపాడితే పడుకుంటాను కే పూరి లేడంటే పడుకొంటానా?

తల్లి : సరేపాడుతాను - ఇకబబ్బో.

బాబు : పాడమరి బబ్బుంటాను - బూచివాడు లేడుకదూ?

తల్లి : లేడని ఎన్నిసార్లు చెప్పాలి - మాబంతిగారు బాబుకదూ ఇకబుబ్బో—

బాబు : ఇదిగో కళ్లుమూసుకుంటున్నాను. బూచివాడని, ఇక ఎన్నడూ భయపెట్టవు కదూ?

తల్లి : భయపెట్టను - ఇక పడుకో.

బాబు : మా అమ్మొ బంగారుతల్లి - పాట పాడు ఇంకపండుకుంటాను.

(తల్లి తీయతేనియ గొంతుకతో చక్కని జోలపాటపాడుతుంది. పాడుతూ బాబుని చిచ్చికొడుతుంది. అల్లరిబాబు బూచివాడి ఊసు మరిచి, పాటకి ఒళ్లు తెలియకుండా, హాయిగా నిద్రపోతాడు)



మాడిసన్‌లోని ఎడ్జివాటర్ హోటల్ మేనేజరుకూతురు ప్రధానామాత్యునికి పండ్లబుట్టను బహూకరించిన దృశ్యం.

హైదరాబాదులో నేటి కార్మికస్థితి

(19-వ పేజీ తరువాయి)

1353 ఫ. 1944 - ఫాక్టరీస్ రెగ్యులేషన్, 1349 ఫ. 1940 వర్క్ మెన్సు కాంపెన్సేషన్ యాక్ట్, 1351 ఫ. 1942 మెటర్నిటీ బెనిఫిట్ యాక్టు, 1354 ఫ. 1945 ట్రేడ్‌యూనియన్స్ యాక్టు, 1351ఫ. 1942 ట్రేడ్‌డిస్ప్యూట్స్ ఆర్డర్. 1354 ఫ. 1945, స్టాండింగ్ ఆర్డర్స్, కండిషన్ ఆఫ్ ఎంప్లాయిమెంటు - రెగ్యులేషన్ ఆర్డర్, 1357 ఫ. 1949 ఎంప్లాయిమెంట్ ఆఫ్ చిల్డ్రన్ యాక్ట్, 1358 ఫ. 1948 - ప్రావిడెంట్ ఫండ్ యాక్ట్.

కార్మికవిధానములో ఏకత్వము దెచ్చుటకును రాష్ట్రములలో కార్మికులనుభవించుచున్న సాంఘికభద్రతలను సౌకర్యములను ఇచ్చుటకు కార్మికులకు కలిగించుటకును భారతప్రభుత్వము లోను, రాష్ట్రములలోను ప్రస్తుతమున్న బిల్లులు శాసనముల ననుసరించి ఇపుడున్న నిబంధనలను సవరించవలెనని లేదా క్రొత్తవాటిని వాటిస్థానే జారీచేయవలెనని కార్మికశాఖ ప్రతిపాదిస్తున్నది.

1949 భారతప్రభుత్వ ఫాక్టరీలచట్టము ననుసరించి ఒక ముసాయిదా తయారుచేయబడినది. దీని నొక నిబంధనరూపములలో అమలుపర్చుట ఆలోచింపబడుచున్నది. ఇప్పుడు అమలులోనున్న దానిస్థానే భారతప్రభుత్వ ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంటు - స్టాండింగ్ ఆర్డర్ - యాక్టు ననుసరించి యొక చట్టముచేయుట కుద్దేశింపబడుచున్నది. ట్రేడ్‌యూనియనుల నమోదు కొన్ని షరతులకు లోబడి తప్పనిసరిగా విధించుతూ తయారుచేయబడిన ట్రేడ్‌యూనియన్స్ అమెండ్‌మెంట్. బిల్లుముసాయిదా తయారుచేయబడి ప్రభుత్వమునకు సమర్పింపబడినది. ఫాక్టరీలుకాక ఇతరత్రా పనిచేస్తున్న కార్మికులు పనిచేయుకాలం, జీతముల బట్వాడా వారం వారం సెలవుదినాలు, అధికకాలము పనిచేసినందులకు జీతము మొదలైనవాటిని షాప్స్ ఎంప్లాయీస్ రెగ్యులేషన్ క్రమబద్ధములు చేయనున్నది. జారీచేయబడిన తర్వాత ప్రథమముగా అది హైదరాబాద్ - సికిందరాబాద్ నగరములలో అమలుపరచబడి ఆ తర్వాత బరీదాలో ప్రచురితముచేసి, 20 వేలు, అంతకు మించిన జనాభా కల పట్టణములకు వ్యాపింపబడగలదు.

ట్రేడ్ డిస్ప్యూట్ ఆర్డర్ స్థానే మధ్యవర్తిత్వము, విచారణ, పరిష్కారములకు అవకాశమేర్పరుచుచు, 1947 భారతప్రభుత్వ ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ ఆర్డర్, ప్రాతిపదిక పైన ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ రెగ్యులేషన్ జారీ చేయవలెనని కూడా ప్రతిపాదింపబడినది.

పరిశ్రమల్లో నియమితులై శ్రమచేస్తూ, తగినట్లుగా వ్యవస్థల నేర్పరచు కొన్నిచోట్ల కనీస వేతనములను నిర్ణయిస్తూ, భారతప్రభుత్వములో అమలులోనున్న చట్టము ననుసరించి మినిమం వేజెస్ యాక్టును జారీచేయవలెనని కూడా అభిలషింపబడుచున్నది.

కార్మికులు, ఇళ్ళలో పనిచేసే నౌకర్ల జీతముల యావత్తునూ జప్తినుండి మినాయించుతూ ఇటీవల సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 308 - ఎస్ సవరించబడినది.

కార్మికుల పేటలు మొదలైనవి నిర్మించడానికి భూములను సంపాదించుటకు కంపెనీలకు అనువుకలుగునట్లు లాండ్ యక్విజిషన్ యాక్టు సవరింపబడినది. సంస్థానములో కర్మాగారములలో పనిచేయుచున్న కార్మికుల పరిస్థితులను విచారించుటకు శ్రీ డి. వి. రెగె, ఐ. సి. యస్. అధ్యక్షుతన ముగ్గురు సభ్యులు కల ఒక కమిటీని ప్రభుత్వము నియమించినది. బేసిక్ జీతముల రేట్లు, కరువుభత్యము స్కేలు, వానిని సరిచేయు విధానము సంస్థానములో ఇప్పుడు అమలులో నున్న కార్మికశాసనములు సంరక్షణపథకములు మొదలైన వాటిలో యాజమాన్యముతో కలసి కార్మికులు పనిచేయుట, పారిశ్రామిక తగాయిదాలను నిరోధించుట, సాంఘిక భద్రత ప్రావిడెంటు ఫండు మొదలైన వాటికి సంబంధించి అధికముగా ఎట్టి కార్మిక శాసనములు చేయవలెను. అను విషయములతో పాటు అనేక కార్మికసమస్యలను కమిటీ పరిశీలించవలసియున్నదే. బహుస్వల్పకాలంలో, కొన్నిర నెలల్లోనే యీ కమిటీ, జిల్లాల్లోను, నగరములోను, అంతకంటె అధికముగా ఫాక్టరీలను, సందర్శించి తన పనికి కావలసిన సరంజామాను సిద్ధము చేసికొన్నది. డిసెంబరు నెలలో రెగెకమిటీ తన రిపోర్టును ప్రభుత్వమునకందజేయగలదని భావింపబడుచున్నది.

సంరక్షణ-చర్యలు:

ఫాక్టరీలు, గనులు, రైల్వేలు మొదలైన వాటిలో పనిచేయుచున్న కార్మికుల యోగక్షేమాలను చూచుట, ప్రస్తుతము అమలులోనున్న చట్టముల వలన కార్మికులకు సంక్రమించిన హక్కులు వారికి నిరాకరించబడకుండా చూచుటయును కార్మికశాఖ యొక్క ప్రథమకర్తవ్యము. దీనికొరకు సుభా, జిల్లాలలేబర్ వెల్‌ఫేర్ ఆఫీసర్లు పరిశ్రమలను ఫాక్టరీలను సంతతమూ తనిఖీచేస్తూ పర్యటనచేస్తున్నారు. సంస్థానముతో బాలస్త్రీకార్మికులలో క్షేమమును చూచుటకు, మెటర్నిటీ బెనిఫిట్ యాక్టు ఎంప్లాయిమెంట్ ఆఫ్ చిల్డ్రన్ యాక్టులను అమలుపరుచు ఇద్దరు స్త్రీ వెల్ఫేర్ ఆఫీసర్లు వున్నారు. ప్రస్తుతము పునర్విమర్శింపబడుచున్న సంవత్సరములో సంస్థానములోగల ఫాక్టరీలను రెండువేల సార్లకుమించి సందర్శించుటజరిగినది. పనిచేయు కాలము పరిశుభ్రత, మంచినీటి వసతులు, వైద్యసదుపాయములు, విశ్రాంతిశాలలు, మాతృత్వకాలములో జీతముల బట్వాడా, కార్మికులకు నష్టపరిహారము మొదలైనవాటి విషయములో ఈ సమయములందు ఆయాయాజమాన్యములకు యుత్తరవు లీయబడినవి. అమలులోనున్న శాసనముల నియమములను అతిక్రమించినందులకు కొన్ని సందర్భములలో యాజమాన్యములపై కేసులు పెట్టబడినవి. అన్ని కేసులలోనూ యాజమాన్యములకే జుల్మానా శిక్షలు విధింపబడినవి. పరిస్థితులు ఇటీవల మార్పులు చెందినవి గనుక ప్రస్తుతము అమలులోనున్న నిబంధనలో ఆయా నియములు లేకపోయినను భారతరాష్ట్రములలో కార్మికు లనుభవించుచున్న సౌకర్యములు సదుపాయములు ఇచ్చుటి కార్మికుల కీయవలసినదని యాజమాన్యములకు నచ్చజెప్పుటయందు లేబర్ కమీషనర్ యొక్క యుద్యోగులు తమ కట్టియవసరము లేకపోయినను వెనుదీయుటలేదు. 200 మందికి మించి కార్మికులను నియమించుచున్న సంస్థలు చట్టరీత్యా ఫలహారశాలలను నిర్వహించి తీరవలెను. కాని ఇంతకు తక్కువ ప్రాముఖ్యము గల్గియున్నవాటి యజమానులకు కూడా కార్మికులకు క్షేమసౌకర్యము లేర్పరచవలసినదని కార్మికశాఖ నచ్చజెప్పుచున్నది.

కార్మికులకు విద్యావిషయికములైన సినీమా ప్రదర్శనముల నిచ్చుటకు ఏర్పాటులు జరిగినవి. కార్మికశాఖయొక్క కోరికపైన ఆరోగ్యశాఖ ఆరోగ్యము, పారిశుధ్యతలమీద ఉపన్యాసము లిచ్చినది. మద్యనిషేధమునుగూర్చి ప్రచారపూర్వకములైన యుపన్యాసములు జేయబడినవి.

పారిశ్రామికసంస్థలలో సహకారోద్యమమునకు హెచ్చరిక నిచ్చుటకు తీవ్రమైన కృషి జరుపబడినది, జరుపబడుతున్నదికూడా. సహకారశాఖతోడ్పాటుతో ఋణము, వినిమయదారుల సంఘము లేర్పరచబడినవి. ఈ సంఘములు సక్రమపద్ధతిలో నడచుట ధృవముచేయుటకు సహకారములు, అకౌంటెన్సీలలో శిక్షణ ఇవ్వబడినది. వీటికి కార్మికశాఖోద్యోగులు ట్రేడ్‌యూనియన్ల ప్రతినిధులుహాజరయినారు.

లేబర్ కమీషనర్ కార్యాలయము వారి ప్రయత్నములవలన, సుభా, జిల్లాల లేబర్ వెల్‌ఫేర్ ఆఫీసర్ల జాగ్రత్తవలన, చాలావరకు అన్ని ప్రముఖసంస్థలలోను, ఫలహారశాలలు వైద్యసహాయము ఏర్పాటు చేయబడినది. 50 మందికి పైగా స్త్రీలు పనిచేయుచున్నచోట్ల క్రెష్‌లుకూడా నెలకొల్పబడినవి.

సంరక్షణ సంఘములు


రాయచూర్, గుల్బర్గా, నాందేడ్, ఔరంగాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో ఆయా సివిల్ అడ్మినిస్ట్రేటర్ల అధ్యక్షతన సంరక్షణసంఘములు పనిచేయుట యారంభించినవి. స్థానికప్రాముఖ్యత కల్గిన కార్మిక సమస్యలను పరిష్కరించుటలో నివి ఉపయుక్తమైన కృషి చేయుచున్నవి.

కార్మిక సలహాసంఘము

కార్మికవిధానము, పారిశ్రామిక సంబంధములు, కార్మికశాసనములు, తత్సంబంధమైన ఇతర విషయములలో ప్రభుత్వమునకు సలహానిచ్చుటకు సెప్టెంబరు నెల రెండవ వారములో ప్రభుత్వప్రతినిధులు, కార్మిక ప్రతినిధులు యజమానుల ప్రతినిధులు కూడిన త్రైపాక్షిక ప్రాతిపదికపై ఒక కార్మికసలహాసంఘము నియమింపబడినది.


ట్రేడ్‌యూనియన్ల నమోదు

హైదరాబాద్ ట్రేడ్‌యూనియన్ల చరిత్ర పోలీసుచర్యనాటినుండి యారంభమగుచున్నది. సంస్థానమందు భూస్వామికరాజ్య మంతరించి ప్రజాయుగోదయమైన తర్వాత తమ అభిప్రాయము లను స్వేచ్ఛగా చెప్పుకొనకుండా కార్మికులకు వేయబడిన శృంఖలములు ఛేదింపబడినవి. క్రొత్తగా ఏర్పడిన ఐ. యన్. టి. యు. సి. కార్మికులను సంఘటితపరచుట యారంభించినది. ఆ విధముగా ఏర్పడిన యూనియనులు ట్రేడ్ యూనియన్స్ యాక్టుక్రింద నమోదు చేయబడినవి. పోలీసుచర్యలకు పూర్వము నమోదైయున్న ట్రేడ్‌యూనియన్ల సంఖ్య 13 ఇప్పుడన్నవో 92 నమోదుచేయబడియున్నవి. మరియెన్నియో నిర్మాణదశలోనున్నవి. నమోదు చేయబడిన యీ యూనియనులు సంస్థానములోని ఫాక్టరీలు, గనులు, రైల్వేలలో పనిచేయుచున్న కార్మికులలో అధికసంఖ్యాకులకు ప్రాతినిధ్యము వహించుచున్నవి. వాటిలో చాలాభాగము ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసునకు మజ్దూరుసంఘమునకు చేరియున్నది. కొన్ని స్వతంత్రములు కూడా.



థాంప్సన్ ఇంజనీరింగు కాలేజి శతాబ్ద ఉత్సవ సందర్భంలో రూర్కీ నగరానికి విచ్చేసిన భారత ప్రధాని పండిట్ నెహ్రూ నవంబరు 25 న ఒక పెద్ద బహిరంగసభలో ఉపన్యసించటం ఈ చిత్రంలో కనిపిస్తుంది.

గ్రంథాలయోద్యమం, న్యూయార్కు




న్యూయార్కు కేంద్రగ్రంథాలయం



సంచార గ్రంథాలయం



న్యూయార్కు కేంద్రగ్రంథాలయంలోని సంగీతశాఖ



చదువురాని పిల్లలకు కథలు చదివి వినిపించుశాఖ

Red. No. M. 4479

శ్రీమద్భగవద్గీత

సంస్కృత మూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.


ఖద్దరు బైండు.

వెల రు 4-0-0 లు.

తపాలా ఖర్చు అ. 0-9-0.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212 మదరాసు 1.



కళాప్రపూర్ణ శ్రీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన



ఆంధ్రవాఙ్మయ చరిత్ర

నరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రలనన్నిటిని అవలోడన చేసి, సమన్వయించి క్రోడీకరించిన సినలయినచరిత్ర. శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైలపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన వలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు 0-7-0 ఆంధ్రగ్రంథమాల, పో. బా. 212, మద్రాసు.

గాంధీ మహాత్ముని

ఆత్మకథ

రెండు సంపుటములు

[చతుర్థముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి

అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0

ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో ,, 10-12-0

ఆంధ్ర గ్రంథమాల, పోస్టుబాక్సు నెం. 212, మదరాసు 1.

తెలుగుమెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

తెలుగుదనము, తెలుగుసంప్రదాయాలు, తెలుగుభాష అవతరించిన విధము, తెలుగు తేటదనము, తెలుగు కవితా పారమ్యము, ప్రాచీన గ్రంథాల పలుకుబడికి మనపై చెల్లుబడి, విలక్షణమైన మన అరసున్న చరిత్ర, వింత వింత నిఘంటువులు, మన గ్రంథాలలో గ్రంథులు, అవీ ఇవీ, ఇంకా తెలుగులో ఉన్న ఎన్నో మెఱుగులను చూపెట్టుచున్న వ్యాసముల సంపుటి. శాస్త్రిగారి పాతిక ముప్ఫయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించియున్నది. ఆంధ్రాభిమానముగల వారందరు అవశ్యము చదువవలసిన గ్రంథము ప్రతులకు త్వరపడవలెను.

వెల ౨ రూ. తపాలాఖర్చులు ౭ అణాలు.

ఆంధ్రగ్రంథమాల

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras.